అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 07-05-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 127 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



కిషన్‌రెడ్డి అసమర్థ నాయకుడు

ఐదేండ్లలో ఓ బ్రిడ్జి కూడా కట్టలే

- రాష్ట్రానికి కేంద్రం గాడిద గుడ్డునిచ్చింది
- బలహీనవర్గాలకు ఈటల ఏం చేశారు : అంబర్‌పేట, ఉప్పల్ రోడ్‌షోలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట/ ఉప్పల్

రాష్ట్రంలో ఎవరైనా అసమర్థ నాయకుడు ఉన్నారంటే అది కేవలం కిషన్ రెడ్డి మాత్రమే అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, సికింద్రాబాద్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి అంబర్‌పేట నియోజవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఇన్నేండ్లలో కనీసం ఫ్లైఓవర్ బ్రిడ్జిని పూర్తి చేయలేకపోయారని, అలాంటి అసమర్థ నాయకుడిని ఎన్నుకోవడం వృథా అని అన్నారు. నిత్యం ప్రజల కోసం పనిచేసే దానం నాగేందర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ అంబర్‌పేట నియోజక వర్గం ఫీవర్ ఆస్పత్రి దగ్గర, ఉప్పల్‌లో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ...13లో


రేవంత్‌కు రాజకీయ భవిష్యత్ శూన్యమే

బీజేపీకి 400 సీట్లు : బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

"ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలో మూడోసారి దేశంలో 400 సీట్లతో అధికారం చేపట్టబోతున్నాం.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి రాజకీయ భవిష్యత్ రద్దవ్వడం ఖాయం" అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన జనసభలో ఆయన ప్రసంగించారు. మోడీ ప్రధాని అయ్యాక ఉగ్రవాద దాడులు జరగలేదని తెలిపారు. నోట్ల రద్దుతో పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీశామని, మోడీ భయంతో ఇతర దేశస్థులు భారతదేశం వైపు చూడాలంటే జంకుతున్నారని చెప్పారు. కేసీఆర్ గతంలో తాను భయంకరమైన హిందువునని చెప్పినప్పుడు మత ...13లో



ప్రజాస్వామ్యం గెలిచేనా?


The New York Times

Modi's Temple of Lies

Why elections in India, the world's largest democracy

భారత్‌లో పరిస్థితులపై అంతర్జాతీయ మీడియా ఆందోళన

- మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని వ్యాఖ్య
- విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని ఆగ్రహం

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ మన దేశాన్ని 'విశ్వ గురు' అని అంటారు. విశ్వ గురు అంటే ప్రపంచ నేత అని అర్థం. అయితే ప్రపంచ దేశాలు భారత్‌ను అలా చూస్తున్నాయా? లేదనే చెప్పాలి. పలు అంతర్జాతీయ సమాజాలు, హక్కుల సంఘాలు మన దేశంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను తూర్పార పడుతున్నాయి. హిందూత్వ శక్తులు పెట్రేగిపోవడాన్ని వేలెత్తి చూపుతున్నాయి. ఐక్యరాజ్యసమితి నిపుణులు, పౌర సమాజ గ్రూపుల నుండి అంతర్జాతీయ మీడియా, వివిధ దేశాల పార్లమెంటేరియన్ల వరకూ భారత ప్రజాస్వామ్యం పనితీరును ఎండగట్టారు. గత నెల 16 నుండి 30వ తేదీ వరకూ ఆయా సంస్థలు, నాయకులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు....

సీఎన్ఎన్, అమెరికా

మోడీ పరిపాలనలో మతపరమైన విభజనలు చోటుచేసుకుంటున్నాయి. మతోన్మాదం ప్రబలుతోంది. హిందూ జాతీయతావాదాన్ని ముందుకు తీసుకుపోవడానికే మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. విధానపరమైన వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి దీనిని ఎంచుకున్నారు.

ఎన్‌పీఆర్, అమెరికా

అయోధ్యపై 2019లో సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం చూపిన ప్రభావాన్ని ఈ పత్రిక వివరించింది. దాని ప్రకారం...అయోధ్య తీర్పు నుండి ప్రేరణ పొందిన మధురలోని హిందూ జాతీయతావాదులు అక్కడి మందిరం, మసీదు వివాదానికి సంబంధించిన దశాబ్దాల నాటి ఒప్పందానికి స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు.

ది గార్డియన్, బ్రిటన్

సార్వత్రిక ఎన్నికలపై ఈ పత్రిక ఏప్రిల్ 24న తన సంపాదకీయంలో ఇలా రాసింది....నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్నికల్లో విజేత ఎవరైనా ఓడేది మాత్రం భారత ప్రజాస్వామ్యమే. ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం, పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడం వంటివి బలహీనమైన ప్రజాస్వామ్యానికి సంకేతాలు. ముస్లింలను చొరబాటుదారులుగా, అధిక సంతానం కలిగిన వారిగా పేర్కొంటూ రాజస్థాన్‌లో గత నెల 21న ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం విద్వేషపూరితం.

ది న్యూయార్క్ టైమ్స్, అమెరికా

అయోధ్యలో రామమందిర నిర్మాణం భారత్‌ను హిందూ దేశంగా మార్చింది. అసమానతలు, ఉద్యోగావకాశాలు లేకపోవడం, ప్రజారోగ్యానికి విఘాతం కలగడం, వాతావరణ మార్పుల విధ్వంసం వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేదు. దీనివల్ల ప్రపంచంలో భిన్నత్వం కలిగిన దేశాల్లో ఒకటైన భారత్ భయాందోళనలతో నిండిన దేశంగా మారింది.

పీబీఎస్, అమెరికా

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి కూడా పరీక్ష ఎదురవుతోంది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతాయా అనే దానిపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ది గ్లోబ్ అండ్ మెయిల్, కెనడా

పది సంవత్సరాల మోడీ పాలనలో భారత్ మారిపోయింది. హిందూ జాతీయతావాదులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. తద్వారా సామాజిక మాధ్యమాలపై ఓ కొత్త నైతిక కోడ్‌ను విధించారు. అది భారత్‌లోని రోజువారీ సమాజ జీవితాన్ని బెదిరిస్తోంది.

ఏబీసీ, ఆస్ట్రేలియా


తన దక్షిణాసియా బ్యూరో చీఫ్ అవనీ డయాస్‌కు భారత ప్రభుత్వం వీసా పొడిగింపును నిరాకరించడాన్ని ఏబీసీ ప్రస్తావించింది. సిక్కు వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యపై కథనాన్ని అందించడం ద్వారా ఆమె గీత దాటారని మోడీ ప్రభుత్వం అభిప్రాయపడింది. అందుకే వీసాను పొడిగించేందుకు నిరాకరించింది. ఆస్ట్రేలియా ప్రభుత్వం ఉన్నత స్థాయిలో జోక్యం చేసుకోవడంతో వీసాను పొడిగించారు. అయినా ఆమె భారత్‌ను విడిచి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

మీడియా సంస్థలతో పాటు పలువురు పార్లమెంటేరియన్లు, విదేశీ పాత్రికేయులు, నిపుణులు, అమ్నెస్టీ ఇంటర్నేషనల్, అమెరికా విదేశాంగ శాఖ, ఇండియన్ డయాస్పొరా గ్రూపులు, కౌన్సిల్ ఆన్ అమెరికన్-ఇస్లామిక్ రిలేషన్స్, ది ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్ వంటి సంస్థలు కూడా దేశంలో క్షీణిస్తున్న ప్రజాస్వామ్య విలువలపై ఆందోళన వ్యక్తం చేశాయి.

బీజేపీతో దేశ సమైక్యతకు ముప్పు

ఎన్డీయే మళ్లీ గెలిస్తే రాజ్యాంగం రద్దు

- ప్రభుత్వరంగముండదు, రిజర్వేషన్లుండవు
- రాజకీయాలు వ్యాపారమయం
- ధరల నియంత్రణలో మోడీ సర్కారు విఫలం
- విద్యుత్ సవరణ బిల్లు అమలైతే ఉచిత కరెంట్ ఉండదు
- కేంద్రం బ్లాక్‌మెయిలింగ్‌లో భాగమే రేవంత్‌కు నోటీసులు : మీట్ ద ప్రెస్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశ సమైక్యతకు, సమగ్రతకు బీజేపీతో ముప్పు పొంచి ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో విఫలమైన మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ మళ్లీ గెలిస్తే రాజ్యాంగం రద్దవుతుందనీ, ప్రభుత్వరంగం ఉండబోదనీ, రిజర్వేషన్లు తొలగించబడతాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వీరయ్యతో మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తన పదేండ్ల పాలనను చూపి ప్రజలను ఓట్లడిగే పరిస్థితి లేదన్నారు. అందుకే మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని విమర్శించారు. మతాన్ని, ...13లో

కవితకు మళ్లీ నిరాశే

బెయిల్ నిరాకరణ

- జగన్మోహన్ రెడ్డి కేసులోని అంశాలు ప్రస్తావన


(ఫైల్)

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టై తీహార్ జైల్‌లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ వ్యవహారంలో మరోసారి నిరాశే మిగిలింది. ఈడీ, సీబీఐ కేసులో ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను రౌస్ అవెన్యూ కోర్టు (ట్రయల్ కోర్టు) నిరాకరించింది. ఈ మేరకు సోమవారం సీబీఐ స్పెషల్ కోర్టు జడ్జ్ కావేరి బవేజా తీర్పును వెలువరించారు. మొత్తం 45 పేజీలతో కూడిన ఆర్డర్ కాపీలో కవితకు బెయిల్ ఇవ్వడానికి గల మెరిట్స్ ఏమీ లేవన్నారు. ఈడీ కేసులో ప్రధానంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి సంబంధించిన ఆర్థిక నేరాల కేసులో సుప్రీం ఆదేశాలను ప్రస్తావిస్తూ బెయిల్ నిరాకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి కేసుకు సంబంధించిన షరతులను కోర్టు గుర్తు చేసింది. నేరారోపణల స్వభావం, వాటికి సంబంధించిన సాక్ష్యాధారాల స్వభావం, నేరారోపణలు నిరూపణ అయితే పడే శిక్ష తీవ్రత, నిందితుడి ...13లో



పోరాడే శక్తులకు బలమివ్వండి

బీజేపీ మళ్లీ గెలిస్తే సనాతన ధర్మం అమల్లోకొస్తుంది

- సమాన హక్కులు పోతాయి
- కష్టజీవుల అభ్యర్థి జహంగీర్‌ను పార్లమెంట్‌కు పంపాలి : రామన్నపేట రోడ్‌షోలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-రామన్నపేట

"పొరపాటున బీజేపీ మళ్లీ గెలిస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దుచేసి, సనాతన ధర్మాన్ని అమలు చేస్తుంది. సనాతన ధర్మం అంటే మనుధర్మం.. మనుధర్మం అంటే అగ్రవర్ణ కుల ధర్మం.. దళిత బడుగు, బలహీన వర్గాలకు సమాన హక్కులు పోతాయి" అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. యాదాద్రి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రోడ్‌షో నిర్వహించారు. పార్టీ శ్రేణులు భారీగా తరలిరాగా.. పట్టణమంతా ఎరుపుమయంగా మారింది. ఈ సందర్భంగా తమ్మినేని ప్రసంగిస్తూ ...14లో

రూ.269 కోట్ల నగదు, మద్యం పట్టివేత

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోకసభ ఎన్నికల తనిఖీల్లో భాగంగా డిసెంబర్ ఒకటి నుంచి ఇప్పటి వరకు రూ. 2.69,70,61,990 విలువ చేసే నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఇందులో రూ. 92,60,64,307 నగదు, రూ. 57,45,45,553 మద్యం, రూ. 28,42,28,137 డ్రగ్స్, నార్కొటిక్స్, రూ. 60,76,25,640 బంగారం, వెండి ఇతర ఆభరణాలు, రూ .30,07,11,136 ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, ఇతర ప్రభుత్వ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ...13లో

అచ్ఛేదిన్ కాదు.. చచ్చేదిన్

'బీజేపీ ఎంపీలు గెలిస్తే మన హక్కుల కోసం పోరాడరు'

- కాంగ్రెస్ ప్రభుత్వంతో నాశనం
- కాంగ్రెస్ బోనస్.. ఓ బోగస్
- నిలదీశాను కాబట్టే నా బిడ్డ అరెస్టు
- కేంద్రంలో ప్రాంతీయ శక్తుల ప్రభుత్వమే..!
- నిజామాబాద్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి : రోడ్‌షోలో మాజీ సీఎం కేసీఆర్



నవతెలంగాణ- నిజామాబాద్‌సిటీ


నరేంద్ర మోడీ పాలనలో అచ్చేదిన్ కాదు.. చచ్చేదిన్ వచ్చిందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఏర్పాటు చేసిన రోడ్ షోలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. నిజామాబాద్‌లో గత ఎన్నికల్లో బీజేపీ ఎంపీ గెలిచారని, ఆయన వల్ల ఏమన్నా లాభం జరిగిందా..? అని ప్రశ్నించారు. 'నేను సీఎం అయినప్పుడు మోడీ కూడా ప్రధాని అయ్యారు. ఆయన ప్రధాని అయ్యే ముందు.. ప్రధాని అయిన తర్వాత వంద..యాభై నినాదాలు చెప్పారు. ఒక్కటన్న నిజమైందా..? సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అయిందా..? కాలేదు కదా దేశ్ కా సత్య నాశ్ అయింది. మేకిన్ ఇండియాలో, డిజిటల్ ఇండియాలో ఏమైనా వచ్చిందా..? బేటీ బచావో బేటీ పడావో అన్నారు. కానీ దేశంలో మహిళలపై లైంగికదాడులు పెరిగాయి.. బాలికలకు రక్షణ లేకుండా పోయింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని, రైతుల ఆదాయం రెట్టింపు కాలేదు' అని అన్నారు.

చనిపోయే వరకు నా గుండెల్లోనే నిజామాబాద్..

మోడీ గోదావరిని తీసుకుపోయి తమిళనాడుకు ఇస్తా అంటున్నాడు.. యుద్ధం చేద్దామా? వద్దా? అని కేసీఆర్ అడిగారు. "మన గోదావరి మనకే ఉండాలి.. ఆ నది మీద నీళ్ల హక్కు మనకు ఉండాలి.. ఆ హక్కు కావాలంటే నిజామాబాద్ పులి బిడ్డ బాజిరెడ్డి గెలవాలి" అని పిలుపునిచ్చారు. ఈ గ్యాస్ గాళ్లు గెలిస్తే.. ఉన్న గోదావరి ఊసిపోతదన్నారు. కేసీఆర్ చనిపోయే వరకు తన గుండెల్లో నిజామాబాద్ ఉంటుందన్నారు. 'బీజేపీ ఎంపీలు గెలిస్తే మోడీ దగ్గర చేతుల కట్టుకుంటారు. మన హక్కుల కోసం నోరు మెదపరు" అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరద కాల్వను నాశనం చేశారని, కరెంట్ కోతలు ఉన్నాయని అన్నారు. తాము ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పేరుతో ఒక్కో విద్యార్థికి రూ. 20 లక్షలు ఇచ్చామని, అది కూడా బంద్ పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలల్లోనే ఎందుకు మారిపోయింది.. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత కాదా..? అని ప్రశ్నించారు. తాను కూడా హిందువునేనని, కానీ రాష్ట్రంలో ఉన్న యావత్ ప్రజల ఆత్మబంధువు కేసీఆర్ అని అన్నారు. యువకులు ఆవేశంలో ఓటు వేయకుండా ప్రజాస్వామ్య పరిణితితో, విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఈ రాష్ట్ర భవిష్యత్ ఎవరి చేతిలో ఉంటే బాగుంటుందో అని కూలంకషంగా చర్చించి, ఓటు వేయాలని, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అన్ని విషయాల్లో మోడీని వ్యతిరేకించిన కాబట్టి నా బిడ్డ కవితను ...13లో

రైతులకు గుడ్‌న్యూస్

- రైతు భరోసా నిధులు రూ.2 వేల కోట్లు విడుదల
- రెండ్రోజుల్లో పంపిణీ పూర్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఐదెకరాల పైబడి భూమి ఉన్న రైతులకు ఆయా నిధులను గురువారంలోపు అందిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రూ. 2వేల కోట్లకుపైగా నిధులను విడుదల చేసినట్టు సమాచారం. ఐదెకరాల లోపు ఉన్న రైతులకు ప్రభుత్వం గతంలోనే రైతు భరోసా అందించింది. తాజాగా ఐదెకరాల పైబడిన వారికి కూడా రైతుభరోసా నిధుల చెల్లింపులను ప్రారంభించనున్నారు. మూడు రోజుల్లో లబ్దిదారులందరి బ్యాంక్ ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి.

రూ.15 కోట్ల పంట నష్ట పరిహారమూ విడుదల

రాష్ట్రంలో పంట నష్టపోయిన రైతులకూ ప్రభుత్వం నష్టపరిహారం అందజేయనుంది. వర్షాలు, వడగండ్ల వానలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించేందుకు ...13లో

నేడు వర్షసూచన !

- ఈదురుగాలులు వీచే అవకాశం
- అత్యధికంగా 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

13లో..

నేడే మూడో దశ పోలింగ్

- 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 93 స్థానాలకు ఎన్నికలు

వివరాలు 3లో

రాష్ట్రానికి అగ్రనేతలు

- ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- రిజర్వేషన్లు, రాజ్యాంగంపై వాఖ్యలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదారబాద్

లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు వారం రోజులే మిగిలి ఉండటంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఎర్రటిఎండల్లో మాటల తూటాలు పేలుతున్నాయి. అగ్రనేతల మధ్య మాటల యుద్ధనం నడస్తున్నది. తెలంగాణ వేదికగా రెండు జాతీయ పార్టీల మధ్య విమర్శల యుద్ధం నడుస్తున్నది. 10 నుంచి 12 సీట్లు లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ, ప్రచారాన్ని ముమ్మరం చేసింది. 14 సీట్లల్లో గెలుపే టార్గెట్‌గా పెట్టుకున్న కాంగ్రెస్ అగ్రనేతలను బరిలోకి దింపింది. ఆదివారం రాహుల్‌గాంధీ, బీజేపీ నుంచి హోంమంత్రి అమిత్‌షా రాకతో రాష్ట్రంలో ఒక్కసారిగా సీన్‌గా మారిపోయింది. సున్నితమైన అంశాలపై పరస్పర విమర్శలు గుప్పించున్నారు. బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని రాహుల్ మరోసారి పునరుద్ఘాటించారు.

ముస్లిం రిజర్వేషన్లు ఎత్తేస్తామనీ, ఎలాంటి పరిస్థితుల్లోనూ రాజ్యాంగాన్ని రద్దుచేయబోమనీ అమిత్‌షా చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చిన రిజర్వేషన్ల రద్దు అంశాన్ని రాష్ట్రానికి వచ్చిన బీజేపీ నేతలు ప్రస్తావిస్తున్నారు. ఏప్రిల్ 30న ప్రధాని నరేంద్రమోడీ ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో అల్లాదుర్గంలో పర్యటించినన సంగతి తెలిసిందే. ఈ నెల ఒకటిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హైదరాబాద్, ఆదివారం కాగజ్‌నగర్, నిజామాబాద్, మాల్కాజ్‌గిరిలో జరిగిన సభల్లో మాట్లాడారు. మళ్లీ ఈనెల 9, 10 లేదీల్లో వికారాబాద్, భువనగిరి, వనపర్తిలోనూ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. సోమవారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా సికింద్రాబాద్, మహబూబ్‌నగర్, మహబూబాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ థామీ సైతం ఈ మూడు చోట్లా పర్యటించనున్నారు. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ సికింద్రాబాద్ పరిధిలో నిర్వహించే ప్రవాసీ సమ్మేళన్‌లో పాల్గొంటారు. మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై సైతం రాష్ట్రంలో పర్యటన చేయనున్నారు.

ప్రధాని మోడీ ఈనెల ఎనిమిది, పదో తేదీల్లో ప్రచారం చేయనున్నారు. ఆదివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అలంపూర్, నిర్మల్ సభల్లో పాల్గొన్న విషయం విదితమే. తిరిగి ఈనెల తొమ్మిదిన రాష్ట్రానికి వస్తున్న రాహుల్, కరీంనగర్, సరూర్‌నగర్ జనజాతర సభల్లో పాల్గొంటారు. కాంగ్రెస్‌కు చెందిన మరో అగ్రనేత ప్రియాంక గాంధీ ఈనెల 10న రాష్ట్రానికి రానున్నారు. ఆరోజు కామారెడ్డి, తాండూరు, షాద్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు. ఈ రెండు పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. అత్యధిక సీట్లల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రచారం ముమ్మరం చేశాయి.

రేవంత్‌రెడ్డి ప్రమాణం చేద్దాం రా



కుల రిజర్వేషన్లను నెహ్రూ వ్యతిరేకించలేదా?

రాజీవ్‌గాంధీ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు వద్దనలేదా : లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రిజర్వేషన్లు, రాజ్యాంగం రద్దు అవుతాయంటూ రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. కుల ఆధారితంగా నెహ్రూ రిజర్వేషన్లు వ్యతిరేకించింది వాస్తవం కాదా? బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు వద్దని రాజీవ్‌గాంధీ అన్నది నిజం కాదా? దీనిపై భాగ్యలక్ష్మి గుడిలో ప్రమాణం చేసేందుకు సిద్ధమేనా?' అని రేవంత్‌రెడ్డికి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ సవాల్ విసిరారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సచార్, రంగనాథ్ మిశ్రా కమిటీలు బీసీల నోట్లో మట్టి కొట్టాయన్నారు. బీసీల్లో మైనార్టీలను చేర్చి అన్యాయం చేసింది వాస్తవం కాదా? అని నిలదీశారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందనీ, పదేండ్ల మోడీ పాలనలో మచ్చుకైనా అవినీతి జరగలేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ముస్లిం ఓట్ల కోసం పాకులాడుతున్నారన్నారు. మోడీ మూడోసారి ప్రధాని కాగానే యూనిఫాం సివిల్ కోడ్ అమలవుతుందని నొక్కి చెప్పారు.

కొలంబియా వర్సిటీలో కాల్పులు

- కొనసాగుతున్న దమనకాండ
- వైఖరిలో మార్పులేదన్న బైడెన్

వామపక్ష రాడికల్స్ అంటూ ట్రంప్ అవహేళన

న్యూయార్క్: గాజా పట్ల అమెరికా విధానానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దమన కాండ కొనసాగుతోంది. న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోని హామిల్టన్‌హాలు లోపల ఓ పోలీసు తుపాకీతో కాల్పులు జరిపాడు. మరో పోలీసు మెట్లపై నుంచి ఓ విద్యార్థిని కిందకు తోసేశాడు. కాలిఫోర్నియా యూనివర్సిటీలో 200 మంది విద్యార్థులను అరెస్టు చేశారు. విస్కాన్సిన్-మాడిసన్ విశ్వ విద్యాలయంలో పోలీసులు నిరసన శిబిరాలను తొలగించారు. అయితే, 24 గంటలు కూడా తిరగక మునుపే విద్యార్థులు అదే చోట 30 గుడారాలను ఏర్పాటుచేసుకున్నారు. చాలా యూనివర్సిటీల్లో పోలీసులు హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నట్లు సమాచారం. న్యూయార్క్‌లోని పోర్టు హామ్ యూనివర్సిటీ, న్యూహాంప్‌షైర్‌లోని డార్ట్ మౌత్‌కామ్ యూనివర్సిటీ, న్యూ ఓర్లీన్స్‌లోని టూ లేన్ వర్సిటీల్లో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ఇలినాయిస్‌లో నార్త్ వెస్టర్న్ వర్సిటీ, చికాగో విశ్వవిద్యాలయం, రోడ్ ఐలండ్‌లోని బ్రౌన్ యూనివర్సిటీ, ఇతర కొన్ని కళాశాలల యాజమాన్యాలు మాత్రం పోలీసులను పిలవకుండా నిరసనకారులతో శాంతియుత చర్చలు జరుపుతున్నాయి. కొలంబియా యూనివర్సిటీలోకి పోలీసులను పిలిపించిన యూనివర్సిటీ చాన్సలర్ మినోచె షఫిక్ చర్యను అమెరికన్ యూనివర్సిటీ ప్రొఫెసర్స్ అసోసియేషన్ (ఎఎయుపి) ఖండించింది. దీనిని సాయుధ ఉగ్రవాద చర్యగా అభివర్ణించింది.

మా వైఖరిలో మార్పులేదు: బైడెన్

అంతులేని సైనిక సహాయాన్ని ఇజ్రాయిల్ యుద్ధ తంత్రంలోకి పంప్ చేస్తున్న బైడెన్ ఈ నిరసనలకు తాను భయపడేది లేదని, ఇజ్రాయిల్ పట్ల తన ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని అన్నారు. నిరసనలు ప్రభుత్వ విధానంలో ఏమైనా మార్పు తెస్తాయా అని విలేకరులు వైట్ హౌస్‌లో బైడెన్‌ను ప్రశ్నించినప్పుడు లేదు అని పెడసరంగా సమాధానమిచ్చారు. యూనివర్సిటీ విద్యార్థుల నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్న బైడెన్, శాంతి భద్రతల పేరుతో పోలీసుల దమనకాండను సమర్థించుకున్నారు. యూనివర్సిటీలో వందల వేల డాలర్ల ట్యూషన్ ఫీజు చెల్లించిన విద్యార్థులు ఈ నిరసనల వల్ల విద్యాహక్కును కోల్పోతున్నారని, జీవితాంతం ఆ అప్పుల బాధ వారిని వెంటాడుతుందని మొసలి కన్నీరు కార్చారు. గాజాలో ఇజ్రాయిల్ గత ఏడు నెలలుగా సాగిస్తున్న దురాక్రమణ పూరిత దాడుల్లో 14 వేల మంది పిల్లలు చనిపోతే ఆయనకు ఎలాంటి విచారం వ్యక్తం చేయలేదు. మొత్తంగా 35 వేల మంది అమాయక పౌరులు చనిపోయారు.

ఇద్దరు మాజీ సీఎంలను రంగంలోకి దించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మక నియోజకవర్గాలైన అమేథీ, రాయ్‌బరేలీకి ఎట్టకేలకు ఇటీవల అభ్యర్థులను ప్రకటించింది. రాయ్‌బరేలీకి రాహుల్, అమేథీకి కిశోరీలాల్ శర్మలను బరిలోకి దింపింది. ఈ నియోజకవర్గాల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు నియోజకవర్గాల పరిశీలకులుగా ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులను నియమించింది. ఈ ప్రతిపాదనకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపినట్టు కాంగ్రెస్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ రెండు నియోజకవర్గాల ప్రచారానికి కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ నాయకత్వం వహిస్తున్నారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఛత్తీసగఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్, రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ వంటి అగ్రనేతల ప్రచార ప్రణాళికలను, షెడ్యూల్‌ను కూడా ప్రియాంక స్వయంగా చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు నియోజకవర్గాల ఎన్నికల ప్రచారంలో 200 నుంచి 300 గ్రామాలను కవర్ చేస్తూ ప్రియాంక ప్రచారం చేయనున్నట్లు సమాచారం.

తీవ్ర ఒత్తిడిలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం

మోడీ మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు : ఆర్జేడీ అధినేత లాలూ



పాట్నా: లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను మోడీ రద్దు చేస్తారని ప్రజలు భయపడుతున్నారని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ అన్నారు. ఆయన మోడీపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు చనిపోవటానికి కాదు, మనుగడ కోసం పోరాడాలని లాలూ అన్నారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు కూడా మోడీని మళ్లీ అధికారంలోకి తెచ్చినట్టయితే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందో లేదో అని అనిశ్చితంగా ఉన్నారని ఆర్జేడీ చీఫ్ తెలిపారు. మోడీ మళ్లీ ప్రధాని అయితే యువత ఉద్యోగావకాశాల గురించి అనిశ్చితితో ఉంటారన్నారు. " పోలీసు, కేంద్ర పారామిలటరీ బలగాలలో అగ్నివీర్ పథకం అమలు చేయబడుతుందా, రైతుల డిమాండ్లు ఎప్పటికీ నెరవేరుతాయా లేదా, సమాజంలో ద్వేషం, చీలికలు పెరుగుతాయా, మోడీ మూడో దఫాలో రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తికి భంగం వాటిల్లుతుందా అనే అనిశ్చితిలో యువత ఉన్నది" అని లాలూ ఆరోపించారు.

గోద్రా రైలు దహనం కేసులో దోషులను రక్షించేందుకు లాలూ ప్రసాద్ ప్రయత్నించారని మోడీ చేసిన ఆరోపణలపై ఆర్జేడీ అధ్యక్షుడి కుమారుడు తేజస్వీ యాదవ్ స్పందించారు. మాజీ ప్రధాని, బీజేపీ వ్యవస్థాపక నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి చేసిన ప్రసిద్ధ "రాజ్ ధర్మ" వ్యాఖ్యను తేజస్వీ ప్రస్తావించారు. "ఆయన (పీఎం) తనకు ఏది కావాలంటే అది చెప్పగలరు. అయితే ఆ సమయంలో అటల్‌జీ చెప్పిన మాటలు నాకు గుర్తున్నాయి. అటల్‌జీ పక్కనే మోడీజీ కూర్చున్నారు, ఆయన 'రాజ్ ధర్మాన్ని' పాటించాలని సలహా ఇచ్చారు" అని తేజస్వీ గుర్తు చేశారు.

నటి కంగనా రనౌత్‌పై కాంగ్రెస్ మంత్రి కామెంట్

సిమ్లా : ప్రముఖ బాలీవుడ్ నటి, మండి నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి కంగనా రనౌత్‌పై హిమాచాల్‌ప్రదేశ్ కాంగ్రెస్ మంత్రి విక్రమాదిత్య ఫైర్ అయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాసౌలీలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. 'ఆమె మండి నియోజకవర్గంలో ఎలాగో ఓడిపోతుంది.. ముంబైకి సాగనంపే ఏర్పాట్లు పూర్తయ్యాయి.' అని ఎద్దేవా చేశారు. ముంబై నుంచి వచ్చి ఈ రాష్ట్రంలో ఎంపీగా పోటీ చేస్తున్న ఆమెను మళ్లీ ముంబైకి రిటర్న్ పంపుతున్నామని ర్యాలీలో అన్నారు. రాష్ట్రంలో మండి, సిమ్లా, కాంగ్రా, మహీపూర్, నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ అత్యధిక మెజార్టీతో గెలుస్తుందన్నారు. కాగా విక్రమాదిత్య కంగనాపై గత నెలలో కూడా విమర్శలు చేశారు. కంగనా వర్షాకాలంలో వచ్చే కప్పలాంటిదని, ఎన్నికల ప్రచారం అనంతరం ఆమె మండి నుంచి వెళ్లిపోతారన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో నాలుగు లోక్‌సభ స్థానాలకు జూన్ 1న పోలింగ్ జరగనుంది.

అంతా ఏకపక్షమే

- స్థానిక నాయకత్వంతో సంప్రదింపుల్లేవ్
- పొత్తుల్లో బీజేపీవి పై నుండి రుద్దే నిర్ణయాలే
- జేడీ(యూ) నుంచి జేడీ(ఎస్) వరకు ఇదే తీరు

పలు రాష్ట్రాల్లో కాషాయపార్టీ నేతల్లో అసంతృప్తి : రాజకీయ విశ్లేషకులు



న్యూఢిల్లీ : పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కేంద్రీకృత అధ్యక్ష రూపంలో ఉంటే..డబ్బు, ప్రభుత్వంలో ఉన్న పార్టీ అధికార బలం ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఎన్నికల్లో పోటీ చేసే వారి స్థాయి తగ్గుతుంది. జిల్లా, నియోజకవర్గ స్థాయిలోనూ దాదాపు అన్ని ప్రధాన నిర్ణయాలను నేరుగా అగ్రస్థానంలో ఉన్న వ్యక్తులు తీసుకుంటారు. ఇందుకు బీజేపీనే ఒక చక్కటి ఉదాహరణ అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కేంద్రీకృత నిర్ణయాల కారణంగానే అగ్రనాయకత్వం కర్నాటకలో జేడీ(ఎస్)తో, బీహార్‌లో జేడీ(యూ)తో పొత్తు పెట్టుకున్నది. ముఖ్యంగా, కర్నాటకలో దీని ప్రభావం కనిపిస్తున్నది. జేడీ(ఎస్)తో పొత్తుపట్ల రాష్ట్రంలో ఒక నేత వారించినప్పటికీ.. బీజేపీ అధిష్టానం అదేమీ పట్టించుకోకుండా జేడీ(ఎస్)తో పొత్తుకు ముందుకెళ్లిందని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

కర్నాటకలో మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, జేడీ(ఎస్) బహిష్కృత నాయకుడు, హసన్ ఎంపీ లైంగిక దౌర్జన్యం కేసు రాష్ట్ర రాజకీయాలనే గాక దేశాన్ని షాక్‌కు గురి చేసింది. దాని ప్రభావం జేడీ(ఎస్)తో మిత్రపక్షంగా ఉన్న బీజేపీ పైనా పడుతుందనీ, రాబోయే ఎన్నికల్లో ఇది ప్రతిబింబిస్తుందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇక బీహార్‌లో జేడీ(యూ)తో పొత్తు రాష్ట్ర నేతలనే తీవ్ర ఆశ్చర్యానికి గురి చేసింది. భవిష్యత్తులో నితీశ్‌తో పొత్తు ఉండదని ఒకానొక సందర్భంలో సాక్షాత్తూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షానే వెల్లడించాడు. ఒకపక్క, నితీశ్ ఇండియా కూటమిలో కీలకంగా వ్యవహరించాడు. ఉత్తర, దక్షిణ ధృవాలుగా ఉన్న నితీశ్, బీజేపీ సంబంధాలు అనూహ్యంగా స్నేహబంధానికి దారి తీశాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అధికారం కోసం కూటములు మారుతూ.. రాజకీయంగా ఒక స్థిరత్వాన్ని కనబర్చని నితీశ్‌కు అవకాశవాది అనే పేరు ఉన్నది. అంతేకాదు, ఆయన పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కూడా ఏర్పడింది. ఇవన్నీ బీహార్ రాష్ట్ర నేతలకు తెలుసు. కానీ బీజేపీ అధిష్టానం వారి మాటలను వినకుండా జేడీ(యూ)తో పొత్తును ఏర్పర్చుకున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీలను చీల్చి ఈ విధంగానే పొత్తులు పెట్టుకున్నదని చెప్తున్నారు. అలాగే, కళంకిత నేతలనూ పార్టీలో చేర్చుకొని స్థానిక నాయకత్వానికి బీజేపీ ఎలాంటి గౌరవమూ ఇవ్వలేదని వివరిస్తున్నారు. ఏపీలోనూ టీడీపీతో పొత్తు కూడా అక్కడి స్థానిక నాయకత్వానికి ఇష్టం లేకున్నా.. కేంద్ర స్థాయిలో స్నేహం కుదిరిందని బీజేపీ నాయకులే కొందరు చెప్తున్నారు. యూపీలో యోగితో సంబంధం లేకుండా ఇటు పార్టీలో, అటు ప్రభుత్వంలో కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకుంటున్నదని చెప్తున్నారు. ఈ తీరు యోగి, మోడీ-షా ద్వయం మధ్య ఎడబాటును తీసుకొచ్చిందని అంటున్నారు.

నాయకత్వం చేసిన ఘోర తప్పిదాలను ఒప్పుకునే వారు పార్టీలో కొందరైతే, విజయంపై అతి విశ్వాసంతో మరికొందరు దానిని విస్మరిస్తున్నారు. ఈ నిర్ణయాల ప్రక్రియను ఎక్కువగా కేంద్రీకరించడం వల్ల కిందిస్థాయి వర్గాల్లో క్రమక్రమంగా ఒక ప్రతికూల భావన ఏర్పడుతున్నదని కాషాయపార్టీ అధినాయకత్వం గ్రహించడం లేదనీ, ఫలితంగా కింది స్థాయి నాయకత్వం రాజకీయంగా తీవ్ర కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తున్నదని చెప్తున్నారు. గత పదేండ్లలో బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్(ఎన్డీయే) అభ్యర్థుల్లో అత్యధికులకు ఇదే పరిస్థితని గుర్తు చేస్తున్నారు విశ్లేషకులు.

2014 నుంచి మోడీ కరిష్మాతో గెలుస్తున్నామనీ, ఈ సారి కూడా అదే అంశం పని చేస్తుందన్న అతి విశ్వాసం బీజేపీ నేతల్లో అధికంగా కనిపిస్తున్నది. అందుకే బీజేపీకి 370కి పైగా, ఎన్డీయేకు 400కి పైగా సీట్లే లక్ష్యంగా 'చార్ సౌ పార్' నినాదాన్ని ప్రధాని మోడీ పలు సందర్భాల్లో వినిపిస్తున్నారు. అయితే, ప్రస్తుతం దేశంలో పరిస్థితులు మారాయనీ, బీజేపీ మీద ప్రజలు చాలా వ్యతిరేకతతో ఉన్నారని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. రాష్ట్రాల్లోని నాయకత్వానికి విలువనివ్వకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ కూటములతో ముందుకెళ్తున్న బీజేపీకి ఈ ఎన్నికలు ప్రతికూల ఫలితాలను ఇస్తాయని అంటున్నారు.

దశలు మారిన గుర్తులు

- కాంగ్రెస్‌లో జోడెద్దుల నుంచి హస్తానికి
- బీజేపీది దీపం నుంచి కమలానికి
- 75 ఏండ్ల సుదీర్ఘ పరిణామం



న్యూఢిల్లీ: ఒకటి అధికార పక్షం... ఇంకోటి ప్రతిపక్షం... అవే భారతీయ జనతాపార్టీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లు. ఎన్నికల్లో బరిలోకి దిగేందుకుగాను తమతమ గుర్తులను జనంలోకి తీసుకువెళ్లేందుకు అనునిత్యం ప్రయత్నిస్తూనే ఉంటాయి. అయితే వాటి గుర్తుల వెనుక పెద్ద చరిత్రే ఉంది. 75 ఏండ్ల భారతదేశ రాజకీయ చరిత్రలో ఈ రెండు పార్టీల గుర్తుల్లో పెను మార్పులు చేసుకున్నాయి. భారతీయ జనతాపార్టీ అయితే తొలుత దీపం గుర్తుతో తన రాజకీయ ప్రస్తానం ప్రారంభించగా, కాంగ్రెస్ పార్టీ జోడెద్దులు-నాగలి గుర్తుతో తన పార్టీని ప్రారంభించింది.

కాంగ్రెస్ విషయానికి వస్తే 1952 సంవత్సరం నుంచి నాగలితో కూడిన జోడెద్దుల గుర్తును తమ పార్టీ సింబల్‌గా చేసుకుని ఎన్నికల్లో నిలిచింది. అయితే ఇందిరాగాంధీ నేతృత్వంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్-ఆర్ (రిక్విజిషనలిస్ట్) మారింది. దీనినే కొద్దికాలం ఐఎన్‌సి-ఓ (ఆర్గనైజేషన్)గా కూడా పిలిచారు. పాత పార్టీలో మిగిలిపోయిన కొంతమంది జోడెద్దులను గుర్తుగా కొనసాగించుకోగా, ఇందిరా గాంధీ కాంగ్రెస్ ఆవుదూడను గుర్తుగా మార్చుకుంది. 1971 ఎన్నికల్లో ఇందిర అధ్వర్యంలో ఏకంగా 352 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించింది. అలాగే ఐదు రాష్ట్రాల్లో కూడా ఆ పార్టీ జెండా రెపరెపలాడింది. ఆ తరువాత తన పార్టీని కాంగ్రెస్ (ఐ)గా మార్చుకుని 1977 ఎన్నికల్లోకి బరిలోకి దిగారు. కాలక్రమేణా ఇదే పార్టీ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌గా రూపాంతరం చెంది హస్తం గుర్తులోకి మారింది. ఇలా 1952 నుంచి 72 సంవత్సరాల ప్రయాణంలో మూడు గుర్తులను మార్చుకుంది.

ఇక బిజెపి విషయానికి వస్తే ఆ పార్టీ కూడా తన రాజకీయ గమనంలో మూడు సార్లు గర్తులను మార్చుకుంది. 1951లో భారతీయ జనసంఘ్ పేరుతో ఉన్న ఆ పార్టీ వెలుగుతున్న నూనె దీపం గుర్తును కలిగి ఉంది. 1977 వరకు ఇదే గుర్తు కొనసాగగా, 1977లో ఇతర పార్టీలతో కలిపి జనతా పార్టీగా మారింది. దీంతో దీని గుర్తు కూడా మారి నాగలి పట్టిన రైతుగా తెరపైకి వచ్చింది. ఆ తరువాత మూడేండ్ల అనంతరం జనతాపార్టీని రద్దు చేయడంతో బీజేపీ అవతరించింది. అప్పటి నుంచే ఆ పార్టీకి కమలం గుర్తుగా ఉద్భవించింది. ఇలా రెండు పార్టీలు తమ గుర్తుల ప్రస్తానంతో ఇప్పుడు హస్తం, కమలంతో 2024 ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి.

నేడే మూడో దశ పోలింగ్

- 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 93 స్థానాలకు ఎన్నికలు
- 1,351 మంది అభ్యర్థులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



నేడు మూడో దశ పోలింగ్ జరగనుంది. 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 93 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో 1,351 మంది అభ్యర్థులు బరిలో దిగారు. మే 7న జరిగే మూడో దశ పోలింగ్‌లో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 94 నియోజకవర్గాలకు పోలింగ్ జరగాల్సి ఉండగా, గుజరాత్‌లోని సూరత్‌లో బీజేపీ ఇప్పటికే అనూహ్యంగా గెలిచింది. అలాగే, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్-రాజౌరీ స్థానానికి ఓటింగ్ మే 25కి వాయిదా పడింది. అయితే, మధ్యప్రదేశ్‌లోని బేతుల్‌లో రెండో దశలో ఏప్రిల్ 26న జరగాల్సిన పోలింగ్ కూడా మూడో దశలో జరుగుతోంది. ఈ దశలో బరిలో నిలిచిన ప్రముఖులు కేంద్ర మంత్రులు అమిత్ షా (గాంధీనగర్), జ్యోతిరాదిత్య సింధియా (గుణ), బీజేపీ తిరుగుబాటు నాయకుడు కెఎస్ ఈశ్వరప్ప (షిమోగా), దిగ్విజయ్ సింగ్ (రాజ్ ఘడ్), డింపుల్ యాదవ్ (మెయిన్‌పురి), శివరాజ్ సింగ్ చౌహాన్ (విదిశ), సుప్రియా సులే (బారమతి) తదితరులు ఉన్నారు. మరోవైపు ఇప్పటికే ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్, ఇక ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ పూర్తైంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

బీహార్‌లో అత్యధిక స్థానాలు ఇండియా ఫోరానికే

జె.జగదీశ్

- ఈ ఎన్నికలు పెట్టుబడిదారీ విధానం, ప్రజాస్వామ్యం మధ్య పోరాటం
- నితీశ్ కుమార్ సైద్ధాంతిక విధేయతలేని అధికార దాహం ఉన్న వ్యక్తి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి లాలన్ చౌదరి



బీహార్‌లోని ఖగారియా రైల్వే స్టేషన్ సమీపంలోని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ కార్యాలయం ఎన్నికల కమాండ్ సెంటర్‌గా వ్యవహరిస్తోంది. కింది స్థాయి నాయకులకు, కార్యకర్తలకు తక్షణ సలహాలు, సహాయం అందించేందుకు సీనియర్ నేతలు ఎప్పుడూ ఇక్కడే ఉంటున్నారు. కార్యాలయంలో ఉన్న సీపీఐ(ఎం) బీహార్ రాష్ట్ర కార్యదర్శి లాలన్ చౌదరి బీహార్ ఎన్నికల గురించి 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

ఖగారియాపై మీ అంచనాలు ఏమిటి?

బీహార్‌లో సీపీఐ(ఎం) పోటీ చేసే ఖగారియాలో స్థానికంగా బాగా ప్రభావం చూపే సంజయ్ కుమార్ ఇండియా ఫోరంకి బలమైన అభ్యర్థి. ఒక వైపు స్థానిక ప్రజా పోరాటాల ముఖం. మరోవైపు నాన్‌లోకల్ అయిన ఎన్‌డీఏ అభ్యర్థి మధ్య పోరు జరుగుతోంది. ఎన్‌డీఏ అభ్యర్థి రాజేష్ వర్మ డబ్బులు వెదజల్లి ఓట్లు కొనే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ ఎన్నికలు పెట్టుబడిదారీ విధానానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరుగుతున్న సమరం. మోడీ విభజన విధానాలకు ఓటర్లు కూడా సరైన సమాధానం ఇస్తారు.

ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలు?

బీహార్ అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. ఉపాధి వెతుక్కుంటూ కేరళ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు వలసపోతుంటారు. నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మెరుగైన విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడం లేదు. విద్య కోసం విద్యార్థులు ఇతర రాష్ట్రాలపై ఆధారపడుతున్నారు. పంటలకు చట్టబద్ధమైన మద్దతు ధర లేకపోవడం వ్యవసాయ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. ప్రభుత్వ మండీల పనితీరు నిలిచిపోయింది. పెట్టుబడి ఖర్చు భరించలేక రైతులు వ్యవసాయం మానేస్తున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఒక ప్రభుత్వం ప్రజలకు అందించాల్సిన కనీస సేవలు కూడా బీహార్‌లో లేవు. వీటన్నింటికి అద్దం పట్టేలా ఎన్నికల ఫలితం ఉండబోతోంది. రాష్ట్రంలో ఇండియా ఫోరం ఎక్కువ సీట్లు గెలుస్తుంది. మొదటి, రెండో దశల్లో బీజేపీకి సానుకూలత లేకపోవడం ఎన్‌డీఎను ఆందోళనకు గురి చేస్తున్నది.

ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గురించి?

జ: స్వయం ప్రకటిత సోషలిస్టు అయినప్పటికీ సైద్ధాంతిక విధేయత లేని, అధికార దాహం ఉన్న వ్యక్తి. అధికారమే ఆయన ఏకైక రాజకీయ తత్వశాస్త్రం. దాని కోసం ఏ పక్షం అయినా తీసుకుంటారు. 400 సీట్లు గెలుస్తామని ప్రధాని మోడీతో హాజరైన ర్యాలీలో నితీశ్ అని నాలుక కరుచుకున్నారు.

పత్రికా స్వేచ్ఛకు గ్రహణం

కలాలకు సంకెళ్లు పడ్డాయి

- గళాలు మూగబోయాయి
- విదేశీ పాత్రికేయులనూ వదలలేదు
- మోడీ పాలనలో నిర్బంధాలు, అణచివేతలు



న్యూఢిల్లీ : కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత్రికేయుల కలాలకు సంకెళ్లు పడ్డాయి. వారి గొంతుకలు అణచివేతకు గురై మూగబోయాయి. ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను భరించలేక విదేశీ జర్నలిస్టులు దేశం విడిచి వెళ్లిపోయారు. మరికొందరు జైళ్లలో మగ్గుతున్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వ ఉదాసీన వైఖరిని ప్రశ్నించడమే వారు చేసిన నేరం. దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ పూర్తిగా కనుమరుగై పోయింది. బడా మీడియా సంస్థలు సైతం అధికార పక్షానికి కొమ్ము కాస్తున్నాయి. వాస్తవాలు వెలుగులోకి రాకుండా అడ్డుకుంటున్నాయి. పాలకుల భజనలో మునిగితేలుతున్నాయి.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓ కథనాన్ని రూపొందించినందుకు ఎన్డీటీవీలో పనిచేసిన రవీష్ కుమార్ తన ఉద్యోగాన్నే వదులుకోవాల్సి వచ్చింది. దానికి కారణం ఎన్డీటీవీ యాజమాన్యం మారడం...నూతన యాజమాన్యం ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించడం. దేశంలో పత్రికా స్వేచ్ఛకు ఏ విధంగా గ్రహణం పట్టిందో ఈ ఉదంతం చాటిచెబుతోంది. పత్రికా స్వేచ్ఛపై మొత్తం 180 దేశాల్లో సర్వే నిర్వహించగా మన దేశం 159వ స్థానంలో నిలిచింది.

విదేశీ పాత్రికేయులపై కక్ష సాధింపు

మోడీ ప్రభుత్వం ఇటీవలే ఇద్దరు విదేశీ పాత్రికేయులను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించింది. చివరికి వారు మూటా ముల్లే సర్దుకొని స్వదేశాలకు వెళ్లిపోయారు. ఫ్రాన్స్‌లోని అనేక మీడియా సంస్థలకు వార్తలు అందిస్తూ, మన దేశంలో సుదీర్ఘ కాలం పనిచేసిన వనెస్సా డగ్నక్ ఫిబ్రవరిలో భారత్‌ను వీడారు. ఓవర్‌సీస్ సిటిజన్ ఇండియా కార్డును మోడీ ప్రభుత్వం రద్దు చేయడంతో చేసేదేమీ లేక ఆమె ఫ్రాన్స్ వెళ్లిపోయారు. ఏప్రిల్‌లో ఏబీసీ న్యూస్‌కు చెందిన అవనీ డయాస్ కూడా ఆస్ట్రేలియాకు తిరుగుముఖం పట్టారు. 'గీత దాటారంటూ' ఆమెపై నిందలు వేసి వీసాను పొడిగించేందుకు నిరాకరించారు. ఎన్నికల వార్తల కవరేజీ కోసం భారత్ వెళ్లాల్సిన తన కరస్పాండెంటుకు మోడీ ప్రభుత్వం వీసా ఇవ్వలేదని అల్ జజీరా టీవీ తెలిపింది.

దేశంలో పనిచేస్తున్న విదేశీ పాత్రికేయులు ఈ ఉదంతాలపై రెండు కథనాలు అందించారు. అవి అంతర్జాతీయ మీడియాలో ప్రముఖంగా కన్పించాయి. హిందూత్వ వెబ్‌సైట్లు మాత్రం విదేశీ పాత్రికేయులను సాగనంపడాన్ని సమర్థించాయి. 2023 డిసెంబరులో వివాహం అయినందునే డియాస్ స్వదేశానికి వెళ్లారంటూ ప్రచారం కూడా చేశాయి.

వ్యతిరేకిస్తే జైలే

ఇక స్వదేశీ పాత్రికేయుల ఇబ్బందులు చెప్పనలవి కావు. వారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ప్రస్తుతం ఎనిమిది మంది జర్నలిస్టులు జైళ్లలో ఉన్నారు. కాశ్మీర్‌కు చెందిన పాత్రికేయుడు అసిఫ్ సుల్తాన్ 2018 నుండీ జైలు జీవితం గడుపుతున్నారు. పంజాబ్‌కు చెందిన స్వతంత్ర పాత్రికేయుడు రాజీందర్ సింగ్ తగ్గర్‌ను గత వారం అరెస్ట్ చేశారు. గౌతమ్ నవ్‌లఖా 2020 నుండి గృహనిర్బంధంలోనే ఉన్నారు. కాశ్మీర్‌కు చెందిన సజాద్ గల్, జార్ఖండ్ రిపోర్టర్ రేపేష్ కుమార్ సింగ్ 2022 నుండి, కాశ్మీర్ పాత్రికేయులు ఇర్ఫాన్ మెహ్‌రాజ్, మజీద్ హైదరీలు 2023 నుండి జైలులోనే మగ్గుతున్నారు. న్యూస్‌క్లిక్ పోర్టల్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ గత సంవత్సరం నుండి జైలులో ఉన్నారు. న్యూస్‌క్లిక్ ఉద్యోగుల కార్యాలయాలు, పని ప్రదేశాలపై కూడా దాడులు జరిగాయి. ప్రజల పక్షాన నిలిచి, నిజాలను నిర్భయంగా చెప్పే కలం వీరులకు వెన్నుపోటు పొడవడానికి పాలకపక్షం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని ఈ ఉదంతాలు రుజువు చేస్తున్నాయి.

నిఘా నీడలో...

పైగా అరెస్టు చేసిన పాత్రికేయులపై మోపిన సెక్షన్లు భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఉదాహరణకు ప్రబీర్‌కు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని, ఆయనకు విదేశీ నిధులు అందుతున్నాయని తీవ్రమైన అభియోగాలు మోపారు. మసీదు కూల్చివేతపై వార్త రాసిన నేరానికి ఓ యువ పాత్రికేయుడిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. దేశంలో పలువురు పాత్రికేయులు నిఘా నీడలో జీవించాల్సి వస్తోంది. వారిపై హిందూత్వ శక్తులు ఓ కన్నేసి ఉంచుతారు. అనుమానం కలిగితే చాలు...గద్దల్లా వాలిపోతారు. సామ దాన బేధ దండోపాయాలు ప్రయోగిస్తారు.

శభాష్ శాంత

'ది వైర్' పోర్టల్‌కు చెందిన సుకన్య శాంత భారతీయ కారాగారాల్లో కుల వివక్షపై ఓ కథనాన్ని అందించారు. దీనిని సుమోటోగా స్వీకరించిన రాజస్థాన్ హైకోర్టు జైళ్ల నిబంధనలను మార్చింది. అయినప్పటికీ పెద్దగా మార్పేమీ రాలేదు. దీనిపై హక్కుల సంఘం చర్యలు తీసుకుంటుందేమోనని శాంత మూడు సంవత్సరాలు ఎదురు చూశారు. ఫలితం లేకపోవడంతో సుప్రీం కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించు కున్నారు. ఎవరూ పట్టించుకోనంత మాత్రాన వెనక్కి తగ్గాల్సిన అవసరమేముందని ఆమె ప్రశ్నించారు. అయితే అన్ని కథలూ సుఖాంతం కావు. మహారాష్ట్రలో ఓ ప్రభుత్వ రిఫైనరీ ప్రాజెక్టులో పర్యావరణ ఉల్లంఘనలు జరుగుతున్నాయని వార్త రాసినందుకు 48 సంవత్సరాల పాత్రికేయుడు శశికాంత్ వరిషే సంవత్సరం క్రితం హత్యకు గురయ్యారు.

సంపాదకీయం

ఏది సత్యం? ఏదసత్యం?

"ఏది సత్యం? ఏదసత్యం? ఓ మహాత్మా!, ఓ మహర్షి!" అంటూ ప్రశ్నలతోనే పాట కట్టాడు శ్రీశ్రీ. అవును మరి ఏది సత్యమో తెలుసుకోవాల్సిన పోలీసు శాఖ తమ ఊహాత్మక అభిప్రాయాన్ని వాస్తవంగా చిత్రిస్తూ...ఉన్నత న్యాయస్థానానికి సమర్పించిన 60 పేజీల రిపోర్టులో 40 పేజీలు రోహిత్ వేములను దళితుడు కాదని నిరూపించేందుకే కేటాయించారంటే... దాని వెనుక

ఈ ప్రపంచంలో ఒంటరినని, తానొక శూన్యమని వేముల రోహిత్ ఎందుకు భావించాడు? ఇది ఇప్పుడు మనందరం ఆలోచించాల్సిన ప్రశ్న. ఆర్థిక అంతరాలు, సామాజిక అంతరాలు పెరుగుతున్నంత కాలం ఈ ఖాళీలు పెరుగుతూనే ఉంటాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలు, రిజర్వేషన్ల రద్దు వంటి ప్రకటనలు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ఈ విద్వేషాలకు , అంతరాలకు చరమగీతం పాడాల్సిన తరుణం ఇది. ఆలోచనాపరులంతా ఆలోచించాల్సిన సమయమిది.

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ అదుపాజ్ఞలు లేవని కొట్టిపారేయలేము. ఎందుకంటే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటుంది ఆ కమల దళాలే కనుక.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య కేసు దర్యాప్తును ముగిస్తున్నట్టు తెలంగాణ పోలీసులు పేర్కొన్నారు. ఏబీవీపీ, బీజేపీ చేసిన ప్రచారానికి పోలీసులు వంతపాడినట్టే కనబడుతోంది. రోహిత్ ఆత్మహత్యకు, ఆయన కులానికి సంబంధం ఏమిటో అర్థం కాని రీతిలో పోలీసులు నివేదిక ఉంది. తన కుల ధ్రువీకరణ పత్రం సరైనది కాదనే విషయం బయటకు తెలిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే భావనతో అతడు ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని, వారి కులం సర్టిఫికెట్లు అన్నీ నకిలీవని, ఎటువంటి సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును మూసివేస్తున్నామని తేలికగా చెప్పేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న నాటి సికింద్రాబాద్ ఎంపీ, నేటి హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, నాటి బీజేపీ ఎమ్మెల్సీ ఎస్.రామచందర్‌రావు, హైదరాబాద్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ అప్పారావు, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, పలువురు ఏబీవీపీ



నాయకులకు పోలీసులు క్లీన్‌చిట్ ఇచ్చారు.

'చావు లాంచనాల గురించి రాయడం మర్చిపోయాను. ఎవరూ నా ఆత్మహత్యకు బాధ్యులు కాదు. వారి చర్యల ద్వారా గానీ, మాటల ద్వారా గానీ నన్ను ఆత్మహత్యకు ప్రేరేపించలేదు. ఇది పూర్తిగా నా స్వనిర్ణయం. నా చావుకు నేనే బాధ్యుడిని. నా స్నేహితులను గానీ, నా శత్రువులను గానీ నా ఆత్మహత్య కారణంగా వేధించకూడదు' రోహిత్ వేముల సూసైడ్ నోట్ సారాంశం ఇది. ఓ దళిత విద్యార్థి ఆత్మహత్యకు ప్రేరేపించారనే ఆరోపణల నుంచి అతడితో గొడవపడిన ఏబీవీపీకి, వారికి కొమ్ముకాసిన పెద్దలకు ఈ సూసైడ్ నోట్ రక్షణ కవచంలా ఉపయోగపడొచ్చు. బోలెడంత భవిష్యత్తుకు తిలోదకాలిచ్చి అర్ధాంతరంగా తనువు చాలించిన రోహిత్ మరణంలో దాగున్న వేదన, వాస్తవ పరిస్థితులు ఎనిమిదేండ్లుగా ఈ సమజాన్ని వెంటాడుతూనే ఉన్నాయి.

'నా పుట్టుక అనేది.. నా ప్రాణాంతక ప్రమాదం. ఓ దళితుడిగా వేముల రోహిత్ చనిపోదల్చుకోలేదు. నేనెప్పుడూ కూడా రచయితను కావాలని అనుకున్నాను. కార్ల్ సాగన్ వంటి సైన్స్ రచయితగా అవ్వాలనుకున్నాను. చివరికీ.. నేను ఈ ఉత్తరం మాత్రమే రాస్తున్నాను." అని తన సూసైడ్ నోట్‌లో రాశాడు. ఈ కేసు ఇప్పుడు మూసేయడంలోనే అసలు ట్విస్ట్ ఉంది. గతేడాది నవంబర్‌లోనే నివేదిక సిద్ధమైనా... దాన్ని ఎన్నికల వేళ మార్చి 21న క్లోజర్ రిపోర్టను హైకోర్టుకు ఇస్తే.. ఇప్పుడు నిందితులు తమపై కేసులు రద్దు చేయాలని పిటీషన్ వేయటం వెనుక పరమార్థం ఏమిటి? ఈ ఎన్నికల్లో బీజేపీకి దళిత వ్యతిరేకుల ఓటు బ్యాంకును పెంచుకోవటం, దళితుల్లో రోహిత్‌పై వ్యతిరేకత పెంచటమే ధ్యేయంగా ఈ కుట్ర జరిగిందన్న విద్యార్థి సంఘాలు ఆరోపణలకు ఈ చర్యలు మరింత ఊతాన్నిస్తున్నాయి.

కానీ, రాష్ట్ర సర్కార్ ఈ కేసును రీఓపెన్ చేస్తామని, రోహిత్ కుటుంబానికి న్యాయం చేస్తామని భరోసానివ్వడం కొంత ఊరటనిచ్చే అంశం. గతంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పినట్టు విద్యాసంస్థల్లో కుల వివక్షపై కఠిన చర్యలు తీసుకునే 'రోహిత్ వేముల యాక్ట్' గురించి కూడా ఈ సర్కార్ ఆలోచించాలి.

ఈ ప్రపంచంలో ఒంటరినని, తానొక శూన్యమని వేముల రోహిత్ ఎందుకు భావించాడు? ఇది ఇప్పుడు మనందరం ఆలోచించాల్సిన ప్రశ్న. ఆర్థిక అంతరాలు, సామాజిక అంతరాలు పెరుగుతున్నంత కాలం ఈ ఖాళీలు పెరుగుతూనే ఉంటాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలు, రిజర్వేషన్ల రద్దు వంటి ప్రకటనలు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ఈ విద్వేషాలకు, అంతరాలకు చరమగీతం పాడాల్సిన తరుణం ఇది. ఆలోచనాపరులంతా ఆలోచించాల్సిన సమయమిది.

వారసత్వ పన్ను





ప్రభాత్ పట్నాయక్

వారసత్వ పన్నుపై మోడీ చేస్తున్న ప్రకటనలు అల్పత్వాన్నే చూపిస్తున్నాయి. ఒక దేశ ప్రధాని నుంచి ఈ స్థాయి ప్రకటనలు రావడం ఆశ్చర్యకరంగా ఉంది. ఆ స్థాయిలో ఉన్నవారు చేయదగిన ప్రకటనలు కావవి. కాంగ్రెస్ పార్టీకి చెందిన శామ్ పిట్రోడా వారసత్వ పన్ను ప్రవేశపెట్టే విషయమై ప్రస్తావించారు. దాన్ని వ్యతిరేకించే వారు వేరే ఏమైనా హేతుబద్ధ వాదనలు చేయవచ్చు. నిజానికి ఇటువంటి ప్రతిపాదన మీద లోతైన చర్చ జరగవలసిన అవసరం కూడా ఉంది. కాని మోడీ ప్రతిస్పందనలో అటువంటి వాదనలేమీ లేవు సరికదా చాలా నీచమైన వ్యాఖ్యానాలు చేసి అటువంటి ప్రతిపాదన చేయడమే అర్థం లేనిదన్న అభిప్రాయాన్ని కలిగించడానికి ప్రయత్నించారు. ఒక దురుద్దేశ పూరితమైన ప్రయత్నంతో లోతుగా జరగవలసిన చర్చను అపహాస్యం పాలు చేయబూనుకున్నారు. మోడీ చేసిన రెండు వ్యాఖ్యానాలు ఇలా ఉన్నాయి: ప్రేక్షకులలో కూర్చున్న మహిళలను ఉద్దేశించి వారసత్వపన్ను ప్రవేశపెడితే వారి తాళిబొట్లు లాక్కుంటారని, చచ్చిపోయిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ వాళ్ళని విడిచిపెట్టదని మోడీ అన్నారు. ఇందులో మొదటి వ్యాఖ్యానం శుద్ధ తప్పు. ఎందుకంటే వారతస్వ పన్ను ఒక స్థాయిని దాటి అధికంగా ఉన్న సంపదమీదనే విధిస్తారు. ఇక రెండోది కేవలం ప్రేక్షకుల నుండి వ్యతిరేకతను రప్పించడం కోసం మాత్రమే చేసినది. అది ఏరకంగా చూసినా వాదన అనిపించుకోదు. ఒక వ్యక్తి మరణా నంతరం అతడి వారసులకు సంక్రమించే సంపదమీద పన్ను విధించడంలో తప్పు ఏమీ లేదు.

ప్రస్తుత కాలంలో ఆర్థిక పరిస్థితిని బలపరచడానికి తీసుకోవలసిన గట్టి చర్యల సంగతి చూద్దాం. ఆదా యాల్లోను, సంపద లోను అంతరాలు నయా ఉదారవాద కాలంలో బాగా పెరిగిపోయాయని దాదాపుగా అందరూ అంగీకరిస్తున్నారు. భారతదేశంలోనైతే ఈ విధానాల ఫలితంగా నిష్ఠ దారిద్ర్యంలోకి వచ్చి పడినవారు కూడా ఎక్కువయ్యారు. ఎన్డీయే పాలనాకాలంలో ఈ దారిద్ర్యం మరీ కొట్టొచ్చినట్టు పెరిగింది. 2014-15 నుండీ గ్రామీణ శ్రామికుల ఆదాయాల్లో పెరుగుదల నిలిచిపోయి స్తంభించిపోయాయన్న వాస్తవం గురించి ఇదివరకే మనం చెప్పుకున్నాం. వాస్తవ ధరల పెరుగుదలను యథాతథంగా చూపించే విధంగా గనుక ధరల సూచీని సరి చేస్తే గ్రామీణ ప్రజల వేతనాల్లో నిజానికి తరుగుదల కనిపిస్తుంది. శ్రామికుల బేరసారాల శక్తి కూడా సన్న గిల్లింది. నిరుద్యోగం ఈ కాలంలో బాగా పెరిగిపోవడం వల్లనే ఇది జరిగింది. నిజ వేతనాల్లో తరుగుదలతో పాటు నిరుద్యోగం కూడా పెరగడం వలన నిష్ఠ దారిద్ర్యం గత ఏభై సంవత్సరాలలోనూ ఎన్నడూ లేనంతగా పెరిగిపోతోంది.

నయా ఉదారవాద విధానాలను యథేచ్ఛగా కొనసాగనిచ్చిన ఫలితంగా ఈ పరిస్థితి ఏర్పడింది. అందుచేత ప్రభుత్వం కొన్ని ఆర్థిక పరమైన చర్యల ద్వారా జోక్యం కల్పించుకుని ఆ విధానాలను కట్టడి చేయవలసి వుంటుంది. సంపన్నుల మీద పన్నులను పెంచి తద్వారా వచ్చిన ఆదాయాన్ని పేదలకు బదిలీ చేయడమో, లేక వారికి ప్రభుత్వ సహాయాన్ని పెంచడమో చేయాల్సి వుంటుంది. దారిద్ర్యం తీవ్రతరమౌతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి ఆర్థిక జోక్యానికి గనుక ప్రభుత్వం పూనుకోకుంటే అది శ్రామిక ప్రజలకు తీరని ద్రోహం చేయడమే ఔతుంది. సంపన్నుల మీద ప్రత్యక్ష పన్నులను విధించడం ప్రభుత్వం చేయవలసిన విధి. అలాగాక, పరోక్ష పన్నులను పెంచితే దాని భారం మళ్లీ ఆ నిరుపేదల మీదే పడుతుంది.

ఈ ప్రత్యక్ష పన్నులను విధించే మార్గం ఏమిటి? ఆదాయాల మీద గాని, సంపన్నులు చేసే వ్యయాల మీద గాని, వారివద్ద ఉన్న సంపద మీద గాని, కంపెనీల షేర్ల రూపంలో ఉన్న సంపద మీద గాని, లేదా వార సత్వంగా సంక్రమించిన సంపద మీద గాని పన్నులు విధించవచ్చు. ఒకవేళ కంపెనీల షేర్ల రూపంలో ఉన్న సంపదను మినహాయించాలనుకుంటే తక్కిన రూపాల్లోని సంపదమీద విధించే పన్ను రేటును మరింత పెంచాల్సి వుటుంది. ఐతే ఇదేమంత మంచి ఆలోచన కాదు. కంపెనీల షేర్లతో సహా అన్ని రూపాల సంపదల లావాదేవీల మీదా పన్నులను విధిస్తే అది అధిక సంపన్నులమీద ఎక్కువగా భారం పడుతుంది. కంపెనీల షేర్లను మినహాయిస్తే అప్పుడు కావలసిన ఆదాయాన్ని సమకూర్చుకోడానికి పన్ను పరిధిలోకి ఇంకా ఎక్కువ మందిని తీసుకు రావలసి వస్తుంది. సంపద పన్ను విధించినందు వలన పెట్టుబడుల ప్రవాహం మీద ఎటువంటి ప్రభావమూ ఉండదు (ఎందుకంటే పెట్టుబడుల ప్రవాహాన్ని ప్రభావితం చేసే అంశాలు-మార్కెట్‌లో వృద్ధి అంచనాలు, పన్నులు పోను మిగిలే లాభాల రేటు, వడ్డీ రేటు వగైరాలేవీ సంపద ఎంత ఉంది అన్న అంశంమీద ఆధారపడి ఉండవు). అదే లాభాల మీద పన్ను పెంచితే అప్పుడు పెట్టుబడులు తగ్గిపోవచ్చు. ముఖ్యంగా చిన్న మధ్య తరహా పెట్టుబడి దారులు వెనక్కి తగ్గుతారు. పైగా సంపదలో, ఆదాయాల్లో అసమానతలు బాగా పెరిగిపోతే ఆర్థిక వ్యవస్థ సమతూకం దెబ్బతింటుంది గనుక ఎటుతిరిగీ ఆ అసమానతలను తగ్గించాల్సిందే. అందుకు సంపదమీద, వారసత్వ సంపద మీద పన్నులు వేయడం తప్పదు.

నైతికంగా తమ పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించుకోదానికి, చాలా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో, తమకు బొత్తిగా ఇష్టం లేకపోయినప్పటికీ, వారసత్వ పన్నును ప్రవేశపెట్టారు. ఉదాహ రణకు, జపాన్ దేశంలో వాసత్వపన్ను 55 శాతం దాకా వసూలు చేస్తున్నారు. కాని భారతదేశంలో ఎటువంటి వారసత్వ పన్నూ లేదు. సంపద పన్ను కూడా నామమాత్రమే. సంపదపన్నుకి న్యాయం జరగాలంటే వారసత్వ పన్ను తోడుగా ఉండాలి. వారసత్వ పన్ను అనేది లేకుండా కేవలం సంపద పన్ను మాత్రమే విధిస్తే ఆ సంపదను వారసులందరూ చిన్నచిన్న ముక్కలుగా పంచుకున్నట్టు చూపించి ఆ సంపద పన్ను పరిధిలోకి రాకుండా తప్పించుకుంటారు. ఒక్కోసారి అసలు యజమాని ఇంకా జీవించి ఉన్నప్పుడే పంపకాలు జరిగిపోతాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించేవారంతా ఒక వాదనను బలంగా ముందుకు తెస్తారు. సమాజంలో తక్కినవారెవరికీ లేని ప్రత్యేక లక్షణాలు పెట్టుబడిదారులకు ఉంటాయని, ఆ లక్షణాల వల్లనే వారు లాభాలను ఆర్జించడానికి తాపత్రయ పడతారని, సమాజానికి అది తోడ్పడుతుందని, అందుచేత ఎక్కువ సంపదను కలిగి వుండే అర్హత వారికి ఉందని అంటారు. ఇది మార్క్సిస్టు దృక్పథానికి పూర్తిగా వ్యతిరేకం. కార్మికుల శ్రమను కొల్ల గొట్టడం ద్వారా పెట్టుబడిదారులు లాభాలను ఆర్జించగలుగుతున్నారని మార్క్సిజం అంటుంది. ఇంతకూ వాళ్లు చెప్పే ఆ 'ప్రత్యేక' లక్షణాలేమిటి? కొత్త పద్ధతులను ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతూ తమ లాభాలను పెంచు కోగలగడమే ఆ ప్రత్యేక లక్షణం అని స్కంపీటర్ అన్నాడు. పెట్టుబడులు పెట్టి రిస్క్ తీసుకునే లక్షణం ఉందని మరొకరు అన్నారు.

వాదన కోసం వాళ్లు చెప్పినట్టు పెట్టుబడిదారుడికి ప్రత్యేక లక్షణాలు ఉన్నందువల్లనే అతడి దగ్గర సంపద బాగా పోగుబడిందనుకుందాం. ఐతే, అతగాడి దగ్గర సంపద పోగుబడినంత మాత్రాన అతడి సంతా నానికి అతడి ప్రత్యేక లక్షణాలు సంక్రమించాయని అనుకోలేం. అతడి సంతానం స్వతంత్రంగా, అంటే, తండ్రి సంపదతో నిమిత్తం లేకుండా తమ ప్రత్యేక లక్షణాలను ముందు రుజువు చేసుకోగలగాలి. అప్పుడే తక్కిన కొత్తగా రంగంలోకి వస్తున్న పెట్టుబడిదారులతో సమాన స్థాయిలో మార్కెట్‌లో పోటీ పడడం సాధ్యమౌతుంది. అలా కాకుండా, తమ తాత ముత్తాతల కాలం నుంచీ పోగేసిన సంపదకు వాళ్ల వారసులుగా ఆ సంపదనంతటికీ హక్కుదారులు అయ్యారనుకుందాం. అప్పుడది పెట్టుబడిదారీ సమర్థకులు చెప్పే (పెట్టుబడిదారులకుండే ప్రత్యేక లక్షణాల) సిద్ధాంతానికి వ్యతిరేకం కాదా? వారికి ప్రత్యేక లక్షణాలు ఉన్నదీ లేనిదీ రుజువు కాకుండానే వారు సంపన్నులు ఎలా అవగలుగుతారు? అందుచేత వారసత్వ సంపద అనేది పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించే వారి సిద్ధాంతానికి సైతం విరుద్ధం.

అందుచేత నైతికంగా తమ పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించుకోడానికి, చాలా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో, తమకు బొత్తిగా ఇష్టం లేకపోయినప్పటికీ, వారసత్వ పన్నును ప్రవేశపెట్టారు. ఉదాహ రణకు, జపాన్ దేశంలో వాసత్వపన్ను 55 శాతం దాకా వసూలు చేస్తున్నారు. కాని భారతదేశంలో ఎటువంటి వారసత్వ పన్నూ లేదు. సంపద పన్ను కూడా నామమాత్రమే. సంపదపన్నుకి న్యాయం జరగాలంటే వారసత్వ పన్ను తోడుగా ఉండాలి. వారసత్వ పన్ను అనేది లేకుండా కేవలం సంపద పన్ను మాత్రమే విధిస్తే ఆ సంపదను వారసులందరూ చిన్నచిన్న ముక్కలుగా పంచుకున్నట్టు చూపించి ఆ సంపద పన్ను పరిధిలోకి రాకుండా తప్పించుకుంటారు. ఒక్కోసారి అసలు యజమాని ఇంకా జీవించి ఉన్నప్పుడే పంపకాలు జరిగిపోతాయి.

కాబట్టి సంపదను బిడ్డల పేరనో, మిత్రుల పేరనో బదిలీ చేయక మునుపే వారసత్వ పన్ను ఆ సంపద మీద విధించాలి. ఒకానొక స్థాయిలో పోగుబడిన సంపదమీదనే వారసత్వ పన్ను విధించాలి. అంతకు తక్కువ ఆస్తి ఉంటే దానిని మినహాయించాలి. లేకపోతే మోడీ వంటి వారు మంగళసూత్రం కూడా ఆస్తే కనుక అది కూడా లాక్కుంటారు అన్న అర్థం లేని వాదనలను తెస్తారు. సామాన్య ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తారు. ఆస్తిపరుడు చనిపోయిన అనంతరం మాత్రమే వర్తించేలా కాకుండా, అతడు జీవించి వుండగానే ఆస్తిని పంపకాలు చేసినప్పుడు కూడా వర్తించేలా వారసత్వ పన్ను అమలు చేయాలి.

ఈ సంపద పన్నును గాని, వారసత్వ పన్నును గాని అమలు చేయడం కష్టం అనే వాదనను కొందరు ముందుకు తెస్తారు. పైగా దీనినుండి చాలా తక్కువ మొత్తంలో పన్ను వసూలౌతుందని వారంటారు. అందుచేత భారతదేశంలో పన్ను వసూళ్ల పద్ధతులను అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన సవరణలన్నీ చట్టాలలో తెచ్చి కచ్చితంగా ఈ పన్ను వసూలే అయేట్టు కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాల్సి వుంటుంది. జపాన్ వంటి దేశాల్లో అది ఎలా అమలు చేయగలుగుతున్నారో కూడా పరిశీలించాలి.

ఈ వారసత్వ పన్ను డిమాండు మన జాతీయోద్యమ డిమాండ్లలో ఒకటిగా ఉంది. 1931లో జరిగిన కరాచీ జాతీయ కాంగ్రెస్ మహాసభల్లో స్వతంత్ర భారతదేశంలో పౌరులందరూ సమానులుగా ఉండాలని, చట్టం ముందు అందరూ సమానులుగానే పరిగణింపబడాలని, రాజ్యం దృష్టిలో అన్ని మతాలనూ ఒకే విధంగా చూడా లని చెప్పారు. వాటితోబాటు "ఒకానొక పరిమితికి మించిన ఆస్తులు ఉన్నవారి నుండి వారి తదనంతరం ఆస్తులు పొందే వారసులపై పన్ను విధించాలి" అని కూడా ప్రకటించారు. కరాచీ జాతీయ మహాసభలు ఆనాటి మన దేశ రాజకీయ జీవితం మీద వామపక్ష భావజాలం ఆధిక్యత కలిగివుండడాన్ని సూచిస్తాయి. జాతీయ కాంగ్రెస్ పార్టీ లోపల, వెలుపల కూడా ఈ ఆధిక్యత కనపడుతుంది. ఈ కరాచీ మహాసభలు 1931 మార్చి 26న జరిగాయి. భగత్‌సింగ్, అతడి సహచరులను ఉరితీసిన మూడు రోజుల అనంతరమే జరిగిన మహాసభలు ఇవి. ఈ తీర్మా నాలకు ప్రజానీకం నుండి మొత్తంగా ఆమోదం లభించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించినవారు జవహర్‌లాల్ నెహ్రూ. మహాత్మా గాంధీ ఈ తీర్మానాన్ని లోతుగా పరిశీలించి ఆమోదించినర తర్వాతే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ సభలకు అధ్యక్షుడు వల్లభాయ్‌పటేల్. ఈ చరిత్ర పరిశీలిస్తే మన ప్రధాని మోడీకి వలస పాలనపై సాగిన జాతీయోద్యమం గురించి ఎటువంటి అవగాహనా లేదని అర్థం ఔతోంది.

ప్రస్తుత పరిస్థితిలో సంపద పన్ను, దానితోబాటు వారసత్వ పన్ను విధించడం చాలా అవసరం. కేవలం పెరుగుతున్న అసమానతలను అరికట్టడానికే కాదు, దేశాన్ని ఒక సంక్షేమ రాజ్యంగా మలచడానికి కూడా అవసరం. కరాచీ తీర్మానం ఆశించిన ఆర్థిక న్యాయం అప్పుడే సాధ్యం.

(స్వేచ్ఛానుసరణ)

పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించేవారంతా ఒక వాదనను బలంగా ముందుకు తెస్తారు. సమాజంలో తక్కినవారెవరికీ లేని ప్రత్యేక లక్షణాలు పెట్టుబడిదారులకు ఉంటాయని, ఆ లక్షణాల వల్లనే వారు లాభాలను ఆర్జించడానికి తాపత్రయ పడతారని, సమాజానికి అది తోడ్పడుతుందని, అందుచేత ఎక్కువ సంపదను కలిగి వుండే అర్హత వారికి ఉందని అంటారు. ఇది మార్క్సిస్టు దృక్పథానికి పూర్తిగా వ్యతిరేకం. కార్మికుల శ్రమను కొల్ల గొట్టడం ద్వారా పెట్టుబడిదారులు లాభాలను ఆర్జించగలుగుతున్నారని మార్క్సిజం అంటుంది. ఇంతకూ వాళ్లు చెప్పే ఆ 'ప్రత్యేక' లక్షణాలేమిటి? కొత్త పద్ధతులను ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతూ తమ లాభాలను పెంచు కోగలగడమే ఆ ప్రత్యేక లక్షణం అని స్కంపీటర్ అన్నాడు.

'కండ్లు తిరిగి పడిపోకండ్రీ !'

ఆహా హా... పెద్దసారు ఏమి చెప్పిరి, ఏమి చెప్పిరి. తెలుగువారికి... పెరుగన్నంలో కొత్త ఆవకాయ నంజుకున్నంత మజాగా ఉంది మరి!

(ప్రధాని మోడీ ఓ తెలుగు పత్రికకు ప్రత్యేకంగా ఇచ్చిన ఇంటర్వూ చూసి (నవ తెలంగాణ కాదు)

'రోజుకు ఎన్నిగంటలు పని చేసానని లెక్కలేసుకునే వ్యక్తిని కాదు. కొన్ని అలవాట్లను చిన్నప్పుడే నేర్చుకుని ఇప్పటికీ పాటిస్తున్నాను. యోగా, ధ్యానం క్రమం తప్పకుండా చేస్తా. నా జీవితంలో పనికి, విశ్రాంతికి మధ్య తేడా లేదు. పనిలోనే విశ్రాంతి వెతుక్కోవడం అలవాటు చేసుకున్నాను'.

- పాపం సెమించుగాక, ఈ ఇసయం తెలియకనే మన దేశంలో కోట్లాదిమంది రైతులు కూలీలు పొద్దస్తమానం పనే చేస్తుంటారు. ష్. ఏం చేద్దాం. ఎవరి ఆకలి వారిది. ఎవరి పని వారిది. ఎవరి విశ్రాంతి వారిది. అంతేగా... అంతేగా....

'పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం చేసే విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ధృడమైన హామీ ఇస్తున్నా. దాన్ని పూర్తి చేసే బాధ్యత నాదే. దాని నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఇప్పటికే రూ.15 వేల కోట్లకు పైగా విడుదల చేసింది. సాంకేతిక సహాయమూ అందిస్తుంది.'

- అబ్బబ్బా ఇన్నాళ్లూ ఈ తెలుగోళ్ల ముఖ్లెంగా ఈ ఎ.పి. పెజలు ఎంత యాగీ చేసీ... ,చేసీ... పోలవరం నిర్మాణ పనులు అడ్డుకున్నారు. పదేండ్లంటే మాటలా... వాళ్లకింకేం పని లేదా.. ? పొగరు కాకపోతే ఏంటిది? బొత్తిగా యవ్వారం తెల్వదు. అందుకే అలా తగలడ్డారు. గందుకే మళ్లీ మళ్లీ యాద్ చెయ్యాల్సి వస్తుంది. చెప్పి చెప్పి నా నోరు పడి పోతుందీ....

'ఈ రోజు మనం మొబైళ్ల తయారీ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నాం. మన రక్షణ ఎగుమతులు రూ.21 వేల కోట్లు ఉంటాయి. సౌర విద్యుత్ పరికరాల తయారీలో ప్రపంచంలో రెండో అతిపెద్ద దేశంగా అవతరించ బోతున్నాం. ఇంత విస్తృత స్థాయిలో మనం చేస్తున్న పనులు కొత్త ఉద్యోగాలు సృష్టించవనుకుంటున్నారా?'

-వార్ని ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు. ఈ పదేండ్లల్లో 20 కోట్ల ఉద్యోగాలు మెరుపు వేగంతో వచ్చాయి. పోయాయి. యువతే చేతగాని దద్దమ్మ ల్లా వాటిని పట్టుకోకుండా లొల్లి చేస్తే ఎలా? అర చేతిలోబెల్లంపెట్టి మోచేతిని నాకమంటే నాకరేంటి?

'వాస్తవానికి మేం రెండు రాష్ట్రాలకు చాలా మేలు చేసాం. 14, 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం 2015-20 మధ్య కాలంలో రూ.22 వేల కోట్లు, 2020 - 26 మధ్య కాలంలో రూ.35 వేల కోట్లు గ్రాంటుఇచ్చాం. ఇవ్వబోతున్నాం. దీనికి తోడు వనరుల లోటు భర్తీ, 7 వెనుక బడిన జిల్లాల అభి వృద్ధి. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, విదేశీ సాయం. కింద చేపట్టిన ప్రాజెక్టుల రుణాలపై వడ్డీరాయితీ కోసం 2014-23 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌కు 35 వేల కోట్లకు పైగా విడుదల చేసాం'.


- ఇచ్చాం ... ఇవ్వబోతున్నాం. వేల కోట్ల సాయం మాటల్లోని ఆంతర్యం లోగొట్టు పెరుమాళ్ళకే ఎరుక. అంతా శంకరాచార్యుని గజం మిధ్య పలాయపం మిధ్య

ఈ 'మండే ఎండల మాటలకు' ఎవరికి వారు కండ్లు తిరిగి పడిపోకుండా జాగ్రత్త పడాలి మరి. అంతేగా.... అంతేగా....

- శైలి, 9959745723

"శ్రమజీవుల పచ్చినెత్తురులు
తాగని ధనవంతులెందరో"

పదేండ్ల బ్యాంకింగ్ సంస్కరణలు- శ్రమదోపిడీకి పరాకాష్ట



పి.వెంకట్రామయ్య
9553533815

భూగోళం పుట్టుక, మానవ సమాజ పరిణామ క్రమం గురించి అభ్యుదయ కవి సామ్రాట్, ఆంధ్ర కవితా సారథిగా పేరుగాంచిన దాశరథి కృష్ణమాచార్యులు రాసిన 'ఆ చల్లని సముద్రగర్భం' పాట ఎంతో ప్రజాదరణ పొందింది. ఆనాటి భూస్వామ్య వ్యవస్థలో శ్రమదోపిడీ ఎంత అమానుషంగా ఉండేదో పైచరణంలో తెలియజేశారు. దశాబ్దాలు మారాయి. భూస్వామ్యవ్యవస్థ, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థగా మారింది. ఫైనాన్స్ కాపిటల్ ఆధిపత్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద పట్టుబిగించింది. కానీ శ్రమజీవుల రక్తమాంసాలు, చెమట ద్వారానే సంపద సృష్టించబడుతుందనీ, ఆ శ్రమ దోపిడీ ద్వారానే తమ లాభాల దాహాన్ని తీర్చుకొని ధనవంతులు, అపర కుబేరులు, బిలియనీర్లుగా ఎదుగుతారనే సత్యం మారలేదు సరికదా బ్రిటిష్ వలస పాలనకంటే కొత్త అవతారాలెత్తింది. శ్రమ దోపిడీ ఇంకా పెరిగింది. దాశరథి ఆశించిన 'అన్నార్తులు, అనాథలుండని నవయుగం' ఇంకా ఇంకా దూరమయ్యింది. ఆరోజు భూస్వాములు వేసిన బాటలోనే ఈనాటి కార్పొరేట్ శక్తులు, ప్రభుత్వరంగ సంస్థలు కూడా నడుస్తున్నాయి. చట్టాలను, సుప్రీంకోర్టు తీర్పులను నిర్భయంగా తుంగలో తొక్కి తమ లాభాలను పెంచుకుంటు న్నాయి. శ్రమ మీద ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఎన్డీయే ఏలుబడి లో గత దశాబ్దకాలంలో బ్యాంకింగ్ రంగంలో ఏర్పడిన పరిస్థితిని పరిశీలిస్తే ఇది అక్షర సత్యమని అర్థమవుతుంది.

అనేక అవతారాలెత్తిన బ్యాంక్ ఉద్యోగాలు

ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు కేంద్రప్రభుత్వం చేసిన చట్టాల ద్వారా ఏర్పడ్డాయి. కాబట్టి కార్మిక చట్టాలను, మార్గదర్శకాలను అమలు చేయటం వాటి కనీస బాధ్యత. సమాన పనికి సమాన వేతనం చెల్లించటం చట్టరీత్యా తప్పనిసరి. ఈమేరకు సుప్రీంకోర్టు తీర్పులున్నాయి. బ్యాంకింగ్ రంగంలో గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులకు తక్కువ జీతాలు ఉన్న పరిస్థితికి వ్యతిరేకంగా బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆలిండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకత్వంలో పెద్ద ఉద్యమాలు జరిగాయి. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి ప్రభుత్వం 1987లో జస్టిస్ ఓబుల్ రెడ్డి కమిషన్ నియమించింది. మూడేండ్ల సుదీర్ఘ వాదనల తరవాత ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగులు చేసేపనే చేస్తున్న గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులకు కూడా ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగుల జీతాలనే చెల్లించాలని తీర్పునిచ్చింది. సమాన పనికి సమాన వేతనం బ్యాంకింగ్ రంగంలో అమల్లోకి వచ్చింది. కానీ గత పదేండ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన బ్యాంకింగ్ సంస్కరణలు సమాన పనికి సమాన వేతన నిబంధనలను తల్లకిందులు చేశాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులకు కూడా లాభాల సంపాదనే ప్రధాన లక్ష్యంగా మార్చిన దరిమిలా శ్రమదోపిడే బ్యాంకుల విధానంగా మారింది. డబ్బుతో వ్యాపారం చేసే సున్నిత రంగంలో ఖాతాదారులు భద్రతకోసం బ్యాంకులలో పర్మినెంట్ ఉద్యోగులే పనిచేయాలనే నియమం అమలయ్యేది. ఆ నియమాన్ని నీరుగారుస్తూ నిరుద్యోగులను, బ్యాంకు ఉద్యోగులను శ్రమ దోపిడీకి గురిచేస్తూ అనేక పథకాలు రూపొందించబడ్డాయి.

2021-2022 ఆర్థిక సంవత్సర ఫలితాలను ప్రకటిస్తూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్, ప్రయివేటు బ్యాంకులతో పోటీపడి లాభాలు సంపాదిస్తున్నా ఖర్చు - ఆదాయనిష్పత్తి (కాస్ట్ టు ఇన్కమ్ రేషియో) ఎక్కువగా ఉండటం వలన స్టేట్ బ్యాంక్ నికర లాభాలు తక్కువగా ఉన్నాయని పత్రికా సమావేశంలో చెప్పారు. అంటే ఖర్చు తగ్గించుకోవాలని ఆయన తాత్పర్యం. ఆరోజు తెలియదు అది నిరుద్యోగుల పాలిట శాపంగా మారుతుందని. మూడు నెల్ల తర్వాత 'స్టేట్ బ్యాంక్ ఆపరేషన్స్ సపోర్ట్ సర్వీసెస్' (ఎస్‌బిఓఎస్ఎస్) అనే అవుట్‌సోర్సింగ్ కంపెనీని స్వంతగా (రిజర్వ్ బ్యాంక్



అనుమతితో) స్థాపించింది. స్టేట్ బ్యాంక్ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న శాఖలు నడపటానికి కావలసిన కాంట్రాక్టు ఉద్యోగులను ఎంపిక చేయటం ఆ కంపెనీ ఉద్దేశ్యం. స్టేట్ బ్యాంక్‌లో పనిచేసే పర్మినెంట్ ఉద్యోగుల జీతాలు వారికి వర్తించవు.

అప్పటికే రిజర్వ్‌బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్లనే స్కీమ్ రూపొందించింది. ఖాతాదారుల నుంచి డబ్బు జమచేసు కోవటం, ఖాతా నుండి డబ్బు ఇవ్వటం, డిమాండ్ డ్రాఫ్ట్ ఇవ్వటం, చెక్కులు ఖాతాలో జమ చేయటం లాంటి పర్మినెంట్ ఉద్యోగులే చేసే అనేక పనులు వీళ్లు చేస్తారు. అన్ని బ్యాంకులు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఒక్కొక్క బ్యాంక్‌లో ఒక్కొక్క విధమైన జీతాలు. చేసిన వ్యాపారం మీద కమీషన్, లేక కొంత నిర్దిష్ట కమీషన్ కొంత జీతం. కొన్ని బ్యాంకులలో బ్యాంక్ శాఖల నుంచి, కొన్ని బ్యాంకులలో నిర్దిష్టమైన ప్రాంతాల నుంచి పనిచేస్తున్నారు. సెంట్రల్ బ్యాంకులో మన రాష్ట్రంలో నెల రోజులు పనిచేసి రూ.రెండు వేల అతి తక్కువ ఆదాయంతో, కొంతమంది రూ.6 వేలు, రూ.10 వేల లోపు సంపాదనతో బిజినెస్ కరస్పాండెంట్ గా పనిచేస్తున్నారు. కొన్ని బ్యాంకులలో మాత్రమే నిర్దిష్ట జీతాలు ఉన్నాయి. ఈవిధంగా అరకొర జీతాలతో బ్యాంకులలో 35 లక్షల మంది బిజినెస్ కరస్పాండెంట్లున్నారు. బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగులు 15 లక్షల మంది. అంటే ఉద్యోగుల సంఖ్య కంటే రెట్టింపు పైగా బిజినెస్ కరస్పాండెంట్లున్నారన్న మాట.

ఇంతేనా? ఇంకా నిర్ఘాంత పోయే రూపాలలో శ్రమదోపిడీ బ్యాంకులను ఏలుతుంది. గత పదేండ్లకాలంలో బ్యాంకుల వ్యాపారం 270 శాతం పెరిగింది. పెరిగిన వ్యాపారానికి తగిన రిక్రూట్మెంట్ జరగలేదు సరికదా పదవీ విరమణ వలన, ఉద్యోగుల మరణం, పర్మినెంట్ ఉద్యోగాల్లో ఏర్పడిన ఖాళీలలో కూడా రిక్రూట్మెంట్ జరగలేదు. ఉన్న ఉద్యోగుల మీద పనిభారం చెప్పలేనంతగా పెరిగింది. శాఖలు నడపలేని స్థితిలో టెంపరరీ, క్యాజువల్, కాంట్రాక్టు ఉద్యోగులను నియమిస్తూ వస్తున్నారు. ఇన్‌స్పెక్షన్, రుణాల మంజూరు, రికవరీ, క్రెడిట్ కార్డు వ్యాపారం, ఏటీఎంలలో క్యాష్ పెట్టటం, క్యాష్ శాఖలకు సరఫరా చెయ్యటం, సీనియర్ ఎగ్జిక్యూటివ్ స్థాయివరకు, ఒకటేమిటి అన్ని విభాగాలలో అన్ని క్యాడర్లలో కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. సుమారు లక్షన్నర మంది పర్మినెంట్ ఉద్యోగాలలో టెంపరరీ క్యాజువల్ కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీళ్లందరినీ పర్మినెంట్ చేయాలని ఏండ్ల తరబడి ఉద్యమాలు జరుగుతున్నా ప్రయోజనం లేదు. సమాన పర్మినెంట్ ఉద్యోగాలలో పనికి సమాన వేతనం మచ్చుకైనా మిగల్లేదు.

అన్యాయాన్ని ఎదిరించి ఓడించటమే ప్రధాన కర్తవ్యం

దేశంలో నిరుద్యోగం పెరిగి గత 45 ఏండ్లలో లేనంత ఎక్కువ స్థాయికి చేరిందని అనేక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఉద్యోగం చేసే వయసు (15-59 సం.లు) లో ఉన్న యువకులు, గ్రాడ్యుయేషన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన యువకులలో నిరుద్యోగం పెరుగుతుంది. ఆర్థిక అంతరాలు బ్రిటిష్ కాలంలో కంటే ఘోరంగా పెరిగాయి. 80 కోట్ల మంది ప్రజలు ప్రభుత్వ రేషన్ మీద ఆధార పడి జీవితాలు వెళ్లదీస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం పాలనలో కుబేరులు సంఖ్య వారి వద్ద పోగుపడ్డ సంపద అందనంత ఎత్తుకు పెరిగాయి. నిరుద్యోగం, ఆకలి, అసమానతలు ఈ ప్రభుత్వ విధానాలు సృష్టించినవే. ఇది ప్రతి పౌరుడు గౌరవ ప్రదంగా జీవించే హక్కును కాలరాయటమే. పైన పేర్కొన్నది ఒక్క బ్యాంకింగ్

2021-2022 ఆర్థిక సంవత్సర ఫలితాలను ప్రకటిస్తూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్, ప్రయివేటు బ్యాంకులతో పోటీపడి లాభాలు సంపాదిస్తున్నా ఖర్చు - ఆదాయనిష్పత్తి (కాస్ట్ టు ఇన్కమ్ రేషియో) ఎక్కువగా ఉండటం వలన స్టేట్ బ్యాంక్ నికర లాభాలు తక్కువగా ఉన్నాయని పత్రికా సమావేశంలో చెప్పారు. అంటే ఖర్చు తగ్గించుకోవాలని ఆయన తాత్పర్యం. ఆరోజు తెలియదు అది నిరుద్యోగుల పాలిట శాపంగా మారుతుందని. మూడు నెల్ల తర్వాత 'స్టేట్ బ్యాంక్ ఆపరేషన్స్ సపోర్ట్ సర్వీసెస్' (ఎస్‌బిఓఎస్-ఎస్) అనే అవుట్‌సోర్సింగ్ కంపెనీని స్వంతగా (రిజర్వ్ బ్యాంక్ అనుమతితో) స్థాపించింది. స్టేట్ బ్యాంక్ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న శాఖలు నడపటానికి కావలసిన కాంట్రాక్టు ఉద్యోగులను ఎంపిక చేయటం ఆ కంపెనీ ఉద్దేశ్యం. స్టేట్ బ్యాంక్‌లో పనిచేసే పర్మినెంట్ ఉద్యోగుల జీతాలు వారికి వర్తించవు.

రంగంలో ఉన్న పరిస్థితే కాదు. ప్రతి ప్రభుత్వశాఖ, ప్రభుత్వ రంగ సంస్థలోనూ ఇదే పరిస్థితి. కాకుల్ని కొట్టి గద్దలకు వేసిన చందంగా ఉన్న ప్రభుత్వ విధానాలు మారాలి. ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వరంగ సంస్థల్లో ఉన్న లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడమే సరైన పరిష్కారం. దీనివలన కోట్ల కుటుంబాలు సరైన విద్య వైద్యాన్ని పొందగలుగుతాయి. కార్పొరేట్ కంపెనీల లాభాల పెంపుకోసం, వారి సేవలో తరించే ప్రభుత్వం మారాలి. దానికి ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలు సువర్ణావ కాశం.ఈ నెల13న జరిగే ఎన్నికల్లో బ్యాంకు ఉద్యోగులు, బ్యాంకులలో పని చేస్తున్న లక్షలాది మంది టెంపరరీ క్యాజువల్ కాంట్రాక్టు ఉద్యోగులు, బ్యాంకులతో ముడిపడి ఉన్న కోట్లాది మంది ఖాతా దారులు వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక పార్టీల అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలి. సరైన విధాన రూపకల్పనకు ఉద్యమిం చటమే దేశం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకూ పరిష్కారం. ■



ఉద్యోగులకు కనీస వేతనం రూ.35 వేలివ్వాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి టీఎన్జీవో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కనీస వేతనం రూ. 35 వేలు, గరిష్ఠ వేతనం 2,99,100 చెల్లించాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్(టీఎన్జీవో) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం ఆ సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం పీఆర్సీ కమిషనర్ ఎన్. శివశంకర్, సభ్యులు రామయ్యను కలిసి తమ డిమాండ్లను తెలిపింది. రెండో పీఆర్సీని 51 శాతం ఫిట్మెంట్, 33.67 శాతం కరువు భత్యంతో కలిపి చెల్లించాలనీ, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరింది. కనీస పెన్షన్ రూ. 9,500 నుంచి, 17,500 పెంచాలనీ, రిటైర్మెంట్ గ్రాట్యూటీ రూ.16 లక్షల నుంచి రూ. 24 లక్షలకు పెంచాలనీ, 25 ఏండ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగికి పూర్తి పెన్షన్ అందించాలని విన్నవించింది. ఉద్యోగులందరికీ రూ.500తో ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలనీ, మహిళా ఉద్యోగులకు కేంద్రం ఇచ్చే విధంగా శిశు సంరక్షణ సెలవులను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని కోరింది. పీఆర్సీ కమిటీ తన నివేదికను ఆలస్యం చేయకుండా నిర్దేశిత గడువులోగా ప్రభుత్వానికి సమర్పించాలని విజ్ఞప్తి చేసింది ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కస్తూరి వెంకట్, సత్యనారాయణ గౌడ్, లక్ష్మణ్, ముజీబ్, కొండల్ రెడ్డి , గోవర్ధన్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

కాళేశ్వరం విచారణలో మరో ముందడుగు

- నేడు మేడిగడ్డకు జస్టిస్ ఘోష్ న్యాయ కమిషన్
- నిర్మాణ పనుల పరిశీలన
- కమిషన్‌లోకి కొత్తగా మరో ఇద్దరు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలపై మాజీ సుప్రీంకోర్టు జడ్జీ జస్టిస్ పినాకిని చంద్రఘోష్ విచారణకు మరో ముందడుగు పడనుంది. మంగళవారం జస్టిస్ ఘోష్ న్యాయ కమిషన్ మేడిగడ్డను సందర్శించనుంది. నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించనుంది. కమిషన్‌కు సహకరించేందుకు మరో ఇద్దరు అధికారుల సహకారం తీసుకోనున్నారు. ఈమేరకు సోమవారం ప్రభుత్వ ఉన్నతాధికారులు జస్టిస్ ఘోష్‌ను సంప్రదించి షెడ్యూల్ ఖరారు చేశారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఆయన కోల్‌కతా నుంచి హదరాబాద్‌కు వచ్చారు. నగరంలోని హోటల్ తాజ్‌కృష్ణాలో బసచేస్తారు. జస్టిస్ ఘోష్‌ను రాష్ట్ర ప్రభుత్వ అతిథిగా పరిగణించాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఈమేరకు ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగం పొలిటికల్ సెక్రెటరి నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీచేశారు. ఈసందర్భంగా ఖర్చయ్యే వ్యయాన్ని పూర్తిగా రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ భరించనుంది.

ఘోష్‌తో భేటి అయిన ఉన్నతాధికారులు

జస్టిస్ ఘోష్‌తో రాష్ట్ర సాగునీటి పారుదల ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఎస్ఈ విజయభాస్కర్ తదితరులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా గతంలో ఘోష్ ఇచ్చిన ఆదేశాల అమలుపై చర్చించారు. అలాగే ఎన్‌డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికలపై మాట్లాడినట్టు సమాచారం. ఎన్‌డీఎస్ నివేదిక కోసం రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయగా, అక్కడి నుంచి ఎలాంటి సమాచారం రాలేదని అధికారులు చెప్పారు. విజిలెన్స్ నివేదిక ఇప్పటికే ఘోష్ కమిషన్‌కు అందజేసినట్టు సమాచారం. నివేదికల ఆధారంగానే విచారణ జరుగుతుందనీ, ముఖాలు చూసి విచారణ చేయబోమని ఇప్పటికే జస్టిస్ ఘోష్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అలాగే సోమవారం ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో మేడిగడ్డ టూర్ ప్లాన్ చేసినట్టు సమాచారం. అక్కడ మేడిగడ్డ బ్యారేజీ పగుళ్లతోపాటు ఇతర నిర్మాణ పనులు జస్టిస్ ఘోష్ న్యాయ కమిషన్ పరిశీలించనుంది. ఇప్పటికే నివేదికలను అధ్యయనం చేసిన ఘోష్, మంగళవారం నాటి పర్యటనలో ప్రత్యక్షంగా పనులు చూడనున్నారు. ఈమేరకు ఆయన ఒక నిర్ధారణకు వచ్చే అవకాశం ఉన్నట్టు తెలిసింది. అలాగే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తర్వాత పరిశీలించే అవకాశం ఉంది. మొత్తం విచారణను వేగంగా పూర్తిచేయాలని జస్టిస్ ఘోష్ భావిస్తున్నట్టు తెలిసిందే. అదే సందర్భంగా నివేదికను పకడ్బందీగా ఇచ్చేందుకు సమగ్ర అధ్యయనం చేయానలి నిర్ణయించుకున్నట్టు సమాచారం.

కమిషన్‌లోకి మరో ఇద్దరు

కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకిని చంద్రఘోష్ న్యాయ కమిషన్‌లోకి మరో ఇద్దరు అధికారులు చేరనున్నారు. మొత్తం కమిషన్ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర హైకోర్టు మాజీ రిజిస్ట్రార్ హోదా గల అధికారిని నియమించనున్నారు. అలాగే సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించేందుకుగాను మరో సీనియర్ ఇంజినీర్ సాథయి అధికారిని తీసుకోనున్నారు. ఈ ఇద్దరి నియామకానికి సంబంధించి సోమవారం రాత్రికిగాని, మంగళవారం గాని ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

పీఎం స్థాయిలో ఇంతటి మతవిద్వేషమా?

- మోడీ వ్యాఖ్యలతో హిందువుల్లో పెరిగిన భయాందోళనలు
- ఆర్థిక దోపిడీదారులు, లైంగిక వేధింపులకు పాల్పడ్డవారికి బీజేపీ వత్తాసు
- కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే సెక్యులరిజానికి భద్రత : రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హిందువులు, ముస్లింలకు మధ్య మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా పీఎం మోడీ వ్యాఖ్యలు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రధాని వ్యాఖ్యలతో విదేశాల్లో, ముఖ్యంగా ఇస్లామిక్ దేశాల్లో ప్రశాంతంగా జీవనం సాగిస్తున్న హిందువులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే తనకు అనేక మంది ఫోన్లు చేసి తమ భయాన్ని వ్యక్తం చేస్తున్నారనీ, భారతదేశంలో సెక్యులరిజాన్ని కాపాడాలంటూ కోరుతున్నారని తెలిపారు.

దాదాపు వేల మంది మహిళలను లైంగికంగా వేధించిన రేవణ్ణకు విదేశాలకు వెళ్లేందుకు సహకరించిన బీజేపీ మహిళా వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన వారినీ, రైతులను జీపుతో తొక్కించి చంపిన వారికి టికెట్లిచ్చి కమలం పార్టీ ప్రోత్సహించిందని దుయ్యబట్టారు. బ్యాంకులను మోసం చేసిన నీరవ్ మోడీ, చోక్సీ లాంటి వారు ఇప్పటికే దేశం వదిలి పారిపోతే, ఇప్పుడు మహిళలను వేధించిన వారిని కూడా విదేశాలకు పారిపోయేందుకు బీజేపీ సర్కార్ సహకరించిందని తెలిపారు.

చైనా సరిహద్దులు దాటి భారతదేశం లోపలికి వచ్చి ఆక్రమించుకుంటున్నా...పట్టించుకోని మోడీ సర్కార్, దేశంలో ముస్లింల మీదికి ఎగబడుతోందని తప్పుపట్టారు. బీజేపీ నాయకులు ఎన్నికల కోడ్‌ను పదే పదే ఉల్లంఘిస్తున్నా ఎన్నికల సంఘం మౌనంగా ఎందుకుందని ప్రశ్నించారు. ఆ పార్టీని ఓడించి, కాంగ్రెస్‌ను గెలిపిస్తే మహిళలకు, రైతులకు, అన్ని మతాల వారికీ దేశంలో భద్రత ఉంటుందని తెలిపారు.

టెట్‌పై నిర్లక్ష్యం

- విద్యాశాఖ కమిషనర్‌పై చర్య తీసుకోవాలి :టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి



నవతెలంగాణ- నల్లగొండటౌన్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల ప్రమోషన్ల సంక్షోభానికి కారణమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) వివాదం పరిష్కారం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ కమిషనర్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగోన్నతుల కొనసాగింపునకు ఆటంకంగా ఉన్న టెట్‌పై ఎన్సీటీఈ వివరణ తీసుకోవాలని పదేపదే ప్రతిపాదనలు చేసిన దరిమిలా ఫిబ్రవరిలో క్లారిఫికేషన్ కోసం లేఖ రాసి రహస్యంగా ఉంచారని చెప్పారు. పదోన్నతులకు టెట్ అవసరం లేదని పేర్కొంటూ ఏప్రిల్ 8న వచ్చిన వివరణ లేఖను వెల్లడించకుండా ఉపాధ్యాయులందర్నీ మానసికాందోళనకు గురిచేయడంతో పాటు టెట్‌కు దరఖాస్తు చేయించడం ద్వారా లక్షల రూపాయలు వృథా చేయించారని పాఠశాల విద్యా కమిషనర్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేండ్లుగా కమిషనర్ పనితీరు బాగా లేదని, ఉపాధ్యాయులు, సంఘాలు చివరికి ప్రజాప్రతినిధులతో సైతం సరిగా వ్యవహరించడం లేదని అన్నారు. ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధోరణితో ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యార న్నారు. విద్యాశాఖలో వేలాది కోర్టు కేసులు పడటానికి కమిషనర్ అసమర్థ వ్యవహారమే కారణమన్నారు. ఎన్సీటీఈ నుంచి మరికొన్ని అంశాలపై వివరణ తీసుకుని ఎన్నికలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని కోరారు. సెప్టెంబర్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను ఎన్నికలు ముగిసిన వెంటనే రిలీవ్ చేయాలన్నారు.

విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యావాలంటీర్లను నియమించి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, సర్వీసు పర్సన్స్‌ను నియమించాలని కోరారు. వేసవి సెలవులు ముగిసేలోగా మోడల్ స్కూల్స్, గురుకులా ల్లో బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. గత పీఆర్సీ బకాయిలు సహా ట్రెజరీ ఆమోదం పొంది ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ళ వెంకటేశం, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నలపరాజు వెంకన్న, మురళయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ఎరనాగుల సైదులు, నాయకులు రాజశేఖర్, రమణ, ప్రభాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో భాగస్వాములవ్వాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. హైదరాబాద్ గన్ ఫౌండ్రీలోని ఆల్ సెయింట్స్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్, డేటా ఎంట్రీ, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, రిజిస్టర్లను పరిశీలించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఇప్పటివరకు ఎంతమంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వేశారని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వికాస్‌రాజ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల కోసం వారు ఇచ్చిన ఆప్షన్ ప్రకారం పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మే 3 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఈవీఎం ర్యాండమైజేషన్ జరిగిందని, బ్యాలెట్ కమిషనింగ్ ప్రక్రియ మొదలైందని అన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు.

జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలు, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల సందర్భంగా ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హోమ్ ఓటింగ్ ప్రక్రియ కూడా కొనసాగుతున్నదని, ఇప్పటి వరకు రెండు పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటుగా కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్టు తెలిపారు. హోమ్ ఓటింగ్‌లో ఆదివారం నాటికి 571 ఓటర్లకుగానూ 479 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వివరించారు.

జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడానికి స్వీప్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల రోజు ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు పోలింగ్ స్టేషన్‌లో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఓటు ప్రజాస్వామ్యం మనుగడకు వారి బాధ్యతను గుర్తు చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

బూర నర్సయ్య గౌడ్ భూ కబ్జాదారుడు



- ప్రభుత్వ భూమికి అప్పటి కలెక్టర్ నుంచి ఎన్ఓసీ, హెచ్ఎండీఏ అనుమతులు
- ప్లాట్స్ కబ్జా చేశారని బాధితుల ఆరోపణలు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

స్వాతంత్ర్య సమరయోధులకు చెందిన భూమికి ఎన్ఓసీ పొంది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేసి మాజీ ఎంపీ, భువనగిరి బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ కోట్ల రూపాయలు కొల్లగొట్టారని బాధితులు గర్లపాటి కుమార్, గర్లపాటి వెంకన్న, గంగాధర్, ఎ.లక్ష్మీపతి, శ్రీనివాస్, అశోక్ కుమార్, రఘు, అనిల్ కుమార్, బాలకృష్ణ, వేణు అన్నారు. బూర నర్సయ్యగౌడ్ భూ ఆక్రమణలను నిరసిస్తూ సోమవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామంలోని తమ ప్లాట్ల వద్ద భూ బాధితులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరు సమావేశంలో వారు మాట్లాడుతూ.. పసుమాముల గ్రామ రెవెన్యూ సర్వేనెం.106/2లో వీరమోచినేని నారాయణరావుకు గతంలో స్వాతంత్ర్య సమరయోధుల కింద ప్రభుత్వం ఏడెకరాల భూమి కేటాయించిందని తెలిపారు. కాలక్రమేణా భూముల కు ధరలు పెరగడంతో ఆ భూమిపై బూర నర్సయ్యగౌడ్ కన్ను పడిందని ఆరోపించారు. ఆ భూమికి ఎన్ఓసీ కావాలని స్థానిక తహసీల్దార్ వెంకట్ రెడ్డిని అడగ్గా.. ఆయన నిరాకరించారని తెలిపారు. అయితే, బూర నర్సయ్య గౌడ్ తన పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వ పెద్దలతో నాటి కలెక్టర్‌ను ఒప్పించుకొని ఎన్ఓసీ పొంది ఆ భూమిని కోట్ల రూపాయలకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకు న్నారని ఆరోపించారు. అలాగే నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ సహాయంతో ధరణిలో భూరికార్డుల్లో నమోదు చేసుకుని, హెచ్ఎండీఏ అధికారి శివ బాలకృష్ణతో ఉన్న పరిచయంతో హెచ్ఎండీఏ నుంచి కూడా అనుమతి పొందారని అన్నారు. అంతేకాకుండా సర్వే నెం.87, 88లోని తమకు సంబంధించిన 24 ప్లాట్లను కూడా తన సర్వే నెంబర్ భూమిలోకి మార్చుకొని అమ్ముకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో అప్పట్లోనే పెద్దఎత్తున ఆందోళన చేపట్టి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కానీ బూర నర్సయ్యగౌడ్ తనకున్న అధికార పలుకుబడితో కేసును నీరు గార్చారన్నారు. చివరకు హైకోర్టులో కేసు వేసినట్టు తెలిపారు. విషయం కోర్టు దృష్టికి వెళ్లడంతో వెంటనే బూర నర్సయ్యగౌడ్ అనుచరుల ద్వారా ప్లాట్స్ యజమానులను (తమను) పిలిచి పలువురు పెద్దమనుషుల మధ్య ఒప్పందం చేసుకున్నారని, తమ 24 ప్లాట్స్ తిరిగిస్తామని రాతపూర్వకంగా రాసి ఇచ్చారని అన్నారు. కానీ ఇప్పటికీ ప్లాట్స్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఎన్నిసార్లు ఆయనను కలవడానికి ప్రయత్నించినా కలవకుండా మోసం చేస్తున్నారని తెలిపారు. తమ ప్లాట్స్ తమకు దక్కే వరకు న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.



అబద్ధాలకోరు మోడీని, బీజేపీని సాగనంపాలి

- ఇండియా కూటమిని గెలిపించాలి : సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

నవతెలంగాణ - కరీంనగర్

గత ఎన్నికల్లో దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రజలను వంచించిన అబద్ధాలకోరు నరేంద్ర మోడీని, మతోన్మాద బీజేపీని ఇంటికి సాగనంపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపు కోసం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సీపీఐ, ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నియోజకవర్గ కన్వీనర్ మర్రి వెంకటస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. పది సంవత్సరాల బీజేపీ పరిపాలనలో మతోన్మాదం పెరిగిపోయిందని, హిందువులు, మైనార్టీల మధ్య చిచ్చుపెట్టేందుకు బీజేపీ నేతలు అనేక కుట్రలు పన్నారని అన్నారు. దేశవ్యాప్తంగా దళితులు, మైనార్టీలు, మేధావులపై దాడులు, హత్యలు జరిగాయని, అనేకమంది మేధావులను నిర్బంధించి జైల్లో పెట్టిన బీజేపీని ప్రజలు ఎందుకు ఆదరించాలని ప్రశ్నించారు. నరేంద్రమోడీకి వివాహ వ్యవస్థపై గౌరవం లేదని, తాళి విలువ తెలియదని విమర్శించారు. తాళి కట్టిన భార్యను వదిలేసినోడు విలువల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పదేండ్ల మోడీ పాలనలో ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో సామాన్యులపై భారం పడిందని, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో మోడీ వైఫల్యం చెందారని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా, అభివృద్ధి పనులు చేపట్టని బండి సంజయ్‌కి ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును కరీంనగర్ ఎంపీగా గెలిపించాలని శ్రేణులకు సూచించారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. దేశ పయనం ఎటువైపు ఉంటుందో ఈ ఎన్నికల ఫలితాల ద్వారా తేటతెల్లమవుతుందన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే కులగణన జరిగి తీరుతుందని, తద్వారా ఆయా సామాజిక తరగతులకు రిజర్వేషన్ల ప్రకారం మేలు చేకూరుతుందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ.. దేశంలో మత సామరస్యం, దేశ భద్రత, సమగ్రతను కాపాడుకునేందుకు ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి రావాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడం సంతోషకరమని, తన గెలుపు కోసం పనిచేస్తున్న సీపీఐ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, సిద్దిపేట, హనుమకొండ, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల సీపీఐ కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రభుత్వరంగ సంస్థలను అమ్మడమే మోడీ గ్యారంటీ..

- నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపించాలి : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడమే మోడీ గ్యారంటీ అని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నిజామాబాద్ పార్లమెంటు సభ్యునిగా కాంగ్రెస్ అభ్యర్థి టీ.జీవన్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడని, అలాంటి నాయకుడిని గెలిపించుకుంటే పార్లమెంటు లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారని అన్నారు. మోడీ 'సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్' ఎక్కడుందో చెప్పాలని ప్రశ్నించారు. 'ఫిర్ ఏక్ బార్.. మోడీ కా సర్కార్' అని నినదించడానికి సిగ్గు పడాలన్నారు. ఎవరికి అచ్చేదిన్.. ఈ దేశంలో బడా కార్పొరేట్లకు తప్ప శ్రమజీవులకు మోడీ గ్యారంటీ ఇచ్చింది ఏమీ లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మడం మోడీ గ్యారంటీ, మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం మోడీ గ్యారంటీ, ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని ఖూనీ చేయడం మోడీ గ్యారంటీనా..? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, తెలంగాణ ప్రజా జేఏసీ నాయకులు భాస్కర్, షేక్ హుస్సేన్, జైహిర్, రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు కె.రామ్మోహన్, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు ఈవీఎల్ నారాయణ పాల్గొన్నారు.

పన్నెండు సీట్లు ఇవ్వండి..

- మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారు
- దేవుడి పేరుతో బీజేపీ ఓట్ల రాజకీయం
- చేసింది చెప్పుకునే దమ్ము లేని మోడీని గద్దె దించాలి :కరీంనగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



నవతెలంగాణ- కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/సిరిసిల్లటౌన్/శంషాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో 12 సీట్లు ఇవ్వండి.. కేసీఆర్ మళ్లీ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగా ఉందని అనుకునేటోళ్లు కారు గుర్తుకు ఓటేయాలని సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని తంగళ్లపల్లిలో జరిగిన సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. అలాగే, సిరిసిల్ల రోడ్‌షోలో, రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్‌లో కార్నర్ మీటింగ్స్‌లో పాల్గొన్నారు.

'రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రైతు కూలీలకు, కౌలు రౌతులకు పైసలిస్తా అని రేవంత్ రెడ్డి అన్నారు. మహిళలకు రూ. 2500, ఇంట్లో పెద్ద మనుషులు ఇద్దరికీ రూ.4 వేల పింఛన్ అన్నారు. తులం బంగారం, స్కూటీలని రేవంత్‌రెడ్డి చెప్పిండు. ఇలా రంగుల కల లాంటి సినిమా చూపించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది' అని తంగిళ్లపల్లిలో కేటీఆర్ అన్నారు. ఈ ఐదు నెలల్లోనే ప్రజలందరికీ అన్ని విషయాలు అర్థమయ్యాయని తెలిపారు. కరెంట్ కోతలు, నీళ్ల కష్టాలు, బోనస్ సంగతి పక్కన పెట్టి, తంగళ్లపల్లి బ్రిడ్జి కింద నీళ్లు లేకుండా చేశారని విమర్శించారు.

దేవుడి పేరుతో బీజేపీ ఓట్ల రాజకీయం

రాముడిని మొక్కి, ప్రజల మధ్య మతవిద్వేషాలను రెచ్చగొడుతూ దేవుడి పేరుతో ఓట్ల రాజకీయం చేస్తున్న బీజేపీని తొక్కాలని కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పదేండ్ల పాలనలో మోడీ ప్రజలకు చేసిందేమీ లేదని.. పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచి భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. టోల్ టాక్స్ పేరిట రూ.30 లక్షల కోట్లను ప్రజల నుంచి వసూలు చేసి అంబానీ, అదానిలాంటి వారికి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. బండి సంజయ్ సిరిసిల్ల ప్రజలకు, నేతన్నలకు ఏం చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అమలుకాని అడ్డగోలు హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందని ఆరోపించారు. సిరిసిల్ల నేతన్నలకు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకుండా ఉపాధి కొల్లగొడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని మరోసారి ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. తనకు రాజకీయంగా జన్మనిచ్చింది సిరిసిల్ల అని, 10ఏండ్లలో సిరిసిల్లను ఎంతగానో అభివృద్ధి చేశానన్నారు. నేత కార్మికుల కోసం బీఆర్ఎస్ హయాంలో రూ.3వేలకోట్లు ఖర్చు చేసి కార్మికులను కాపాడుకున్నామన్నామని అన్నారు. ఐదేండ్లలో రూపాయి, మందూ పంచలేదని.. మీరు నాకు ఇచ్చిన దయ అన్నారు. రాజకీయంగా జన్మనిచ్చింది సిరిసిల్లనేనన్నారు. చిన్నచిన్న మనస్పర్థలు పక్కనపెట్టి పని చేస్తే వినోద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుస్తారని అన్నారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గూడూరు ప్రవీణ్, బుర్ర నారాయణగౌడ్ పాల్గొన్నారు.

తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి..

'తంగళ్లపల్లి ప్రజలకు నా మీద కోపం వచ్చినట్టుంది. మొన్నటి ఎన్నికల్లో కొంచెం మెజార్టీ తగ్గించారు. నేను తెలిసో తెలియకనో తప్పు చేసి ఉంటే క్షమించండి' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీజేపోళ్లు డైరెక్ట్‌గా 400 సీట్లు వస్తే మొత్తం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటున్నారని, ఇలాంటి కుట్రలను తిప్పికొట్టాలంటే కచ్చితంగా పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఉండాలన్నారు.

జూన్ 2 తర్వాత హైదరాబాద్‌ను యూటీ చేయడానికి బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. పార్లమెంట్ స్థానాలకు ఒక్కటే జిల్లా ఉండాలని రేవంత్ రెడ్డి చెబుతున్నాడని, జిల్లాలు రద్దు కాకుండా ఉండాలంటే దానికోసం కొట్లాడాలంటే బీఆర్ఎస్ లోక్‌సభలో ఉండాలన్నారు. సిరిసిల్లలో పదేండ్లుగా లేని ఆత్మహత్యలు కాంగ్రెస్ రాగానే మళ్లీ ఇప్పుడు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని తంగళ్లపల్లి చౌరస్తాలో నిలబెడితే కాంగ్రెసోళ్లే గుర్తు పట్టరని ఎద్దేవా చేశారు.

మోడీ 2014 లో ఎన్నో హామీలు ఇచ్చి గద్దెనెక్కిండు. అదే ఏడాది బీఆర్ఎస్ కూడా అధికారంలోకి వచ్చింది. ఈ పదేండ్లలో మీరు ఏం పనులు చేశారు అని అడిగితే సాయంత్రం దాకా లెక్క చెబుతా.. మరి బీజేపోళ్లు ఏమి చెబుతారు.. ఎందుకు ఓటు వేయాలో ఒక్క కారణం చెప్పు బండి సంజయ్' అని ప్రశ్నించారు. గుడి కట్టుడు ఒక్కటే ఓటు వేసేందుకు కారణమైతే కేసీఆర్ యాదాద్రితో పాటు కాళేశ్వరం లాంటి సాగునీటి ప్రాజెక్టులు కట్టించారని, వాటికి దేవుళ్ల పేరే పెట్టామన్నారు. మరి దేవుళ్లకు ఇంత సేవ చేసిన కేసీఆర్‌కు ఓటు వేయాల్నా? వద్దా? అనేది ఆలోచించుకోవాలని కేటీఆర్ సూచించారు. మోడీ ఈ దేశానికి చేసిన అతి పెద్ద మోసం.. మొత్తం ధరలు పెంచటమన్నారు.

నయవంచక కాంగ్రెస్, బీజేపీని చిత్తుగా ఓడించాలి

పదేండుల్లో కేంద్రంలో అధికారాన్ని చెలాయిస్తున్న నరేంద్ర మోడీ గుడి పేరు చెప్పకుండా.. వారేం చేశారో చెప్పుకునే దమ్ము లేదు.. అలాంటి వారిని చిత్తుగా ఓడించాలి శంషాబాద్‌లో కేటీఆర్ అన్నారు. గుడి పేరు చెప్పకుండా చేసిన చేయబోయే అభివృద్ధి గురించి మోడీ మాట్లాడాలని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ భాషలో తిట్ల పురాణం ఎత్తుకున్నారని, ఆయన మాట్లాడే భాష మన ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని కోరారు. ఆ రెండు పార్టీలను చిత్తు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.బడుగు, బలహీన వర్గాల కోసం శ్రమించిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను చేవెళ్ల నియోజకవర్గంలో లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీజేపీని ఒంటరి చేద్దాం

400 కాదు 200 సీట్లూ కష్టమే

మోడీ సర్కారు రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నాం

- తెలంగాణలో నేటి నుంచి 11 వరకు ప్రజల్లోకి
- జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో క్యాంపెయిన్‌లు
- కనీసమద్దతు ధరల చట్టం, రుణమాఫీ చేయకపోవడంపై రైతులకు వివరిస్తాం
- సంయుక్త కిసాన్‌మోర్చా జాతీయ నాయకులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశవ్యాప్తంగా బీజేపీ 400 సీట్లు కాదు..200 సీట్లు కూడా దాటబోవని సంయుక్త కిసాన్‌మోర్చా (ఎస్‌కేఎం) జాతీయ నాయకులు నొక్కి చెప్పారు. రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో గ్రామాల్లోకి బీజేపీ అభ్యర్థులను ప్రచారానికి రానివ్వని పరిస్థితి నెలకొందన్నారు. మోడీ, అమిత్, బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారమంతా డంబాచారమేనని స్పష్టం చేశారు. ఢిల్లీ చారిత్రాత్మక పోరాటం సందర్భంగా రైతాంగానికి రాతపూర్వకంగా మోడీ సర్కారు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఎమ్.ఎస్.స్వామినాథ్ చేసిన సిఫారసులను బుట్టదాఖలు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీని ఒంటరి చేద్దాం.. వ్యతిరేకిద్దాం.. శిక్షిద్దాం.. దేశాన్ని రక్షించుకుందాం నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నామనీ, అందులో భాగంగానే మంగళవారం నుంచి 11వ తేదీ వరకు ప్రజల్లోకి వెళ్తామనీ, జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ప్రచారం చేస్తామని వారు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎస్‌కేఎం జాతీయ నాయకులు డాక్టర్ విజ్జూకృష్ణన్, డాక్టర్ సునీలం, సురేష్ రౌత్, అవతార్ సింగ్ మెహ్మ, కె బాలకృష్ణన్, రవి కిరణ్ పుంచ, అరుణ్ కుమార్, రాయల చంద్రశేఖర్, ఎ.నాగేంద్ర మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ హయాంలో రైతులు అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. పదేండ్ల కాలంలో 4.25 లక్షల మంది రైతులు, వ్యవసాయ కూలీలు, దినసరి కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారని వాపోయారు.

ఆత్మహత్యల నివారణకు కేంద్ర ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోకపోగా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు పూనుకున్నదని విమర్శించారు. మూడు వ్యవసాయ చట్టాలు, విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా 13 నెలల పాటు సుదీర్ఘ పోరాటం జరిగిందనీ, అందులో 750 మంది రైతులు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. రైతుల పోరాట ఫలితంగా 2021 డిసెంబర్ 9న మోడీ సర్కారు దిగొచ్చి మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవడంతో పాటు కనీస మద్దతు ధరల చట్టం, రుణమాఫీ చేస్తామని హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. రైతులతో మాట్లాడకుండా విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంట్లో పెట్టబోమనీ, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేస్తామని రాతపూర్వకంగా హామీనిచ్చిందని తెలిపారు. రెండేండ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం వాటిని అమలు చేయకపోగా అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్లకు వ్యవసాయాన్ని కట్టబెట్టే చర్యలకు పూనుకున్నదని విమర్శించారు. పంట కొనుగోలు పథకానికి నిధుల్లో కోతపెట్టిందనీ, ఎఫ్‌సీఐని నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. రుణమాఫీ ప్రస్తావనే లేదన్నారు. ఇదే సమయంలో బడా కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేశారని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న హామీ ఏమైందని మోడీని ప్రశ్నించారు. రైతులను మోసం చేసిన బీజేపీకి చెందిన అభ్యర్థులను లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎస్కేఎం రాష్ట్ర నాయకులు ఎస్.అన్వేశ్‌రెడ్డి, టి.సాగర్, విస్సాకిరణ్, వి.ప్రభాకర్, కోటేశ్వరరావు, మామిడాల భిక్షపతి, జక్కుల వెంకటయ్య ఆర్.వెంకట్రాములు ప్రసాదన్న, అరిబండి ప్రసాద్ మాట్లాడుతూ..

రైతాంగంపై మోడీ సర్కారు మోపిన అక్రమ కేసులను ఎత్తివేయకపోగా రైతుల పోరాటానికి అండగా నిలబడిన మేధావులు, విలేకర్లపై అక్రమ కేసులు బనాయించిన తీరును వివరించారు. సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ వ్యవస్థను తీసుకొచ్చిందని విమర్శించారు. ఉపాధిహామీ చట్టాన్ని 200 రోజులకు పెంచి రోజు కూలి రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేస్తుండగా.. మోడీ సర్కారు మాత్రం ఏటేటా నిధులు తగ్గిస్తూ పోతున్న తీరును ఎండగట్టారు.

ఈసెట్ రాతపరీక్ష ప్రశాంతం

- 96.12 శాతం మంది హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీటెక్, బీఈ, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో సోమవారం నిర్వహించిన ఈసెట్ రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ మేరకు ఈసెట్ కన్వీనర్ పి చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల ఆరున ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒకే విడతలో 99 పరీక్షా కేంద్రాల్లో ఈసెట్ రాతపరీక్షలను నిర్వహించామని తెలిపారు. 24,272 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 23,330 (96.12 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.ఇందులో తెలంగాణ నుంచి 22,272 మంది దరఖాస్తు చేస్తే, 21,513 (96.58 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని వివరించారు. ఏపీ నుంచి రెండు వేల మంది దరఖాస్తు చేయగా, 1,817 (90.85 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్ష జరిగిన తీరును ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, ఓయూ వీసీ డి రవీందర్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ పర్యవేక్షించారని పేర్కొన్నారు. ఈనెలాఖరులో ఈసెట్ ఫలితాలను విడుదల చేసే అవకాశమున్నట్టు తెలిసింది.

అడ్వాన్స్‌డ్ ఐఐటి, జేఈఈ పరీక్షలకు ఆన్‌లైన్ ఉచిత శిక్షణ

- జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ అశోక్ పరికిపండ్ల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వచ్ఛంద సంస్థలు నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్, ఆరోగ్య మిత్రల సంయుక్తాధ్వర్యంలో ఐఐటీ, ఎన్ఐటీ పూర్వ విద్యార్థులతో ఉచిత ఐఐటీ, జెఇఇ పరీక్ష ప్రిపరేషన్ స్ట్రాటెజీ, గైడెన్స్, మెంటార్షిప్ ఆన్ లైన్ సెషన్స్ నిర్వహిస్తున్నట్టు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ అశోక్ పరికిపండ్ల, ఎన్.ఎఫ్.హెచ్.సీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడావత్ మోహన్ ,తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఫౌండేషన్ వాట్సప్ నెంబర్ 78927 82387 లేదా ఫోన్ నెంబర్ 99893 10141లో సంప్రదించాలని వారు సూచించారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సహకరించి తమ సేవలను ఎక్కువ మంది విద్యార్థులు ఉపయోగించుకునేలా సహకరించాలని వారు కోరారు.

కల్వకుర్తి ఎమ్మెల్యే కారును ఢీకొట్టిన బైక్

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- ఎమ్మెల్యేకు స్వల్ప గాయాలు
- తలకొండపల్లి మండలంలో ప్రచారం ముగించుకుని వెళ్తుండగా ఘటన





నవతెలంగాణ-తలకొండపల్లి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కారును బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎమ్మెల్యేకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుగు ప్రయాణంలో వెల్జాల్ గ్రామ శివారులో గల రామసిపల్లి మైసమ్మ దేవాలయ సమీపంలో మిడ్జిల్ రహదారిపై ఎమ్మెల్యే కారును ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది.

ఈ ఘటనలో పబ్బతి నరేష్(25) అక్కడికక్కడే మృతిచెందాడు. భైరవపాక పరుశరాములు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే కారు ఎయిర్‌బెలూన్స్ ఓపెన్ కావడంతో ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వ్యక్తిని ఎమ్మెల్యే దగ్గరుండి కల్వకుర్తి ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స అందేలా వైద్యులతో మాట్లాడారు.


మంత్రాల నెపంతో వృద్ధురాలి దారుణహత్య



నవతెలంగాణ-కోదాడరూరల్

మంత్రాలు చేస్తుందనే అనుమానంతో వృద్ధురాలిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నడిగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని త్రిపురవరం గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. నడిగూడెం ఎస్ఐ జి.అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురవరం గ్రామానికి చెందిన కొమ్ము అలివేలమ్మ(70) పశువుల కాపరిగా పని చేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమెకు మంత్రాలు వస్తాయనే అనుమానంతో గ్రామానికి చెందిన హుస్సేన్ మరో వ్యక్తితో కలిసి అలివేలమ్మ మెడకు తాడును బిగించి హత్య చేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు రాంబాబు ఉపాధిహామీ చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, కోడలు రాధ గ్రామంలో అంగన్వాడీ టీచర్. మృతురాలి మనువడు సాయికృష్ణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా న్యాయ మూర్తుల పోస్టులకు ధరఖాస్తులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో తొమ్మిది జిల్లా న్యాయమూర్తుల పోస్టులకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 14న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. నోటిఫికేషన్ విడుదల తేదీ నుంచి జూన్ 13 వరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రెండవ జాతీయ న్యాయ వేతన కమిషన్ సిపారసు మేరకు ఈ పోస్టులను నేరుగా భర్తీ చేస్తున్నట్టు తెలిపారు. మరింత సమాచారం కోసం తెలంగాణ సచివాలయంలోని సీఎస్ ఛాంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) నిర్వహణకు సర్వంసిద్ధమైంది. అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం నుంచి ఈనెల 11 వరకు ఎప్‌సెట్ రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతాయి. మంగళ, బుధవారాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, తొమ్మిది నుంచి 11 వరకు ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను నిర్వహిస్తారు. ఇంజినీరింగ్‌కు 2,54,543 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,00,260 మంది కలిపి మొత్తం 3,54,803 మంది అభ్యర్థులు రికార్డు స్థాయిలో దరఖాస్తు చేశారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 135, ఇంజినీరింగ్ విభాగానికి 166 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మొదటిసారిగా అభ్యర్థులకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రతిరోజూ రెండు విడతల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రాతపరీక్షలను నిర్వహిస్తారు. ఉదయం 7.30 నుంచి, మధ్యాహ్నం 1.30 నుంచి అంటే పరీక్షా ప్రారంభానికి 90 నిమిషాల ముందు నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉండబోదు. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. బయోమెట్రిక్ విధానం అమల్లో ఉన్నందున అభ్యర్థులు మెహందీ (గోరింటాకు), టాటూలు వేసుకురావొద్దని కోరారు. బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ను, హాల్‌టికెట్, దరఖాస్తు ఫారం, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులైతే కుల ధ్రువీకరణ పత్రం వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రాల్లోకి వాటర్ బాటిళ్లు తెచ్చుకోవద్దని అధికారులు సూచించారు. మ్యాథమెటికల్, లాగ్ టేబుళ్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, చేతిగడియారం, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండదు.

నేటినుంచి ఎప్‌సెట్ రాతపరీక్షలు

- మొదటిరోజు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం
- 9 నుంచి 11 వరకు ఇంజినీరింగ్ విభాగం
- తొలిసారిగా ఫేషియల్ రికగ్నిషన్ హాజరు అమలు
- 3,54,803 మంది అభ్యర్థుల దరఖాస్తు



50 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి

పీఆర్సీ చైర్మెన్‌కు జీజేఎల్‌ఏ ప్రతిపాదనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులకు 50 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం (జీజేఎల్‌ఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు పీఆర్సీ చైర్మెన్ శివశంకర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం హైదరాబాద్‌లో కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. కనీస వేతనం రూ.35 వేలుండాలని కోరారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతన సవరణ చేయాలని సూచించారు. రాష్ట్రంలో పెరిగిన తలసరి ఆదాయం, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ నిధులకు తోడు, భారీగా రుణాలు సేకరించి ఖర్చు చేయడం ద్వారా ద్రవ్య సరఫరా పెరిగి సగటు జీవన వ్యయం (వినియోగ వ్యయం) మిగతా రాష్ట్రాల కంటే పెద్ద ఎత్తున పెరిగిందని వివరించారు.

తద్వారా జీతభత్యాలపై ఆధారపడే వేతన జీవుల జీవన ప్రమాణాలపైన తీవ్ర ప్రభావం పడిందనీ, దీన్ని ఆధారంగా చేసుకుని వేతన సవరణ చేపట్టాలని కోరారు. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం 5/10/15/20/25గా ఉండాలని సూచించారు. హెచ్‌ఆర్‌ఏ గ్రామాల్లో 15 శాతం, మున్సిపాల్టీల్లో 18 శాతం, జిల్లా కేంద్రాల్లో 20 శాతం, జీహెచ్‌ఎంసీలో 27 శాతం ఉండాలని తెలిపారు. గ్రాట్యుటీ రూ.25 లక్షలుండాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్‌ను నియమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్యా జేఏసీ నాయకులు కృష్ణ కుమార్, కేఎస్ రామారావు, రవీందర్‌రెడ్డి, రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో కూతురి ఆత్మహత్యాయత్నం

- ఆందోళనతో తండ్రి..మృతి, తండ్రి కూతురి పరిస్థితి విషమం





నవతెలంగాణ-నడికూడ

ఇంటర్ పరీక్షల్లో ఒక సబ్జెక్టు తప్పిన కుమార్తెను తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగింది. తీవ్ర ఆందోళనకు గురైన తండ్రి కూడా పురుగుల మందు తాగాడు. దీంతో తండ్రి మృతిచెందాడు. కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన హనుమకొండ జిల్లా నడికుడ మండలంలోని రామకృష్ణాపురం సోమవారం జరిగింది. దామెర ఎస్ఐ కొంక అశోక్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నడికుడ మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన గాజ కుమారస్వామి(45)కి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె శ్రీవిద్య(19) ఇంటర్ చదివింది. గతేడాది ఇంటర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ కావడంతో తిరిగి పరీక్ష రాసింది. అయినా ఉత్తీర్ణత సాధించకపోవడంతో తండ్రి ఆదివారం ఉదయం శ్రీవిద్యను మందలించాడు. మనస్తాపానికి గురైన ఆమె సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు పరకాల లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన కుమారస్వామి కూడా కంఠాత్మకూర్‌లోని తన వ్యవసాయ పొలం సమీపం లో సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన సమీప రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతని భార్య రమ దామెర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫోర్జరీ అని రుజువైతే శిక్షకు సిద్ధం

ప్రజలను తప్పుదోవ పట్టించిన సీఎం

బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి క్రిశాంక్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తన లెటర్ పోర్జరీ అని రుజువైతే ఏ శిక్షకైనా సిద్ధమని బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి క్రిశాంక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరెస్టు సందర్భంగా మద్దతు తెలిపిన నాయకత్వానికి, బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్లకు కృతజ్ఞతలు తెలిపారు. తన పోరాటం కొనసాగుతుందని తెలిపారు. తాను సోషల్ మీడియాలో ఒరిజినల్ సర్క్యులర్‌నే పోస్టు చేశానని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నకిలీ లెటర్‌ను పోస్టు చేసి రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు.

ఇబ్బందులు పడుతున్నాం..

రెండు నెలలుగా నిలిచిన వేతనాలు

ఆందోళనలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు

మా మొర ప్రభుత్వం ఆలకించదా..?



నవతెలంగాణ బ్యూరో- గూడూరు / హైదరాబాద్

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు వేతనాల కోసం రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నెల మొదట్లోనే వేతనాలు అందించకపోవడంతో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ఆందోళన చెందుతున్నారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఐసీడీఎస్ ప్రాజెకుల పరిధిలో 65 వేల మంది అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పని చేస్తున్నారు.మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. దీనిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కలిపి సుమారు 2500 మంది ఉన్నారు. ప్రభుత్వాలు చేపట్టే ప్రతి సర్వేలోనూ అంగన్వాడీ టీచర్ల పాత్ర కీలకం. పనిభారం పెరుగుతున్నప్పటికీ సమయానికి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ వారికి భారంగా మారింది. వారు అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదన్న విమర్శ ఉంది. ప్రతి నెలా 14వ తేదీన రావాల్సిన వేతనాలు 2 నెలలు దాటినప్పటికీ ప్రభుత్వం అందించకపోవడంతో సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 2న హైదరాబాద్‌లో ఐసీడీఎస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, డైరెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. వేతనాలు వెంటనే అందచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మెయిల్ ద్వారా కోరారు. మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించిన వేతనాలు అందజేయాలని కోరారు. మా మొర ఆలకించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వేతనాలను తక్షణమే అందించాలి
సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.విజయలక్ష్మి

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లకు, హెల్పర్లకు రెండు నెలల వేతనాలను తక్షణమే ప్రభుత్వం అందచేయాలి. వారికి పీఎఫ్, ఈఎస్ఐ కూడా వర్తింపజేయాలి. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తాం.



ఇబ్బందులు పడుతున్నాం..
సరస్వతి, అంగన్వాడీ టీచర్, చింతగూడెం

సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులకు గురవుతున్నాం. తక్షణమే ప్రభుత్వం రెండు నెలల వేతనాలు అందించి ఆదుకోవాలి. కుటుంబ పోషణ భారంగా మారింది. ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న మాకు సమయానికి వేతనాలు ఇచ్చి అండగా నిలవాలి.



వేతనాల కోసం ఎదురుచూస్తున్నాం
పి.తిరుపతమ్మ, పాతమచర్ల, గూడూరు

వేతనాలు ఎప్పుడు వస్తాయో అని ఎదురు చూడవలసిన పరిస్థితి నెలకొంది. చాలీచాలని వేతనాలతో సమస్యలతో సతమతమవుతున్నాం. కొద్దిపాటి జీతమైనా నిత్యం సేవలందిస్తున్నాం. నిలిచిపోయిన రెండు నెలల వేతనాలు వేసి ప్రభుత్వం ఆదుకోవాలి. అంగన్వాడి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి.

అంగన్‌వాడీల వేతన బకాయిలు చెల్లించాలి : సీఎంకు తమ్మినేని లేఖ

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు 2024 మార్చి, ఏప్రిల్ వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎంకు ఒక లేఖ రాశారు. రాష్ట్రంలో 48 ఏండ్లుగా 65వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఐసీడీఎస్ ద్వారా సేవలందిస్తున్నారని తెలిపారు. వీరంతా బడుగు, బలహీనవర్గాలకు చెందిన మహిళలేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి నెలా 14వ తేదీన వేతనాలు చెల్లించిందనీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెల్ల నుంచి వేతనాలు చెల్లించలేదని తెలిపారు. దీంతో అంగన్‌వాడీలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కుటుంబ అవసరాల కోసం అధిక వడ్డీలకు అప్పులు చేసే స్థితికి నెట్టబడుతున్నారని గుర్తుచేశారు. అందువల్ల వారికి ప్రభుత్వం బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు లేవని తెలిపారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల వల్ల ఒక కుటుంబం బతకాలంటే కనీసం రూ.26వేలు అవసరమవుతాయని గుర్తు చేశారు. కానీ అంగన్‌వాడీ టీచర్లకు రూ.13,650లు, హెల్పర్లకు రూ.7,800లు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. దీనిపై గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ వేతనాలను కూడా సకాలంలో చెల్లించకపోవడం సరైందికాదని పేర్కొన్నారు.



ఏపీ కొత్త డీజీపీ గా హరీశ్ కుమార్ గుప్తా

అమరావతి : ఏపీ నూతన డీజీపీ గా హరీశ్ కుమార్ గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల సంఘం సోమవారం మధ్యాహ్నం ఆదేశాలు జారీ చేసింది. ఏపీ సీఎస్ జవహర్ రెడ్డికి ఈసీ సమాచారం అందించింది. సాయంత్రం 5 గంటల్లోపు తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించింది. వరుస ఫిర్యాదులతో డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిపై ఈసీ బదిలీ వేటు వేసిన విషయం విదితమే. కొత్త డీజీపీ కోసం ముగ్గురి పేర్లు పంపించాలని ఆదివారం ఎన్నికల సంఘం ఏపీ సీఎస్ ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ముగ్గురి పేర్లతో కూడిన ప్యానల్ ను రాష్ట్ర ప్రభుత్వం ఈసీకి పంపించింది. సీనియార్టీ జాబితాలో ఉన్న ఐపీఎస్ అధికారులు ద్వారకా తిరుమలరావు, మాదిరెడ్డి ప్రతాప్, హరీశ్ కుమార్ గుప్తా పేర్లను కొత్త పోలీస్ బాస్ పోస్ట్ కోసం సిఫారసు చేసింది.



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్ ఆధ్వర్యంలో జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీ నుండి సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గాంధీనగర్ చౌరస్తాలో జరిగే బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోకు భారీగా తరలి వెళ్ళిన గులాబీ దండు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.



చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు కోసం ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి..జ్ఞానేశ్వర్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొడుగు శ్రీనివాస్, ముచ్చింతల జగన్, రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి

బీజేపీకి పతనం తప్పదు



- సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రమోహన్

నవతెలంగాణ - చైతన్యపురి

రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీకి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పతనం తప్పదు అని రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రమోహన్ అన్నారు. సోమవారం చైతన్యపురిలోని బోడిపూడి వెంకటేశ్వరరావు స్మారక కేంద్రంలో నిర్వహించిన సీపీఐ(ఎం) పార్టీ సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్. వెంకన్న అధ్యక్షతన కొత్తపేట, చైతన్యపురి, గడ్డి అన్నారం కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలపై దాడులు చేస్తుందని ఆరోపించారు. పౌర హక్కులను, ప్రజాస్వామ్యాన్ని లేకుండా చేస్తున్న బీజేపీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ముఖ్యంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాల్లో ఐడీపీఎల్, హెచ్‌సిఎల్, ఈసీఐఎల్‌తో పాటు మరికొన్ని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. వామపక్షాల బలం తగ్గడంతో ప్రజా వ్యతిరేక చట్టాలను చేస్తున్నారని అన్నారు. వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మల్కాజ్గిరి పార్లమెంటు అభ్యర్థిని పట్నం సునీతా మహేందర్ రెడ్డికి ఓటు వేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశానికి సీపీఐ(ఎం) పార్టీ సరూర్నగర్ సర్కిల్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం వీరయ్య, గంధం మనోహర్, ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి కే ఎల్లయ్య,, సరూర్నగర్ సర్కిల్ కమిటీ సభ్యులు కే రాములు, ఎం కృష్ణ, సి. మల్లేష్, క్షవరం వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మల్లేష్, యాదమ్మ, పార్టీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



- చైర్మెన్ సోమ సురేష్

నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురంలోని అష్టలక్ష్మి దేవాలయం 28వ బ్రహోత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అష్టలక్ష్మి దేవాలయ చైర్మన్ సోమ సురేష్ అన్నారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేది నుండి 15 తేదీ వరకు బ్రహోత్సవాలను అంగరంగ వైభవంగా, తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే విధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం దాదాపు ఈ సమయంలో లక్ష మంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారని, ఈ బ్రహ్మోత్సవాలకు లక్షకు పైగా భక్తులు వస్తారని అంచనా వేసినట్లు తెలిపారు. సౌకర్యాల విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నామని, అన్న ప్రసాదం, తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దాదాపు 350 మంది వాలంటీర్లు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. 10న గరుడ ప్రసాదం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, వైస్ చైర్మన్ నాగమల శ్రవణ్ కుమార్, మాజీ చైర్మన్ మేడం సుధాకర్ గుప్త, బ్రహ్మోత్సవం కన్వీనర్ బొగరపు రవీందర్, కమిటీ సభ్యులు చిలుక ఉపేందర్ రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, గౌరిశెట్టి అరుణ్ కుమార్ తదితరలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి కార్పొరేటర్ బాలమణి



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ బైగళ్ల బాలమణి, కొడుకు బైగళ్ల ఓం ప్రకాష్ తన అనుచరులతో కలిసి మాజీ ఎంపీటీసీ బొబ్బిలి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే టీకేఆర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని హస్తం గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ మాజీ జడ్పీటీసీ జిల్లెల నరేందర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు సిద్దాల దశరథ, సందీప్ రెడ్డి, రాహుల్, ఉదయ్, సాయి, శంకర్ నవీన్, లావణ్య, కలమ్మ, ఎల్లమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ- నాగోల్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎల్బీనగర్ నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి. పరశురాం ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో ఎస్ఐ టి. శ్రీనివాస్ 50 మంది ఇతర పోలీస్ కానిస్టేబుల్స్, కర్ణాటక పోలీసుల బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగోలు డివిజన్లోని వెంకటరమణ కాలనీ, శుభం కన్వెన్షన్ హాల్, జైపూర్ కాలనీ, బండ్లగూడ, ఆనంద్ నగర్, సుప్రజ ఆసుపత్రిలతో పాటు కీలక ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్టు తెలిపారు. ఈ నెల 13న జరగబోయే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఫ్లాగ్ మార్చ్ నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భద్రతా చర్యలను బలోపేతం చేయడం, ప్రశాంతమైన ఎన్నికల ప్రక్రియను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.

బీఆర్ఎస్

అవినీతి, అక్రమాలతో నష్టపోయిన తెలంగాణ

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఆర్ఎస్ అవినీతి, అక్రమాల వలన తెలంగాణ ఎంతో నష్టపోయిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం దోమల్‌గూడలోని టీడీపీ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో పార్లమెంటు విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సికింద్రాబాద్ పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు పి.సాయి బాబా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్, బీజేపీ మాజీ శాసన సభ్యులు చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ మాట్లాడుతూ బీజేపీతో బంధం ఈరోజు కాదని, గతంలో రెండు పార్టీలు ఎంతో సమన్వయంతో పనిచేశాయని గుర్తు చేశారు. పటేల్ పట్వారి వ్యవస్థను రూపుమాపిన తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.టి.ఆర్. చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. బీఆర్ఎస్ అవినీతి, అక్రమాల వల్ల తెలంగాణ ఎంతో నష్టపోయిందన్నారు. కేసీఆర్ కూతురు లక్షల కోట్ల అవినీతి చేసి నేడు జైల్లో ఉందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఏపీ భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్లమెంటు ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పీ.బాలరాజ్ గౌడ్, ఇంచార్జిలు శ్రీనివాస్ నాయుడు, వల్లారపు శ్రీనివాస్, రాష్ట్ర బీసీ అధ్యక్షులు శ్రీపతి సతీష్, అశోక్, ఎంకె.బోసు, కట్ట రాములు, శ్యామ్ సుందర్, పుప్పాల బాలకృష్ణ, ప్రదీప్ గౌడ్, ఎస్.ప్రకాష్, బాను, కిరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - సిటీబ్యూరో

జడ్జెస్ కాలనీ శ్రీ సాయి బాలాజీ అండ్ మెడికల్స్ సతీష్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మన్సూరాబాద్ డివిజన్ వాసవి క్లబ్ అధ్యక్షులు మొరిసేట్టి సంతోష్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు, కాలనీ అధ్యక్షుడు అంజయ్య గౌడ్, బాలయ్య పాల్గొన్నారు.

కాసాని విజయం ఖాయం

కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి

నవతెలంగాణ- బడంగ్ పేట్



ఈ పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం సాధించడం ఖాయమని కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆదేశం మేరకు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడ 4వ డివిజన్‌లోని కేఆర్‌ఆర్ హిల్స్, సౌభాగ్య కాలనీ, శేషాద్రి నగర్ కాలనీలో సంరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ గౌడ్, మహేందర్ రావు, అంజలరావు, శేఖర్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, రాజు, భాస్కర్, శ్రీశైలం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ నగర్‌లో

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో రంగారెడ్డి జిల్లా సీనియర్ మైనార్టీ నాయకుడు ఎస్కే మహమ్మద్ ఆధ్వర్యంలో టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకూ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను అమలు చేశామని, ఆగస్టులోపు 2 లక్షల రుణమాఫీ కూడా అమలు చేసి తీరుతామని తెలిపారు. ఈ ప్రచారంలో ఎండి గౌస్, ఎండి రఫీ, హైమాధ్, జావణుద్దిన్, షోహేబ్ అక్తర్, వెంకటేష్ నేత తదితరులు పాల్గొన్నారు.



కర్మాన్‌ఘాట్‌లో

ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ - ఎల్బీనగర్

కర్మాన్‌ఘాట్‌లోని వేడుక కన్వెన్షన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ఎల్బీనగర్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం నిధులతో కూడిన ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులను ఏకం చేసి సంపూర్ణంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తున్నట్లు తెలిపారు. మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ పదేండ్ల నుంచి కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్యవైశ్యులను మోసం చేసిందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పలుమార్లు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారని కొనియాడారు.

ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఆర్యవైశ్యులు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. ఈ సమ్మేళనంలో ఆర్య సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వెంకటేశం, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, కర్మాన్ ఘాట్ హనుమాన్ దేవాలయం చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు పన్యాల జైపాల్ రెడ్డి, మెరుగు రమేష్ రెడ్డి, కిరణ్ కుమార్, రమాకాంత్, కొత్త రవి కుమార్, ఉప్పల శ్రీను, వెంకటేష్, ఆలంపల్లి శ్రీనివాస్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

'జిజ్ఞాస' రాష్ట్ర స్థాయి కోఆర్డినేటర్‌గా చింతల



నవతెలంగాణ - హయత్ నగర్

అత్యుత్తమ సేవలకు గాను ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, జాతీయ సేవా పథకం రంగారెడ్డి జిల్లా నోడల్ అధికారి డాక్టర్ చింతల రాకేశ్ భవానిని 'జిజ్ఞాస' 2023-24 సంవత్సరానికి రాష్ట్ర స్థాయి కోఆర్డినేటర్‌గా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాకేశ్ భవాని మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పరిశోధనను ప్రోత్సహించే చక్కని కార్యక్రమం జిజ్ఞాసకు రాష్ట్రస్థాయి సమన్వయకర్తగా పని చేయడం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. ఈ అవకాశం కల్పించినందుకు కళాశాల విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశంకు, సీసీఈ అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం రాకేశ్ భవానిని కళాశాల ప్రిన్సిపాల్ డా.జ్యోత్స్న ప్రభ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, న్యాక్ కో ఆర్డినేటర్ డా.ఫారూకీ, డా.సుబ్రహ్మణ్యం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. రాజ్ భవన్‌లోని సంస్కృతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు ప్రొ.యాదగిరి, ప్రొ. రాజేంద్ర సింగ్, రూసా ప్రాజెక్ట్ ఆఫీసర్ సౌందర్య జోసఫ్, అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ ప్రొ. బాల భాస్కర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మస్న రవి కుమార్

నవతెలంగాణ - బడంగ్‌పేట్

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మస్న రవి కుమార్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు 18వ వార్డులో బూత్ నెంబర్ 314, 19వ వార్డు, బూత్ నెంబర్ 315లో మస్న రవి కుమార్ ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ జీ.రంజిత్ రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి, రంజిత్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి నరసింహ, అవారి రమేష్, పున్న బిక్షపతి, మేకప్ నరేందర్, జి.రమణి, బి. సుజాత తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ

8

మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

మంగళవారం | మే 07, 2024 | www.navatelangana.com

పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని కలిసిన.. ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.గౌస్



నవతెలంగాణ-ఉప్పల్

ఇండియా కూటమి కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిని ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ. గౌస్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మైనార్టీల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. మతోన్మాద బీజేపీని ఓడించాలని, మతసామరస్యాన్ని కాపాడే కాంగ్రెస్‌కు ఓటేయాలని మైనార్టీలకు సూచించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఇండియా కూటమి అభ్యర్థి పట్నం సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు.

అభివృద్ధి పథంలో అమెరికన్ బ్రూ క్రాఫ్ట్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో

అసాధారణమైన బ్రూలకు ప్రసిద్ధి చెందిన ప్రముఖ బ్రూయింగ్ కంపెనీ అమెరికన్ బ్రూ క్రాఫ్ట్స్ ప్రయివేటు, భారతదేశంలోని ఒడిశాలో ఉన్న డెంజాంగ్ బ్రూవరీని ఇటీవల కొనుగోలు చేసినట్టు వెల్లడించింది. ఏబీసీఎల్ ఈ బ్రూవరీ కొనుగోలు, పునరుద్ధరణ కోసం రూ.80 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టాలని భావిస్తోంది. ఈ సందర్భంగా అమెరికన్ బ్రూ క్రాఫ్ట్స్ ప్రయివేటు లిమిటెడ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగేంద్ర తాయి మాట్లాడుతూ "అమెరికన్ బ్రూ క్రాఫ్ట్స్ కుటుంబంలో డెంజాంగ్ బ్రూవరీని చేర్చడం ద్వారా మా కార్యకలాపాలను విస్తరించటం పట్ల సంతోషంగా వున్నాం. ఈ కొనుగోలు మా ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడానికి, ఈ ప్రాంతం అంతటా వినియోగదారుల నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంలో మాకు సహాయపడుతుంది. దేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో మా పరిధిని విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది" అని తెలిపారు.

దాడులు, ఊచకోతలకు మోడీ గ్యారెంటీ



- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. తిరుమలై రామన్

నవతెలంగాణ-ఉప్పల్ -కాప్రా

దేశంలో దాడులు, ఊచకోతలకు మోడీ గ్యారంటీ అని, ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేసే ఇండియా కూటమి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. తిరుమలై రామన్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా హబ్సిగూడ, హెచ్ఎంటీ ప్రాంతాల్లో ఓటర్లకు కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ నేతలు అన్నింటికీ మోడీయే గ్యారంటీ అని ప్రచారం చేస్తున్నారని, మోడీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు 2వేల మంది ముస్లింలను ఊచకోత కోసిన మాదిరిగా నేడు మళ్లీ దాడులు చేయడానికి మోడీ గ్యారంటీగా భావించాలా అని ప్రశ్నించారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నది బీజేపీ అని, మతానికి ఓట్లు రాలవని ప్రజలు నిరూపించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. 2014, 2019 ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశాన్ని అంధకారంలోకి నెట్టిందన్నారు. మూడోసారి గెలిస్తే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతులుండవని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని తెలిపారు. ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ఢిల్లీ, జార్ఖండ్ సీఎంలు కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌లను జైల్లో పెట్టారని విమర్శించారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డిని జైలుకు పంపే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరైనా తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపుతూ ఓట్లు అడుగుతారని, మోడీ మాత్రం మతం పేరుతో ఓట్ల ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. మతాన్ని రాజకీయ అస్త్రంగా ఉపయోగిస్తున్నాడని విమర్శించారు. ఇండియా కూటమిలోని ఉన్న రాజకీయ పార్టీల నేతలపై దాడులు చేస్తున్నారని, ఇది నీచ రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. మోడీ పాలనలో నిరుద్యోగం, అసమానతలు, మణిపూర్ ఘటనలు, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ భారం, వ్యవసాయ నల్లచట్టాలు, కార్మికుల శ్రమదోపిడీ, కార్పొరేట్లకు రాయితీ, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణతో పేదల నడ్డి విరిచారని తెలిపారు. మతాన్ని అడ్డం పెట్టుకుని విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. మసీదులు, చర్చిలు, ఆలయాలు పేరుతో ఓట్లు అడగకూడదని ఎన్నికల నియమావళిలో ఉన్నా వాటిని ఉల్లంఘించి అయోధ్యలో రాముడికి గుడి కట్టిన వారికే ఓట్లు వేయాలని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఇంతకాలం ఆధిపత్య హిందుత్వ కార్యాచరణను చాపకింద నీరులా తీసుకెళ్లిన కాషాయ నేతలు నేడు బహిరంగంగానే మతపరమైన ఎజెండాతో ముందుకు సాగుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు దుర్గా ప్రసాద్,మహేష్, భరత్, కీర్తన్, భారతి, నిర్మల, రమ్య, సుకన్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌ను గెలిపించండి



- మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్
- కాంగ్రెస్‌లో 100 మంది చేరిక

నవతెలంగాణ-కీసర

మల్కాజిగిరి పార్లమెంట్ అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. నాగారం మున్సిపాలిటీ ,రాంపల్లి గ్రామంలోని 100 మంది బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి వజ్రేష్ యాదవ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ నియోజకవర్గంలో రోజు రోజుకూ కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతుందని, మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పంబల్ల సరితా రమేష్, నాగారం మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల కుమార్, మాజీ సర్పంచ్ రాములు, నాయకులు శ్రీశైలం, మల్లేష్, ఓం ప్రకాష్ గౌడ్, మహిపాల్ రెడ్డి, విగ్నేష్, బలరాం, భూమయ్య, బాలరాజు, శ్రీధర్, బాల్ నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలి



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని జవహర్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. సోమవారం జవహర్ నగర్ పోలీస్‌ల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఎటువంటి భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికాకుండా ఓటేయాలన్నారు. ఓటర్లకు మనోధైర్యాన్ని నింపుటకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన సాయిబాబా నగర్, వంపు గూడ, ఎల్లారెడ్డి గూడ, యాప్రాల్, ఏరియా కింది బస్తీ, మహంకాళి ఆలయం బాపూజీ నగర్‌లలో సీఐ, ఎస్సైలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

జవహర్‌నగర్‌లో ఇద్దరు అదృశ్యం



నవతెలంగాణ-జవహర్‌నగర్

పింఛన్ కోసం వెళ్లిన ఓ వృద్ధుడు, ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఓ యువతి వెళ్లిపోయిన ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సాయిబాబా నగర్, దమ్మాయిగూడకు చెందిన బూస సునీల్ (62), గురువారం ఉదయం 11 గంటలకు పింఛన్ డబ్బు తీసుకోవడానికి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన చోట్ల, బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించకపో వడంతో సోమవారం అతడి భార్య బూస సుశీల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గతంలోను ఇంటి నుంచి వెళ్లి మూడు రోజుల తర్వాత తిరిగి వచ్చాడని తెలిపారు.

యువతి అదృశ్యం..



యల్లారెడ్డిగూడలో తన్నీరు శ్రీను, తన భార్య ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నారు. వివరాల్లోకి వెళితే తన్నీరు అఖిల(17) వృత్తి రీత్యా హౌస్ కీపింగ్‌గా పని చేస్తోంది. ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు అందరూ నిద్రకు ఉపక్రమించారు. సాయంత్రం నిద్ర లేచి చూసేసరికి అఖిల కనిపించడం లేదు. బంధువుల ఇంట్లో, స్నేహితుల ఇంట్లో ఆమె కోసం వెతికినా ఆచూకి లభించకపోవడంతో తన్నీరు శ్రీను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం



- పలు చోట్ల ఇంటింటి ప్రచారం
- కార్నర్ మీటింగ్ నిర్వహణ

నవతెలంగాణ-ఘట్కేసర్

కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి నేతృత్వంలో ఘట్కేసర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో కాచవాని సింగారం, ప్రతాప్ సింగారం గ్రామాల్లో సోమవారం డోర్ టూ డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరుణ్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి క్రాంతి గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షుడు శశాంత్ గౌడ్, ఘట్కేసర్ మండల అధ్యక్షుడు కర్ర రాజేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోడీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వలేక పోయారని తెలిపారు. విదేశాల్లోని నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని మోసం చేశారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి ఏర్పాటు చేసిన మ్యానిఫెస్టో అన్ని వర్గాలకు న్యాయం చేకూరుస్తుందని తెలిపారు. 1.నిరుపేదల మహిళలకు రూ.1లక్ష సాయం, కేంద్ర ప్రభుత్వ రిక్రూట్‌మెంట్‌లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు, ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్నం భోజన కార్మికులకు గౌరవ వేతనం ఇస్తుం దని ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ముత్యం, కాచవానిసింగారం గ్రామ శాఖ అధ్యక్షుడు మధు, మాజీ ఉపసర్పంచ్ కర్రె అశోక్, మాజీ అధ్యక్షుడు సిహెచ్ నవీన్, ఉపాధ్యక్షు డు రిషి గౌడ్, వి మహేష్ గౌడ్, చంద్రశేఖర్, మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షు డు అంబటి అజయ్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, మండల కార్యదర్శి వంశీ కృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ శివ, కాచవాని సింగారం యువజన అధ్య క్షుడు రాఘవచారి, ప్రతాప్ సింగారం యువజన అధ్యక్షుడు భాను ప్రసాద్, చౌదర్ గూడ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ధనరాజ్, వెంకటాపురం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి, సందీప్, అజయ్, సాయి, సతీష్, రాజేష్, కిషోర్, కార్తీక్, పవన్, రోహిత్ మనోజ్, శ్రీకాంత్, ప్రదీప్ తదితరులున్నారు.

కీసరలో..

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని దమ్మాయిగూడ మున్సిపల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు సామల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డులో విస్తృతంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జి మెరుగు సునీత, నాయకులు దుర్గం నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని వేదాద్రి నగర్, అయోధ్య నగర్, ఎల్ఎస్ఆర్ కాలనీ, ఇంద్రమ్మ కాలనీల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ. 500 గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మిగిలిన వాగ్దానాలను పార్లమెంట్ ఎన్నికల తర్వాత అమలు చేస్తామన్నారు. మెరుగు సునీత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కె.రమ్య, ఎం. దివ్య, మహేష్, రాములు, ఆర్. స్వాతి, సంతోషి, కె.గీత, ఎం. పావనీ, శ్రీదేవి, కావ్య, ఆర్. అరుణ, తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేట



పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా సోమవారం రాత్రి తూంకుంట మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ తో కలిసి రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో సునీత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలలో ఇప్పటికే ఐదు హామీలను అమలు చేశారని చెప్పారు. మిగతా హామీలను దశల వారీగా అమలు చేస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మెన్‌గా ఈ ప్రాంతానికి అనేక నిధులు కేటాయించి అభివృద్ధి చేశామని, మీరందరూ హస్తం గుర్తుకు ఓట్లు వేసి తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని ప్రజలను కోరారు. తనను గెలిపిస్తే మీకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నక్క ప్రభాకర్ గౌడ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాలేష్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ మధుసుదన్ రెడ్డి, టీపీసీసీకార్యదర్శి, జూబ్లీహిల్స్ కో ఆర్డినేటర్ మహిపాల్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు యాదగిరి, మురళీగౌడ్, మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి మురళీ గౌడ్, కోశాధికారి నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-అల్వాల్

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మల్కాజిరి నియోజకవర్గం పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, అందుకు కారు గుర్తుకు ఓటేయాని గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ దొంగ హామీలతో ప్రజలను ఎలా మోసం చేసిందో వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ గౌడ్, హనుమంత్, యాదగిరి గౌడ్, మహేష్, మధు, గిరి, రాజేందర్, లింగారెడ్డి, వీణ, సింధూ, లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో..

మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి కోరారు. సోమవారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని 14, 15వ డివిజన్లలో నాయకులు కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఆరు గ్యారంటీలు అనే అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి గత సర్కారు ఇచ్చిన సంక్షేమ పథకాలను తొలగించేందుకు యత్నిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నాయకులు కొత్త చక్రపాణి గౌడ్, 15వ డివిజన్ ఇన్‌చార్జి రవి ముదిరాజు, విష్ణు, నర్సింగ్ నాయక్, కాలూరి చందర్, రమేష్, జమాల్, శంకర్ లాల్, శ్రీనివాస్, చింటూ తదితరులున్నారు.



కాప్రాలో..



నాచారం డివిజన్‌లోని జరుగుతున్న బూత్ కమిటీ ప్రచారాలను గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేఖర్ సోమవారం పరిశీలించారు. నాచారంలో మొత్తం 45 బూతులకుగాను సుమారు 300 మంది కార్యకర్తలు గడపగడపకూ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఉప్పల్లో జరిగిన కేటీఆర్ రోడ్ షోతో కార్యకర్తల్లో మరింతగా ఉత్సాహం పెరిగిందని సాయి జెన్ శేఖర్ అన్నారు.

ముగిసిన లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

- స్వామి వారిని దర్శించుకున్న మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్

నవతెలంగాణ-కీసర

చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి షోడశ 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. స్వామి వారికి మహా పూర్ణాహుతి అనంతరం స్వామి వారి శతగటభిషేకానికి మహా కుంభాన్ని ఆలయ ఫౌండర్ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులకు అందజేశారు. పంచామృతాలు వివిధ రకాల జలాలతో స్వామివారికి శతఘటభిషేకం నిర్వహించారు. అనంతరం సుదర్శన పెరుమాళ్‌కి చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. నాలుగు రోజులుగా చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యం అన్నదాన కార్యక్రమం, కేర్ హాస్పిటల్ వారితో ఉచిత వైద్య శిబిరం, సోలిస్ హాస్పిటల్ వారితో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మల్లారపు లక్ష్మీనారాయణ ధన్యవాదాలు తెలిపారు.



స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

చీర్యాల లక్ష్మీ నృసింహ్మ స్వామి వారిని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, నక్క ప్రభాకర్ గౌడ్‌లు దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మెన్ స్వామి వారి ఆశీర్వచనాలు, మహా ప్రసాదాలను అందజేశారు.



కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు





- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ఓటర్ల సౌకర్యార్థం ఈ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ కలెక్టరేట్‌లో 24 గంటలూ పని చేస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల సౌకర్యార్థం ఏమైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2050కు ఫోన్ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. దీంతో పాటు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు డబ్బు తరలింపులు, ఇతర ప్రలోభాలకు గురి చేసినట్టు ఎవరైనా గుర్తిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందజేయాలనీ, అందుకు సంబంధించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

గుండ్లపోచంపల్లిలో .. కాలం చెల్లిన మద్యం విక్రయం



నవతెలంగాణ- మేడ్చల్

ఎండా కాలంలో భానుడి ప్రతాపాన్ని తట్టుకునేందుకు ప్రజలు పలు శీతల పానీయాలు సేవిస్తూ తమ దాహార్తి తీర్చుకుంటారు. కాగా మద్యం ప్రియులు విస్కీ తాగడం తగ్గించి బీర్లు అధికంగా తాగుతుంటారు. ఇదే అదునుగా భావించిన గుండ్లపోచంపల్లి తేజ వైన్స్ నిర్వాహకులు కాలం చెల్లిన బీర్లు అమ్ముతూ డబ్బులు దండుకుంటున్నారు. ధనార్జనే ధ్యేయంగా కాలం చెల్లిన, కల్తీ అయిన మద్యాన్ని విక్రయిస్తూ తమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. తమకు ఎక్సైజ్ శాఖ అధికారులే విక్రయించాలని చెబుతున్నారని చెప్పడం కొసమెరుపు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని నాణ్యమైన మద్యం విక్రయించాలని మద్యం ప్రియులు వేడుకుంటున్నారు.

రోడ్లపై ఇండ్లల్లోని వ్యర్థాలు..



- ఇబ్బందుల్లో ప్రజలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కంటోన్మెంట్ రీసలా బజార్ రోహిణి హెల్త్ కేర్ సమీపంలో చెత్త మురుగు నీరు ఏరులై పారుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకో వడం లేదు. రోడ్డు పక్కన బహిరంగ ప్రదేశాలు చిత్త వేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్న అధికారుల ఆదేశాలు అమలు కావడం లేదు. రోడ్లపై వ్యర్థాలు వేయడంతో రోడ్లన్నీ చెత్తకుప్పలుగా మారుతున్నాయని, దీంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ స్థలాల్లో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలి
-డాక్టర్ లయన్ శంకర్ రావు, స్థానికుడు



ఖాళీ స్థలాలలో మరిన్ని డస్‌బిన్‌లు ఏర్పాటు చేయాలి. ఇంటి ఇంటికీ చెత్త సేకరణను పటిష్టం చేయాలి. చెత్తను రోడ్లపై వేసే వారిపై జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రజల్లో ధైర్యం నింపేందుకే ఫ్లాగ్ మార్చ్



- కీసర సీఐ వెంకటయ్య

నవతెలంగాణ-కీసర

పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తుండటంతో ప్రజల్లో ధైర్యం నింపేందుకే పోలీసుల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటయ్య మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు ను వినియోగించుకోవాలన్నారు. దానికి పోలీసుల సహకా రం ఎల్లవేళలా ఉంటుందని భరోసా కల్పిస్తున్నా మన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కవాతు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప కల్యాణం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి గిర్మాపూర్‌లో సోమవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, డీసీసీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయి పేట శ్రీనివాస్ యాదవ్, కౌడే మహేష్, తుడుం గణేష్, నడికొప్పు నాగరాజు, దేవ, చాపరాజు, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, వేముల శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, రామస్వామి, శ్రవణ్ కుమార్, నాయకులు నందారెడ్డి, నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, ప్రేమ్‌దాస్, మల్లారెడ్డి, రాఘవ రెడ్డి ఉన్నారు.

'ఎన్నికల గుర్తుపై హైకోర్టులో వాదనాలు వినిపిస్తా..'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అనకాపల్లి పార్లమెంట్ నియోజక వర్గం నుంచి దళిత బహుజన పార్టీ (డీబీపీ) ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్‌కు కేటాయించిన ఎన్నికల గుర్తు గాజు గ్లాసును మార్చడం పట్ల ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) ఆదేశాలపై ఏపీ రాష్ట్ర హైకోర్టులో వేసిన రిట్ అప్పీల్ నేడు చీఫ్ జస్టిస్ బెంచీ ఎదుట విచారణకు వస్తున్నట్లు, అభ్యర్థి వడ్లమూరి కృష్ణ స్వరూప్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ ఎన్డీయే కూటమి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన సీఎం రమేష్ కు నరేంద్రమోడీ కేంద్ర సర్కార్ సహకారంతో కేంద్ర ఎన్నికల కమిషన్ పై ఒత్తిడి తీసుకొచ్చి దళిత బహుజన పార్టీ అభ్యర్థినైనా తనకు నష్టం చేకూరే చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై రాష్ట్ర హైకోర్టులో గట్టిగా వాదనలు వినిపిస్తామని ఆయన పేర్కొన్నారు.

మోడీ గుప్పిట్లో రాజ్యాంగ వ్యవస్థలు

- విశ్రాంత హైకోర్టు జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాజ్యాంగ వ్యవస్థలను ప్రధాని నరేంద్రమోడీ తన గుప్పిట్లో పెట్టుకుని తన స్వప్రయోజనాల కోసం ఉపయో గించుకుంటున్నారని విశ్రాంత హైకోర్టు జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్ విమర్శించారు.సమాజ్ వాది పార్టీ-ఇండియా అలయన్స్, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో "లోక్ సభ ఎన్నికలు-2024, రాజ్యాంగ పరిరక్షణ" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బి. చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశాధినేత ఆడనాన్ని అబద్ధాలను మన ప్రధాని మోడీ ఆడుతున్నారని, పచ్చి అబద్దాల కోరు మోడీ అని విమర్శించారు. హిందువుల ద్రోహి నరేంద్రమోడీ అని ఆయన ధ్వజ మెత్తారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి, ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు, నాగరాజు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం ఆపాలి

- శాంతిని నెలకొల్పి పాలస్తీనా ప్రజల హక్కులను రక్షించాలి
- విక్షణం సంపాదకులు వేణుగోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం ఆపాలని, శాంతిని నెలకొల్పి పాలస్తీనా ప్రజల హక్కులను రక్షించాలని విక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడి, అమెరికా యూనివర్సిటీల్లో విద్యార్థుల పోరాటం - పోలీసు నిర్బంధం' అనే అంశంపై సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకష్ణ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్. వేణుగోపాల్ హాజరై మాట్లాడుతూ పాలస్తీనాలోని జెరూసలేంకు మత పరంగా ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. మదీనా, మక్కా తరువాత ముస్లిం సమాజానికి అలాక్ మసీదు పవిత్రమై నమ్మకాల మీద ఆధారపడి ఇజ్రాయిల్ ఆవిర్భవించిందని, చరిత్ర మీద ఆధారపడి పాలస్తీనా ఏర్పడిందని తెలిపారు. యాసర్ అరాఫత్ కాలంలో కాంగ్రెస్ పాలనలో భారత్‌కు పాలస్తీనా మిత్ర దేశంగా ఉందని.. కానీ ప్రస్తుతం మోడీ మాత్రం ఇజ్రాయిల్‌కు మద్దతు పలుకుతున్నారన్నారు. రోజుకు 300 నుంచి 500 మంది పాలస్తీనాలో చనిపోతున్నారని తెలిపారు. పాలస్తీనాకు న్యాయం జరగాలని.. ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలని.. శాంతిని నెలకొల్పాలని డిమండ్ చేస్తూ కొలంబియా యూనివర్సిటీలో ప్రారంభమైన విద్యార్థుల ఉద్యమం ఇపుడు 120 దేశాలకు విస్తరించిందని తెలిపారు. సమస్య, అణిచివేత ఎక్కడ ఉంటే అక్కడ ప్రశ్నించే గొంతుకులు ప్రత్యక్షం కావాలని, ఆ చైతన్యంతో నేటి తరం విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పాలస్తీనా ప్రజల హక్కుల రక్షణకు జరిగే పోరాటానికి మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్ , సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.హనుమేష్, పీడీఎస్‌యూ జాతీయ నేత ఎస్ నాగేశ్వరరావు, పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పవ్వి, నరేందర్, అనిల్, రాష్ట్ర నాయకులు హరీష్, సీతారాం, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

- రాపిడో ద్వారా ఓటర్లకు ఉచిత బైక్-టాక్సీ రైడ్లు అందించడం అభినందనీయం : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. సోమవారం ఎల్బీ స్టేడియంలో రాపిడో ఓటర్లందరికీ ఉచిత బైక్ టాక్సీ రైడ్లు ర్యాలీ కార్యక్రమానికి ఆయన హైదరాబాద్ సీపీ కె.శ్రీనివాస్ రెడ్డి, డీఈవో, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ ఆర్వో, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు గత రెండు మూడు నెలలుగా ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపట్టార న్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. హైదరాబాద్‌లో 60 నుంచి 65 శాతం ఓటింగ్ జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు తాగునీరు,షేడ్స్, షామియా నా, ఫాన్స్, కూలర్స్, మెడికల్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ సీపీ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన ప్రజాస్వామ్య వ్యవస్థ భారత దేశంలో ఉందని ప్రజాస్వామ్యాన్ని బలో పేతం చేసేందుకు మే 13న జరుగు పోలింగ్‌లో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగం కోసం కదిలి రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాపిడో బిజినెస్ హెడ్ రోహిత్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు బీఆర్ఎస్ ప్రచారం..

నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేర్లింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కొరకు ఇంటింటి ప్రచారంలో భాగంగా స్థానిక శాసన సభ్యులు గాంధీ ఆదేశాలతో ఆల్విన్ కాలనీ ఫేస్2, ఆదిత్య నగర్, రాఘవేంద్ర కాలనీ, సాయినగర్ వెస్ట్, కాలనీలో ప్రచారంలో సంబంధిత కాలనీ అధ్యక్షులు, కృష్ణ రావు, కట్ట శ్రీను, రాజేష్ చంద్ర, కాశీనాథ్ యాదవ్, చిన్నోళ్ళ శ్రీను తదితరులతో కలిసి పాల్గొన్న డివిజన్ మాజీ అధ్యక్షులు జిల్లా గణేష్ నేత ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణకు సాధ్యం కాని హామీలతో, ప్రభుత్వం ఏర్పరిచినప్పటికీ, స్థానికంగా ప్రజల మనసును దోచుకోలేకపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే పార్లమెంటు ఎలక్షన్‌లో ప్రజలు గట్టి గుణపాఠం చెప్తారని, ఆల్విన్ కాలనీ డివిజన్‌లో కొంతమంది నాయకులు మభ్య పెట్టి, ప్రలోభాలకు గురిచేసి, కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం జరుగుతుందని కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు, కార్యకర్తలు బీఆర్ఎస్ విధేయులుగా ఉంటూ, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ ఇవ్వబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం



నవతెలంగాణ-ముషీరాబాద్

భారత రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువలైన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు తుమ్మ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూరేపల్లి రవికుమార్లు పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నోటుకు, మందుకు, బిర్యానీకి అమూల్యమైన ఓటును తాకట్టు పెట్టవద్దని కోరారు. రాజకీయ వ్యాపారులపై, దోపిడి దారులపై ఓటు తూటాలు పేలాలన్నారు. మీకు నచ్చిన వారికి మీ ఓటును వేసి మంచి నాయకుడిని ఎన్నుకునే సమయం ఆసన్నమైందని తెలిపారు. ప్రలోభాలకు లోను కాకుండా విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని మనం వేసే ఓటు ఐదేళ్ల పాలకు, దేశాభివృద్ధికి సంబంధించిన విషయమని తెలిపారు. దేశభక్తి కలిగి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలిగే వారిని మన దేశాన్ని ప్రపంచం ముందు ఉన్నతంగా నిలిపించే వారిని మాత్రమే గెలిపించాలని కోరారు. నిజమైన ప్రజాసేవకులనే గెలిపించాలని అందు కోసం ప్రతి ఒక్కరు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు బైరీ శ్రీనివాస్, జాతీయ నాయకులు చింతకింది జానయ్య తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులందరికీ పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జాతీయ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు మార్చి, ఏప్రిల్ వేతనాలు, 7 నెలలు పీఆర్సీ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ కన్నా ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గత రెండు నెలలుగా వేతనాలు విడుదల చేయలేదని ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నార న్నారు. తమ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల వేతనాలు విడుదల చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులం దరికీ ప్రతి నెల 5న వేతనాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాల న్నారు. ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ కూడా ప్రక్షాళన చేసి రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

ఇద్దరు చిన్నారులు మిస్సింగ్.. 12గంటలలో ఛేదించిన పోలీసులు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు చిన్నారులు తప్పిపోయారు. అబిడ్స్ పోలీసులు 12 గంటల్లోనే కేసును ఛేధించి చిన్నారులను కుటుంబ సభ్యులకు అప్ప గించారు. సోమవారం అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జి.రాజగోపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మురళీధర్‌బాగ్‌కు చెందిన శ్రీనివాస్ తన అక్క, బావ చనిపోవడంతో వారి ఇద్దరు పిల్లలు 10 ఏండ్ల చరణ్ కుమార్, 8 ఏండ్ల సి.వినయ్ కుమార్‌లను తన వద్దే ఉంచుకుంటున్నాడు. ఈనెల 5న పిల్లలు ఆడుకుంటామని బయటికి వెళ్లిన రాత్రి అయినప్పటికీ ఇంటికి రాలేదు. దాంతో అబిడ్స్ పోలీస్‌స్టే షన్‌లో పిల్లల మేనమామ శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే ఫిర్యాదు స్వీకరించి ఒక ప్రత్యేక టీమ్‌తో దర్యాప్తు చేపట్టి సీసీ ఫుటేజ్ ఆధారంగా పిల్లల ఆచూకిని 12గంటలలో ఛేధించారు. చిన్నపిల్లలు ఎంజీబీఎస్ బస్ స్టేషన్ వద్ద ఉండగా అక్కడ ఓ గుర్తు తెలియని ఆటోవాలా.. పిల్లలను ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించాడు. పిల్లలు వారి సొంత ఊరు అయిన గజ్వేల్‌కు వెళ్తామనడంతో ఆటోవాలా జేబీఎస్‌లో వదిలాడు. అక్కడ ఏడుస్తూ ఉన్న చిన్నారులను మారేడు పల్లి పోలీసులు గుర్తించి వెంటనే అబిడ్స్ పోలీస్‌లకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని చిన్నారులను అబిడ్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి పిల్లల మామకు అప్పగించారు. 12గంటలలో తమ పిల్లలను రక్షించి తమకు అప్పగించిన పోలీసులకు చిన్నారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా చిన్నపిల్లలు తాము చైల్డ్ హోమ్ కు వెళ్తామని చెప్పడంతో చైల్డ్ హోమ్ అధికారులకు సమాచారం అందించామని వారిని చైల్డ్ హోమ్‌కు తరలిస్తామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబిడ్స్ ఎస్ఐ గౌరేందర్ గౌడ్, ఏ ఎస్ఐ ఎండి హైమద్, ఉమెన్ పోలీసులు నర్మద, రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గౌడ అభ్యర్థులను గెలిపించండి

- గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయిలి వెంకన్న గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల పద్మారావు గౌడ్, భువనగిరి బీజేపీ పార్టీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ లను పార్టీలకతీతంగా బడుగు బలహీన వర్గాలు, దళిత బహుజన అంతా ఐక్యమై గెలిపించుకోవాలని గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయిలి వెంకన్న గౌడ్ సోమవారం పత్రిక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. అన్ని కులాలను ఐక్యం చేసి గోల్కొండ కోటను జయించి బడుగుల రాజ్యం స్థాపించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిగా తీసుకొని వీరిని గెలిపించుకోవాలని కోరారు. పద్మారావుగౌడ్ ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఎన్నో ఏళ్లుగా మూత బడిన కల్లు దుకాణాలను తెరిపించారు. చెట్ల పన్నును రద్దు చేశారు. నర్సయ్య గౌడ్ తెలంగాణ ఉద్యమంలో డాక్టర్స్ జేఏసీని ఏర్పాటు చేసి ఉద్యమించిన నాయకుడు వారు ప్రజల కోసం అనునిత్యం పరితపించే నాయకులని నిస్వార్థంగా అనునిత్యం ప్రజలతో మమేకమై పనిచేస్తున్నారని తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిం చారు. వీరిగెలుపు బడుగు బలహీన వర్గాలు,దళిత బహు జనలకు అవసరమని తెలిపారు.

పెట్టుబడి పేరుతో గాలం

- స్టాక్ మార్కెట్ చిట్కాలతో భారీ లాభాలంటూ బురడీ
- వందలకొలది బాధితులు, కోట్లల్లో వసూళ్లు
- నిందితులపై దేశవ్యాప్తంగా 507 కేసుల నమోదు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పెట్టుబడుల పేరుతో ఘరానా మోసాలకు పాల్పడు తున్న ఇద్దరు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ల్యాప్‌టాప్‌లు, సెల్ ఫోన్లు, సిమ్‌కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్‌లు, చెక్‌బుక్స్‌తోపాటు బ్యాంక్‌లోని కోట్లాది రూపాయలను సీజ్ చేశారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సీపీ కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ కవితతో కలిసి సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన భూరా రామ్, రామచంద్రలు ఒక ముఠాగా ఏర్పాడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలని విదేశాల్లో ఉన్న సైబర్ నేరస్తులతో చేతులు కలిపారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, సీఏలు, వ్యాపారులతోపాటు హై ప్రొఫైల్ ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో చేరుస్తూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని, ఉచితంగా టిప్స్ చెప్తామని, స్టాక్ ట్రేడింగ్ పేరుతో నమ్మిస్తున్నారు. గ్రూపుల్లో నకిలీ సభ్యులను చేర్చి వారికివారే లాభాలు పొందినట్టు ఆన్‌లైన్‌లో ఖాతాలను చూపిస్తూ బాధితులను మోసం చేస్తున్నారు. ఇదే తరహాలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి వాట్సాప్‌కు గత మార్చినెలలో ఓ మెసేజ్ చేసిన నిందితులు.. 'ఇంటర్నేషనల్ స్టాక్ ట్రేడింగ్ ఎకౌంట్' గ్రూప్‌లో చేర్పించారు. గత కొన్నేండ్లుగా బాధితుడు ట్రేడింగ్ చేయడంతో వచ్చిన మెసేజ్‌ను నిజమని నమ్మాడు. ఈ మేంకు బాధితుడు దశలవారీగా రూ.1,03,25,000 పెట్టుబడిగా పెట్టగా వివిధ బ్యాంక్ ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. తీరా మోసపోయినట్టు తెలుసుకున్న బాధితుడు హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుల నేరచరిత్ర చూసి ఆశ్చర్యపోయారు. పోలీసులకు చిక్కకుండా నిందితులు ఇమ్మిగ్రేషన్ స్క్రీనింగ్‌ను నివారించడానికి దుబాయ్‌కి వెళ్లి, నేపాల్ మీదుగా భారతదేశానికి తిరిగి వచ్చేవారు. ఇదే తరహాలో దుబాయ్ నుంచి నేపాల్ మీదుగా భారతదేశానికి తిరిగి వస్తుండగా నేపాల్ సరిహద్దులో సోనౌలీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతేడాది నిందితులు దేశవ్యాప్తంగా దాదాపు 627 మంది నుంచి రూ.3.9కోట్లు దోచుకున్నారు. ఈ ఏడాది రెండు నెలల్లో తెలంగాణలో 213 మంది బాధితుల నుంచి రూ.27.4కోట్లకుపైగా వసూళ్లు చేసిట్టు విచారణలో గుర్తించారు. దేశవ్యాప్తంగా నిందితులపై 507కేసులు నమోదుకాగా, హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లతోపాటు తెలంగాణలో 67 కేసులు నమోదయ్యాయి. ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు. గుర్తు తెలియని యాప్‌ల నుంచి వచ్చే లింక్‌లను క్లిక్ చేయొద్దన్నారు. వ్యక్తిగత ఖాతా వివరాలను ఎవరైనా అడిగితే అనుమానించాలని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరస్తుల చేతిలో మోసపోతే వెంటనే 1930 లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నోడల్ అధికారి ఆర్ రజనీకాంత్ అన్నారు. సోమవారం గోషామహల్ సర్కిల్-14లోనీ సిబిఎస్ బస్ స్టేషన్, గౌలిగూడ, గౌలిగూడ లేబర్ అడ్డ వద్ద ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటు ప్రాధాన్యతను తెలియజేసే సందేశాన్ని ఇంటింటికి వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. హెల్ప్ డెస్క్ ఓటరు జాబితాలో ఓటు, పోలింగ్‌స్టేషన్ వివరాలను ఎలా చెక్ చేసుకోవాలనే విషయాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు మే13 న పోలింగ్ ఓటు వేయడం మర్చిపోవద్దని చెప్పారు. నేను నా ఓటు కచ్చితంగా వేస్తాను అంటూ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. దేశ భవిత మనం వేసే ఓటుపై ఆధారపడి ఉందని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకుని తమకు నచ్చిన మంచి నాయకున్ని ఎన్నుకోవాలని అవగాహన కల్పిస్తున్నామన్నారు. మీ ఓటు మరోసారి ఓటర్ జాబితాలో చెక్ చేసుకోవాలని కోరారు. ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు ఉందన్న విషయం ఏవిధంగా తెలుసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఓటును మరోసారి చెక్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆర్ పి లు స్వాతి, నవనిత లు ఓటు ప్రాధాన్యత వివరిస్తూ, వారి ద్వారా ఇంట్లో ఉన్న ఓటర్ల ను చైతన్య పరుస్తున్నారు.ఈ సందర్భంగా ప్రజలకు ఓటు హక్కు వినియోగించు కోవాలని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి స్వాతి, నవనీత, ప్రజలు, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

'రోహిత్ వేముల బలవన్మరణానికి కారకులను శిక్షించాలి'

- విచారణ నిందితులను రక్షించడానికి చేశారే తప్ప శిక్షించడానికి కాదు
- కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రోహిత్ వేముల బలవన్మరణానికి కారకులైన వారిని శిక్షించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి డిమాండ్ చేసింది. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షులు గురు మిళ్ళ రాజు, ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు కె.వై.రత్నం, జి.విజయ్ తదితరులు మాట్లాడుతూ రోహిత్ వేముల 2016 జనవరి 17న బలవన్మరణానికి పాల్పడ్డారని, అందుకు దారి తీసిన కారణాలను వెలికి తీసి కారకులైన నిందితులను శిక్షించడానికి బదులుగా వారిని రక్షించడానికి ఆ నేరం నుండి తప్పించడానికి సైబరాబాద్ పోలీస్ అధికారులు నేర విచారణ రిపోర్టును తయారు చేసి 03 మే 2024న హైకోర్టుకు సమర్పించారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రోహిత్ వేముల కేసులో నేర విచారణ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లో పేర్కొన్న విధి విధానాల ప్రకారం కాకుండా నిందితులుగా ఉన్న వారిని కాపాడడానికి, కేంద్రంలో ఉన్న బీజేపీ గతంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు వారి మనోభిష్టాలను నెరవేర్చడానికి ఆ రిపోర్టు తయారు చేసినట్లు మనకు అర్థమవుతుందన్నారు. అది నేర విచారణ నివేదిక కాదని ఫక్తు రాజకీయ నివేదికని, ఎఫ్ఐఆర్ నంబర్.20/2016లో పేర్కొన్న రోహిత్ వేముల బలవన్మరణానికి కారకులైన నిందితులు వీసీ పొదిలే అప్పారావు, నందనం సుశీల్ కుమార్, బండారు దత్తాత్రేయ, స్మృతి ఇరానీ, ఎమ్మెల్సీ రామచంద్రరావు తదితరులను నేరం నుండి తప్పించడం, రక్షించడానికి రోహిత్ వేముల దళితుడు కాదని చెప్పడానికే మొత్తం నివేదికను తయారు చేయించారని వారు ఆరోపించారు. ఈ నేర విచారణ నివేదికపై నేడు అధికారంలో ఉన్న నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పునర్ విచారణ చేస్తామని డీజీపీ చేత ప్రకటించిందని, ఇప్పటికైనా రాజకీయాలకతీతంగా రోహిత్ వేముల మరణానికి కారకులైన నిందితులను శిక్షించేటట్లు నేర విచారణ చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ నాయకులు ప్రజ్వల్, గోపి స్వామి, దీపక్, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చైతన్య భారతి, ఉపాధ్యక్షులు సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

'మోడీ దుష్ట పాలనకు చమరగీతం పాడాలి'

- తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ
- ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ప్రచురించిన "అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీజేపీ" పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 10 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ దాని మిత్ర పక్షాల ఎన్డీయే కూటమిని చిత్తుగా ఓడించి, ఈ దేశానికి పట్టిన మోడీ దుష్ట పాలనకు చరమ గీతం పాడాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో-కన్వీనర్, ప్రముఖ విశ్లేషకులు కన్నెగంటి రవికుమార్ ప్రజలకు సూచించారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రచురించిన "అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీజేపీ" అనే పుస్తకాన్ని సోమవారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సభలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి రావటానికి మోడీ కుటుంబం లేని వ్యక్తి, స్వార్థం ఉండని నేత అని ప్రజలు కాంగ్రెస్‌పై విశ్వాసం కోల్పోయి బీజేపీకి అధికారం ఇస్తే గత 10 ఏండ్లుగా ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ దేశవ్యాప్తంగా అవినీతిపరులకు అండగా నిలబడ్డ పెద్ద అవి నీతిపరుడు మోడీ అని ఆయన దుయ్య బట్టారు.10 ఏళ్ల క్రితం ఏటా 2 కోట్ల ఉద్యోగాలు నిరుద్యోగులకు కల్పిస్తానని హామీ ఇచ్చి 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వలేని అసమర్ధుడని విమర్శించారు. అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను పార్లమెంటులో మందబలం ఉందని 29 చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లు తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు బడా వ్యాపారస్తులకు లాభాలు చేకూర్చేందుకు 47 కోట్ల మంది కార్మికుల హక్కులను కాలరాసిన కర్కోటకుడని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాలని ఆర్టీఐ క్రియాశీల కార్యకర్తలు అడిగిన వారిని 80 మందిని అతి దారుణంగా చంపి వేయబడ్డారని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, కార్యదర్శులు ఎస్.కరుణ కుమారి, బి.వెంకటేశం, హైదరాబాద్ నగర కార్యదర్శి కమతం యాదగిరి, సిపిఐ నగర సహాయ కార్యదర్శి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు తథ్యం

- కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం తథ్యమని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ పరిధిలోని దుర్గ నగర్, ఆజాద్‌నగర్, ప్రేమ్ నగర్, తదితర ప్రాంతాలలో బీఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటి పాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల సమస్య లపై అవగాహన లేదని వారు సమస్యలు పట్టించుకోరని అలాంటి వారికి ఓటు వేయొద్దని దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో అమలు అయ్యాయని, అంబర్‌పేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ఎంపీగా పద్మారావు గౌడ్‌ని గెలిపించాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకులు, మైనార్టీ నాయకులు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో భారీ మెజార్టీతో గెలిపించాలి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మల్కాజిగిరిలో భారీ మెజార్టీతో గెలిపించాలని చంద్రగిరి నగర్, జగద్గిరిగుట్ట బస్టాప్, భగత్ సింగ్ నగర్, పద్మ నగర్ రింగ్ రోడ్, సుభాష్ నగర్ లాస్ట్ బస్టాప్, సంజయ్ గాంధీ నగర్‌లలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి లతో కలిసి పాల్గొన్న సునీతా మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు కందాడి జోత్స్నా శివారెడ్డి, సొంఠి రెడ్డి పున్నారెడ్డి, మాజీ జెడ్పి వైస్ చైర్మెన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు దమ్మని శ్రవణ్ కుమార్, బండి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, ఓరుగంటి కృష్ణా గౌడ్, బొడ్డు వెంకటేశ్వర్ రావ్, గడ్డం రాజేందర్ రెడ్డి, దుర్గా రావ్, ఆర్.లక్ష్మి, పాల కృష్ణ, వెంకటేష్, బొబ్బ రంగారావు, గుంజ శ్రీనివాస్, సుబ్బారెడ్డి, లాయక్, సంజీవ రెడ్డి, తదితరులున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | మే 07, 2024 | www.navatelangana.com

స్పోర్ట్స్ క్విజ్ విజేతలకు బహుమతుల ప్రదానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్‌ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్-2024లో భాగంగా సోమవారం ఖైరతాబాద్ జోన్‌లో వివిధ క్రీడలకు సంబంధించిన స్పోర్ట్స్ క్విజ్ నిర్వహించారు. స్పోర్ట్స్ క్విజ్ లో ఖైరతాబాద్ జోన్‌లోని ఐదు సర్కిళ్లకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే: బాస్కెట్ బాల్ గేమ్‌లో హర్షిత్ లాభి, కనుష్క అగర్వాల్ ప్రథమ స్థానంలో నిలువగా, రిశ్నల్, లెహర్‌లు 3వ స్థానంలో నిలిచారు. క్రికెట్‌లో సూరజ్, ఆయుష్ లు ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు జీహెచ్‌ఎంసి స్పోర్ట్స్ డైరెక్టర్ ఆదిలక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గేమ్స్ ఇన్‌స్ట్రక్టర్ మాధవిలత, కోచ్‌లు, విద్యార్థులు, విజేతలు, తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట నియోజకవర్గం ఫీవర్ ఆస్పత్రి దగ్గర సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు షోలో పాల్గొన్న సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎ.ం.శ్రీనివాస్, నగర నాయకులు, దశరథ్ తదితరులు
నవతెలంగాణ-అంబర్‌పేట

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్‌లో మాజీ డిప్యూటీ మేయర్, ప్రస్తుత కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా పతనం అయి పోయిందని, కాంగ్రెస్ ప్రజా పాలన, ప్రజా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులై స్వచ్ఛందంగా నాయకులు, కార్యకర్తలు కాంగ్రె స్ పార్టీలో చేరుతున్నారని బాబా ఫసియుద్దీన్ తెలిపారు. పేద ప్రజలకు, మధ్య తరగతి వాళ్ళకి అందరికీ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వ ర్యంలో న్యాయం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వపు దొరల పాలన,దొరల విముక్తి నుంచి భారత రాష్ట్ర సమితి పార్టీ నుండి విముక్తి పొందిందన్నారు. ఈ ప్రజా ప్రభుత్వం అందరికీ సమ న్యాయం జరుగుతుందని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని తెలి పారు. బోరబండ రాజ్‌నగర్, పలు బస్తీలకు చెందిన మాజీ బస్తీ అధ్యక్షులు సీనియర్ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌లో భూపతిరెడ్డి, జస్వంత్‌రెడ్డి, సుధాకం రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ధర్మారెడ్డి వెంకట్ రెడ్డి, శంకర్ ముదిరాజ్, శ్రీనివాస్, సంజీవ, ఓంకార్, అనేక మంది యువకులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు.

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు క్రైస్తవ సంఘాల మద్దతు



- మేడే రాజీవ్‌సాగర్ ఆధ్వర్యంలో క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

నవతెలంగాణ-ఓయూ

క్రైస్తవ మైనారిటీల సంక్షేమానికి గత బీఆర్‌ఎస్ సర్కార్, వ్యక్తిగతంగా నిరంతరం శ్రమించామని సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్‌లోని ఎస్.పి.జీ. చర్చ్ పారిష్ హాల్‌లో సోమవారం సభాధ్యక్షులుగా వ్యవహరించిన తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆధ్వర్యంలో జరిగిన సికింద్రాబాద్ క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో పద్మారావుగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ చర్చిలు, క్రైస్తవుల స్మశాన వాటికల అభివృద్ధితో పాటు వారి సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. అలాగే రాబోయే కాలంలో వారి అభ్యున్నతికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. తనకు మద్దతుగా నిలిచి ఎంపీగా గెలిపిస్తే క్రిస్టియన్ల సమస్యలపై పార్ల మెంట్‌లో గొంతెత్తి ప్రశ్నిస్తానని, రాజకీయాలతో సంబంధం లేకుండా కేంద్రంలో ఎవరు ఉన్నసరే వారిపై ఒత్తిడి తెచ్చి క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. క్రైస్తవుల గొంతుకగా నిలిచే తనను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని ఈ సమ్మేళనానికి హాజరైన వారిని కోరారు. మేడే రాజీవ్ సాగర్ మాట్లాడుతూ బీఆంఎస్ అంటేనే సెక్యులర్ అనే దానికి పర్యాయపదంగా నిలుస్తుందన్నారు. గత బీఆర్‌ఎస్ సర్కార్, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి సెక్యులర్ విధానాలను పాటించి, మైనారిటీలకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఈ సమ్మేళనానికి విచ్చేసిన సీఎస్ఐ, ఫ్రీ మెథడిస్ట్, బాపిస్ట్, సాల్వేషన్ ఆర్మీ క్యాథలిక్ అసోసియేషన్, దళిత సంఘాల ప్రతినిధులు, సికింద్రాబాద్, ముషీరాబాద్ అసెంబ్లీ నియో జకవర్గాలకు చెందిన పాస్టర్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌నీ ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్లు లెనార్డ్, తినకరాన్, ఆనంద్ కుమార్, సుదర్శన్, జాకబ్, బిషప్ జాకబ్, గడ్డం సోలోమాన్, జాన్ రవీంద్ర, రాబర్ట్ సూర్య ప్రకాష్, సునీల్, డేవిడ్ రాజ్, ఆల్ ఇండియా క్యాథలిక్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఆండ్రూ క్లైవర్ పాల్గొన్నారు.

టీఎస్‌సెట్ ఎగ్జామ్ తేదీల్లో మార్పుచేసి ఫీజు తగ్గించాలని వినతి



వలిగొండ నరసింహ
నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ స్టూడెంట్స్ పొలి టికల్ జాక్ స్టేట్ ప్రెసిడెంట్, పొలి టికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ వలి గొండ నరసింహతో కూడిన విద్యార్థి బృందం టీఎస్ సెట్ సెక్రెటరీ మెం బర్ ప్రొ.నరేష్ రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. టీఎస్పీ ఎస్సీ ఇటీవల విడుదల చేసిన గ్రూ ప్ 1 ఫిలిమ్స్ జూన్‌లో, గ్రూప్ 2 ఆగస్టులో, గ్రూప్ 3 నవంబర్ తో సహ టెట్ ,డీఎస్సీ మే ,జూన్ ,ఆగస్టులో తో పాటు వివిధ ఎగ్జామ్స్ వరుసగా ఉన్న నేపథ్యంలో, వివిధ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న వారే సెట్ కూడా ప్రిపేర్ కావడం జరుగుతుంది. ఇప్పటికే గత సంవ త్సరం పేపర్ లీకేజీలు,వరుస ఎగ్జామ్స్ వాయి దాల వల్ల ఎంతో మనోవేదనకి గురై, ఆర్థికంగా కృంగిపో యిన నిరుద్యోగ విద్యా ర్థులు ఇప్పు డిప్పుడే కుదుటపడి ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతు న్నారు. మళ్లీ సెట్ ఎగ్జామ్ కూడా ఇప్పుడే పెట్ట డం వల్ల విద్యార్థి నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని, ఫీజుల భారం కూడా అధికంగా ఉంది తగ్గించాలని, విద్యార్థుల వినతిని పరిగణలోకి తీసుకోవాలని టీఎస్ సెట్ సెక్రెటరీ మెంబర్‌కు వివరించారు. టీఎస్ సెట్ సెక్రటరీ మెంబర్ ప్రొ.నరేష్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో స్కాలర్ బి.నవీన్, విద్యార్థులు మహిపాల్, భూమన్న ఉన్నారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ తరపున ఎన్నికల ప్రచారం



- హస్తం గుర్తు అంటేనే అందరి అభివృద్ధి : డిప్యూటీ మేయర్ దంపతులు
- తార్నాక డివిజన్‌లో కాంగ్రెస్ గెలుపు కోసం పాదయాత్ర, ఇంటింటి ప్రచారం
- దానం నాగేందర్‌కే ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు అభ్యర్థన

నవతెలంగాణ-ఓయూ

పార్లమెంట్ ఎలక్షన్స్ నేపథ్యంలో సోమవారం తార్నాక డివిజన్‌లో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, తెలంగాణ కార్మిక విభాగం అధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మోతె శోభన్‌రెడ్డిలు ప్ర చారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్‌నగర్, సండే మార్కెట్, విజయడైరీ, కేపాల్ లేన్, చింతల్ బస్తీ వీధుల్లో ప్రతీ ఇంటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. తార్నాక సెయింట్ ఆన్స్ నుండి చౌరాస్తా వరకూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించి దానం నాగేందర్ హస్తం గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని స్థానిక ఓటర్లను, వ్యాపారులను, ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వారు ప్రచారంలో మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే 5గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. హస్తంగుర్తుకు ఓటువేస్తే ఈ దేశ పరిస్థితి మారుతుందన్నారు. మహిళల జీవితాలలో వెలుగులు నింపడానికి, వారి ఆత్మ విశ్వాసం పెంపొందించడానికి, వారి కళలు సాకారం చేసుకోవడానికి లక్ష రూపాయలు చేయూత అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ అంటే మినీ ఇండియా "ఇండియా" సర్కారులో సికింద్రాబాద్ ఉండాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి మద్దతుగా నిలిచి దానం నాగేందర్ గెలుపుకు సహకరించాలని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకు పోతున్న దానం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతబాద్ డివిజన్‌పరిధిలోని స్థానిక నగర వా సులకు ఎమ్మెల్యే దానం నాగేందర్ సుపరిచితుడని, ఆయ న స్పష్టంగా తాను ఏం చేయాలనుకుంటున్నాడో తెలియ జేస్తూ విమర్శలకు తావు లేకుండా ప్రచారం చేస్తూ కేవలం రెండు వారాల్లోనే అగ్రస్థానంలో నిలిచారు. భిన్నాభిప్రాయాలు ఎదురై గత క్యాడర్‌ను కలుపుకొని ఎదుర్కొంటూ ప్రచారంలో తన శైలిని ప్రదర్శిస్తూ ప్రతిపక్షాలకు అంతు చిక్కకుండా దానగుణం, దయా గుణం ఉన్న దానం నాగేం దర్ ఇక గెలవలేడు మూడవ స్థానమే పరిమితం అంటూ ప్రతిపక్షాలు చేసిన ప్రచారాన్ని తిప్పికొడుతూ అగ్రస్థానాన్ని కైవచనం చేసుకోవడమే కాకుండా ప్రతిపక్షాలకు వణుకు పుట్టించారు. సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గం లని వెంకటేశ్వర కాలనీ బంజారాహిల్స్‌లోని తన నివాసంలో సినీ కార్మిక విభాగాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు అల్లు అర్జున్ మామ కంచర్ల రామచంద్రారెడ్డి కలిసి గెలుపును సాధ్యం చేసుకోవాలని గెలుపు మనదేనంటూ ధీమా వ్యక్తం చేస్తూ ప్రచారంలో ఆయనతో కలిసి భాగస్వాములయ్యారు.

ఫ్యాన్‌కు ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

యువతి ఇంట్లో చీరతో ఉరివేసుకొని చనిపోయిన సంఘటన మధురనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మధురానగర్ ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం, కార్మికనగర్ ఎల్ఆర్ కిషోర్ హై స్కూల్ వెనకాల కర్రీరవి తన భార్య కుమారుడు, కూతురుతో నివాసముంటున్నాడు. కుమారుడు జగదీష్(25), కుమార్తె సాయి వైష్ణవి (19)ఇద్దరూ ఇంటర్ మధ్యలో ఆపిఇంట్లోనే ఉం టున్నారు. ఇటీవల కుమార్తె వైష్ణవిని కంప్యూటర్ కోర్స్ నిమిత్తం ఇనిస్టిట్యూట్‌లో జాయిన్ చేశారు. కంప్యూ టర్ క్లాసులకు వెళ్లి ప్రతిరోజుఇంటికి ఆలస్యంగా వస్తుందని కుటుంబసభ్యులు ఇటీవల మందలినట్లు తెలిపారు.దీంతో ముస్తాపం చెందిన వైష్ణవి 6వ తేదీన ఉదయం 6గంట లకు తనతలిదండ్రులు ఇద్దరూ బయటకు వెళ్లి వచ్చి చూడగా రూములో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉండటం గమనించారు. వెంటనే వైష్ణవిని యూసుఫ్ గూడాలోని మ్యాక్స్ ఎయిడ్ ఆస్పత్రికి తరలి ంచారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే చనిపో యినట్లు నిర్ధారించారు. పోలీసులు మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుమార్తె చనిపోవటానికి ఎవరు కారణం కాదని, మనస్థాపనతో చనిపోయిందనితల్లి మధురా నగర్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు మధురానగర్ పోలీసులు తెలిపారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పచెప్పడం జరిగింది.

ఎగ్జిబిషన్లతో విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఫ్యాషన్ రంగంలో ఉన్న విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఎగ్జిబిషన్లు, కాంపిటీషన్లు ఎంతగానో దోహదపడతాయని హామ్ స్టిక్ సీఈవో అనిత రెడ్డి అన్నారు. సోమవారం పంజాగుట్టలోని హ్యామెస్టిక్ ఇనిస్టిట్యూట్‌లో గ్రాఫికో-2024 పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహి ంచారు. కళాశాల విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల వస్తువులు, ఫోటోలను ఇందులో ప్రదర్శించారు. అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంచి ముఖ్య అతిథులు కైలాసనాయక్, స్వప్న విజయ్, శామ్సన్‌లతో కలిసి బహుమతులను అందజే శారు. ఈ సందర్భంగా అనితరెడ్డి మాట్లాడుతూ కోర్సు పూర్తి చేసుకొని నిజజీవితంలో అడుగుపెడుతున్న విద్యార్థులకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తమరు నేర్చుకున్న ప్రతిభను బహిర్గతం చేయడం ద్వారా తప్పులు తెలుసుకొని వాటిని సరి చేసు కున్నందుకు సైతం పనిచేస్తాయన్నారు. ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ బ్రాంచీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



మహంకాళి దేవాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ దంపతుల పూజలు



నవతెలంగాణ- బేగంపేట్

మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, స్వర్ణ దంపతులు సోమవారం సికింద్రాబాద్‌లో శ్రీఉజ్జయినీ మహంకాళి అమ్మ వారిని దర్శించుకున్నారు. తమ పెండ్లిరోజు సందర్భంగా అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితులు దంపతులను వేద మంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పలువురు దంపతులకు పెండ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో మారేడ్‌పల్లిలోగల సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పండితులు దంపతులకు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పూజలలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కిషోర్, ఆంజనేయులు, ఆకుల హరికృష్ణ, నాగు లు, మహేష్, మహేందర్, అరుణ్ భట్, ఓదెల సత్యనారాయణ, జగదీష్ ప్రసాద్ వర్మ, దుబాయ్ శ్రీను, లావణ్య తదితరులు ఉన్నారు.

డివిజన్‌లో బాబా ఫసియుద్దీన్ ప్రచారం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్‌లో మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ అన్ని బస్తీలలో తిరుగుతూ, కాంగ్రెస్ పార్టీ తరఫున ఇంటింటి ప్రచారం నిర్వ హిస్తున్నారు. ఈ సందర్భంగా హస్తం గుర్తుకు ఓటు వేసి సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం రాజ్‌నగర్‌లో ఇంటిఇంటి ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నగేందర్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, లోకల్ నాయకులు కార్యకర్తలు, తదితరులు భారీగా పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకులు అరెస్టు..రిమాండ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ పోలీస్‌స్టేషన్‌పరిధిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పలువురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేసిన ఘటన బంజారానగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బంజా రానగర్‌లో శ్రీరాములు, అతని భార్య గత కొన్ని రోజులుగా బెల్ట్ షాపు నిర్వహిస్తూ, ఉదయం మద్యం బాటిల్స్ విక్రయి స్తున్నట్లు సమాచారంతో బోరబండ పోలీసులు తనిఖీ చేసి మద్యబాటలిళ్లను పట్టుకున్నట్లు తెలిపారు.అనంతరం ఇద్దరు నిందితులను తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం అరెస్ట్ చేసి వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, సోమవారం ఎక్సైజ్ మూడవ ఏసీ ఎంఎం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు బోరబండ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తెలిపారు.

పద్మారావు కోసం అజ్మీర్‌దర్గాలో పూజలు

నవతెలంగాణ-బేగంపేట్



సికింద్రాబాద్ పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి టి. పద్మారావు ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ ఆ పార్టీకి చెందిన మైనార్టీ నాయకులు రాజ స్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మైనార్టీ నాయకు డు ఇక్బాల్ ఖాన్ ఆధ్వర్యంలో పలువురు మైనార్టీ నాయకులు అక్కడికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసిన చాదర్ సమర్పించారు. పద్మారావు అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని వారు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

- జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, గత ఐదు రోజుల నుండి ప్రతిరోజు జూబ్లీహిల్స్ కంటెస్టెండ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పలు బస్తీలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఎర్రగడ్డ డివిజన్లోని నేతాజీనగర్, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సయ్యద్ నయీమ్, యువకులతో కలిసి నేతాజీనగర్, సుల్తాన్‌నగర్, నటరాజ్ నగర్, సంజయ్‌నగర్, శంకర్‌లాల్ నగర్, బస్తీలలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తారని నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పార్లమెంటు అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నారని నవీన్ యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు.

బీజేపీతోనే సుస్థిర పాలన : కేంద్రమంత్రి రాందాస్ అథవాలే



నవతెలంగాణ-బంజారాహిల్స్

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని కేంద్ర మంత్రి, ఆర్‌పిఐ జాతీయ అధ్యక్షుడు రాందాస్ అథవాలే అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమా వేశం ఏర్పాటు చేశారు. ఆర్పిఐ విజయ వాడ, వరంగల్ స్థానాల నుంచి పోటీ చేస్తున్న పేరం శివ నాగేశ్వరరావుగౌడ్, పసునూరి రాజులతో కలిసి మాట్లా డారు. మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశంలో 50 కోట్ల మంది పేదలు జన్‌ధన్‌ఖాతాలు తెరిచారని, నాలుగుకోట్ల మందికి ఆవాస్ యోజన కింద గృహాలు నిర్మించారని, మరో మూడుకోట్ల గృహాల గృహ నిర్మాణాలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

పార్టీ జాతీయ స్థాయిలో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తుందని చెప్పారు. వరంగల్ విజయవాడ స్థానాల నుంచి పోటీ చేస్తున్న తమ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య నాయకులు, మహిళలు, ఉద్యోగ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తమా గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

స్టార్ ఆస్పత్రి ఇంటర్వెన్షనల్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ కిషన్ శ్రీకాంత్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది అనారోగ్యాన్ని ప్రభావితం చేసే ఆస్తమా వ్యాధి గురించి ప్రపంచ ఆస్త మా దినోత్సవం సందర్భంగా హైదరా బాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌స్టార్ ఆస్పత్రిలో అపార అనుభవజ్ఞులైన పల్మొనాలజీ, క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ కిషన్ శ్రీకాంత్ ఆస్తమా గురించి కొన్ని విషయాలను తెలిపారు. ఆస్తమా గురించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆస్తమా (ఉబ్బసం) దినోత్సవం దాని థీమ్ ఏమిటి అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మదిలో మెది లేదే. సాధారణంగా "ప్రపంచ ఆస్తమా దినోత్సవం" ప్రతి సంవత్సరం మే మెదటి మంగళవారం జరుపుకుంటారనీ ఆస్పత్రి వర్గాలు తెలియజేశాయి. ఈ సంవత్సరం ఇది మే 7వ తేదీన నేడు రావటం, ఈ సంవత్సరం " ఆస్తమా ఎడ్యుకేషన్ ఎంపవర్స్". అనే థీమ్తో, తక్కువ మధ్య తర గతి-ఆదాయ దేశాలలో ఆస్తమా వ్యాధి,మరణాల ప్రభా వం అధికంగా ఉంటుందనీ, ఈ సంవత్సరం థీమ్,ఆస్తమా ఉన్నవారికి వారి వ్యాధితో పోరాడడానికి తగిన అవగాహనతో సాధికారత కల్పించాల్సిన అవసరాన్ని గుర్తించి వ్యాధికి వైద్య సహాయం ఎప్పుడు పొందాలో కూడా గుర్తించి ఆరోగ్య సంరక్షణ నిపుణులు ఆస్తమా నుండి కాపా డుకోవడానికి అనారోగ్యం, మరణాల గురించి అవగాహనను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

బ్రోన్చియల్ ఆస్తమా అంటే ఏమిటి?

ఆస్తమా అనేది దీర్ఘకాలికంగా బాధించే ఊపిరితిత్తుల పరిస్థితి, ఇదిశ్వాసనాళాల వాపు, వాయు మార్గాలలో అధిక శ్లేష్మం ఏర్పడటం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలను చూపిస్తుందనీ 260 మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేసేఅత్యంత సాధారణ దీర్ఘకాలిక అసంక్రమిత వ్యాధులలో ఉబ్బసం ఒకటి. ప్రపంచ వ్యా ప్తంగా ప్రతి సంవత్సరం 4,50లక్షల మరణాలకు ఈవ్యాధి కారణమవుతుందన్నారు. ఈ మరణాలలో చాలవరకు చికిత్స చేయదగినవే కానీ సమయానికి చికిత్స వైద్య పరీక్షలు నిర్వ హించుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

ఆస్తమా వచ్చే ప్రమాదం ఎవరికి ఉంది

అటోపీ (అలర్జీ వ్యాధులు వచ్చే అవకాశం) ఉన్న వారు, ఇదివరకు ఉబ్బసం వ్యాధి ఉన్న కుటుంబ చరిత్ర, గర్భధారణ సమయంలో ధూమపానం, విటమిన్'డి'లోపం, అలర్జీ కారకాలు కాలుష్యానికి గురికావడం, రసాయన కర్మాగారాల్లో పనిచేసే వ్యక్తులకుసంక్రమించే ప్రమాదం ఉందనీ తెలిపారు.రెండు సమస్యలు స్పిరోమెట్రీ కలిగే ప్రమాద కరమైనలక్షణాలు.ఎ) ఊపిరి పీల్చుకో వడం (సాధారణంగా ఊపిరి పీల్చుకున్నప్పుడు అధికంగా ఈల శబ్దం రావడం., బి)దగ్గు(తరచుగారాత్రి పూటఅధ్వాన్నంగా ఉంటుంది. సి)శ్వాస ఆడకపోవడం లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. డి) బిగుతైన చాతి ప్రధాన లక్షణాలుగా తెలిపారు.

ఆస్తమా ట్రిగ్గర్స్ అంటే ఏమిటి ఎలా నివారించాలి

ట్రిగ్గర్స్ అని పిలవబడే కారకాలకు గురైన తర్వాత ఆస్తమా దాడులు లేదా ఆస్తమా లక్షణాలు మరింత ఎక్కువగా ఉంటాయనీ ఆస్తమా ఉన్న రోగులందరికీ ఒకే విధమైన ట్రిగ్గర్లు ఉండవు ట్రిగ్గర్‌లను గుర్తిం చడానికి ఉత్తమ మార్గాలలో ఒకటి ఆస్తమా లక్షణాల నమూనాపై జాగ్రత్తగా శ్రద్ధ వహించడమే అన్నారు.

ఆస్తమాపై అపోహలు..వాస్తవాలు

అపోహ ఇన్‌హేలర్‌లు వ్యసనానికి కారణమవుతాయని, ఇన్‌హేలర్లు ఉపయోగించడం వల్ల పిల్లల ఎదుగుదల ఆగిపోతుందనీ పీల్చే స్టెరాయిడ్స్ హానికరమని, ఇన్‌హేలర్లు ఔషధం యొక్క చివరి మార్గమని ఆస్తమా యొక్క తీవ్రమైన పరిస్థితులలో మాత్రమే ఇన్‌హేలర్లు ఉపయోగించాలన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

11

హైదరాబాద్

HMDA

మంగళవారం | మే 07, 2024 | www.navatelangana.com



కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-దుండిగల్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న ప్రజాసేవను, అయన చేస్తున్న సహాయాలను, పేదల పట్ల ఆయనకున్న ప్రేమకు ఆకర్షితులై కొలన్ తులసి రెడ్డి కాలనీకి చెందిన 50 మంది శివ సాయి రజక సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో వై.సత్య నారాయణ, పెద్దులు, చిన్న సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోడీ గ్యారెంటీకి, వారెంటీకి కాలం చెల్లింది



- మోడీ బాయ్ బాయ్
- మల్కాజిగిరి గడ్డ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి
- బీజేపీ, బీఆర్ఎస్, పార్టీలు, నాణానికి బొమ్మ బొరుసులాంటివి
- మల్కాజిగిరి అభివద్ధి, ముఖ్యమంత్రిగా నా బాధ్యత
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-ఉప్పల్

దేశంలో మోడీ గ్యారెంటీకి, వారెంటీకి కాలం చెల్లిందని, మోడీ బాయ్ బాయ్ అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ మల్కాజిగిరి అభ్యర్థి సునితా మహేందర్‌రెడ్డికి మద్దతుగా ఉప్పల్‌లో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్నర్ మీటింగ్‌లో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మల్కాజిగిరి గడ్డ పై కాంగ్రెస్ జెండా ఎగరేయ్యాలని కోరారు. మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి ముఖ్యమంత్రిగా తన బాధ్యత అన్నారు. మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ 10 ఏండ్ల వరకు కేసీఆర్ వద్ద కాపలాగా పనిచేశాడని, పంపకాలలో తేడాలు రావడంతో ఆయన బయటకు వచ్చేశాడన్నారు. గత పది సంవత్సరాలుగా ఉప్పల్‌లో ఎక్కడ వేసిన పిల్లర్ లు, అక్కడే ఉన్నాయన్నారు.ఇక బీఆర్ఎస్ అభ్యర్థి ఇక్కడ పోటీలో లేనేలేరన్నారు. మల్కాజిగిరిలో దిష్టిబొమ్మ లాంటి వ్యక్తిని బీఆర్ఎస్ బరిలోకి దింపిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లో 35 కోట్ల మంది ఆడపడుచులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిందని గుర్తు చేశారు. 45లక్షల మంది కి 500రూపాయలకు గ్యాస్ సిలిండర్ ఇచ్చిందన్నారు. 30వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. రంగులు, మార్చినా, వేషాలు మార్చినా, మతాల పేరుతో రాజకీయం చేసినా మల్కాజిగిరి ప్రజలు నమ్మరని చెప్పారు. మల్కాజిగిరి లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు రజిత, బొంతు శ్రీదేవి, నాయకులు పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కే క్రైస్తవ సంఘాల మద్దతు

- మేడే రాజీవ్ సాగర్ ఆధ్వర్యంలో క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావు గౌడ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

క్రైస్తవ మైనారిటీల సంక్షేమానికి గత బీఆర్ఎస్ సర్కార్, వ్యక్తిగతంగా నిరంతరం శ్రమించామని సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ లోని ఎస్.పి.జీ. చర్చ్ పారిష్ హాల్ లో సోమవారం సభాధ్యక్షులుగా వ్యవహరించిన తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ ఆధ్వర్యంలో జరిగిన సికింద్రాబాద్ క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో పద్మారావు గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ చర్చిలు, క్రైస్తవుల స్మశాన వాటికల అభివృద్ధితో పాటు క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. రాబోయే కాలంలో క్రిస్టియన్ల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. తనకు మద్దతుగా నిలిచి ఎంపీగా గెలిపిస్తే క్రిస్టియన్ల సమస్యలపై పార్లమెంట్ లో గొంతెత్తి ప్రశ్నిస్తానని వివరించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా కేంద్రంలో ఎవరు ఉన్నసరే వారిపై ఒత్తిడి తెచ్చి క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. క్రైస్తవుల గొంతుకగా నిలిచే తనను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని ఈ సమ్మేళనానికి హాజరైన వారిని కోరారు. మేడే రాజీవ్ సాగర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అంటేనే సెక్యులర్ అనే దానికి పర్యాయపదంగా నిలుస్తుందన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి సెక్యులర్ విధానాలను పాటించి, మైనారిటీలకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. అన్నారు. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ క్రైస్తవుల అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. అలాగే బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దు చేసేందుకు కుట్ర పన్నుతుందని దుయ్యబట్టారు. నేడు ప్రశ్నించే బీఆర్ఎస్ పార్టీ గొంతులను పార్లమెంట్ కు పంపకపోతే రాజ్యాంగానికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తూట్లు పొడుస్తాయని తెలిపారు. అందుకే ఈ సారి సికింద్రాబాద్ ఎంపీగా



పద్మారావు గౌడ్ గారిని గెలిపించాలని కోరారు. ఈ సమ్మేళనానికి విచ్చేసిన సీఎస్ఐ, ఫ్రీ మెథడిస్ట్, బాప్టిస్ట్, సాల్వేషన్ ఆర్మీ, క్యాథలిక్ అసోసియేషన్, దళిత సంఘాల ప్రతినిధులు, అలాగే సికింద్రాబాద్, ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పాస్టర్లు బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ నీ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు లెనార్డ్, తినకరాన్, ఆనంద్ కుమార్, సుదర్శన్, జాకబ్, బిషప్ జాకబ్, గడ్డం సోలోమాన్, జాన్ రవీంద్ర, రాబర్ట్ సూర్య ప్రకాష్, సునీల్, డేవిడ్ రాజ్, క్యాథలిక్ లీడర్ ఎంపీ లియో, డేవిడ్ శాంతి కుమార్, దయాకర్, ప్రవీణ్, కెన్నీ, డేవిడ్, ఆల్ ఇండియా క్యాథలిక్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఆంద్రూ క్లైవర్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం కమిషనింగ్ పగడ్బందీగా నిర్వహించాలి



- వీవీ ప్యాట్లలో సింబల్ లోడింగ్ జాగ్రత్తగా చేయండి
- హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల కమిషనింగ్ ను అధికారులు, సిబ్బంది ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి సూచించారు. సోమవారం మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని డీఆర్‌సీ సెంటర్‌లో కార్వాన్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎం కమిషనింగ్, సెగ్రిగేషన్, వివి ప్యాట్లలలో సింబల్ లోడింగ్ ప్రక్రియ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవీ ప్యాట్లలో సింబల్ లోడింగ్ జాగ్రత్తగా చేయాలని, ఈవీఎం కమిషనింగ్ పూర్తయిన తర్వాత మాక్ పోలింగ్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ ఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైశ్య యూత్ అసోసియేషన్ అధ్యక్షునిగా అరుణ కుమార్

నవతెలంగాణ-కల్చరల్



భాగ్య నగర్ వైశ్య యూత్ అసోసియేషన్ అధ్యక్షునిగా చిన్నారామయ్యగారి అరుణ కుమార్ సహా కార్యవర్గ సభ్యులతో కలసి అసోసియేషన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు వ్యక్తిత్వ వికాస నిపుణుడు జీ.వీ. ఏ . ఎన్. రాజు కీలక ప్రసంగం చేశారు ప్రతీ సంవత్సరం పేద విద్యార్థినీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించటం ప్రభుత్వ విద్యాలయాలకు అవసరమైన వస్తు సామాగ్రిని అందించటంతో పాటు లాప్ టాప్‌లు బహుకరించటం విద్యా రంగం లో అసోసియేషన్ సేవలు అందిస్తోందని తెలిపారు. యువశక్తిని నిర్మాణాత్మక కార్యక్రమాలకు ఉపయోగించే విధంగా నూతన కార్యవర్గం పని చేయాలని ఆయన కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొనవలసిన అర్.టీ. సీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ సందేశం పంపారు. కార్యక్రమంలో సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎర్రంశెట్టి రవి కాంత్, పూర్వ అధ్యక్షుడు రాహుల్, డీ వీ.ఎస్.పీ.గుప్తా దివ్వెల మురళి కస్తూరి శివ ప్రసాద్ పాల్గొనగా ప్రాజెక్టు చైర్మెన్ మర్యాద రాజేంద్ర ప్రసాద్ నూకల నాగ రాజు పర్యవేక్షణ చేయగా కూర ధీరజ్ వందన సమర్పణ చేశారు.

మధుర గాన సుమాలు సంపుటి విశ్లేషణ



నవతెలంగాణ-కల్చరల్

నాటి తెలుగు సినీ గాయకులు పీఠ పురం నాగేశ్వర రావు మాధవపెద్ది సత్యం ఏ.ఎం. రాజా లు పాడిన పాటల సంకలన సంపుటి పై విశ్లేషణ కార్యక్రమం త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై బుక్ రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటీ వారి నిర్వహణలో జరిగింది. ప్రముఖ గాయకుడు త్రినాథ రావు పాల్గొని మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధి ఎంత జరిగినా మానసిక వికాసానికి విజ్ఞానానికి గ్రంథ పఠనం అవసరం అన్నారు. మహా గాయకుడు ఘంటసాల కాలంలోనే పీఠ పురం, మధవపెద్ది రాజా లు తమ పరిధిలో పలు పాటలను పాడి తెలుగువారి అభిమాన పాత్రులు అయినారన్నారు. సంకలన కర్త నారాయణ డీవీవీఎస్ సంపుటిలోని పాటల వివరాలు తెలిపారు. అనంతరం త్రినాథ రావు ను ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్ల సోమ సుందరం, ఎస్ ఆదినారాయణ మూర్తి,నాగ రాజులు నట గాన సాహితీ విశారద బిరుదుతో నందిని బహుకరించారు.సంస్థ కార్యదర్శి అలివేలు స్వాగతం తెలిపిన సభకు తొలుత పలువురు గాయనీ గాయకులు సినీ గీతాలు మధురంగా ఆలపించారు.

పీఆర్సీ కమిటీ సభ్యులతో టీఎన్జీవో ముఖ్య నేతల భేటీ

పీఆర్సీ కమిటీ చైర్మెన్‌తో పలు అంశాలపై చర్చించిన మారం జగదీశ్వర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం పీఆర్సీ-2023 కమిటీ సభ్యులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలను కమిటీ దృష్టికి ఆయన తీసుకువెళ్లారు. అనంతరం మారం జగద్వీశర్ మాట్లాడుతూ మెడికల్ ఇన్వాల్యుడేషన్‌పైన రిటైరైన ఉద్యోగుల పిల్లలకు కంపెన్సేట్ అపాయింట్మెంట్‌పై వెంటేనే ఆదేశాలు జారీ చేయాలని, కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ ఎత్తివేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు.

కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, మెరుగైన పీఆర్సీ ఇవ్వాలని, హెల్త్ కార్డులు అన్ని ప్రయివేట్ ఆస్పత్రిలో వర్తింపజేయాలని పీఆర్సీ కమిటీ చైర్మెన్ శివశంకర్‌ని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై పీఆర్సీ కమిటీ సభ్యులందరూ సానుకూలంగా స్పందించి అతి త్వరలో ప్రభుత్వ ఉద్యోగులు అన్ని సమస్యలు సానుకూలంగా పరిష్కారమవుతాయని చెప్పారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముజీబ్, కేంద్ర సంఘం నాయకులు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, కొండల్ రెడ్డి, సిటీ యూనియన్ అధ్యక్షులు కె. శ్రీకాంత్, డ్రైవర్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
మంగళవారం | మే 07, 2024 | www.navatelangana.com

ఘనంగా కొలన్ హన్మంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కుత్బుల్లాపూర్‌లో మునిసిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, అన్ని డివిజన్లలో పార్టీ కార్యాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి , ఎన్నికల అబ్జర్వర్ శోభారాణి , మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ , టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు భూపతి రెడ్డి, జ్యోత్స్నా శివారెడ్డి, పున్నారెడ్డి, డివిజన్ అధ్యక్షులు, నియోజకవర్గంలో ఉన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, యూత్ అండ్ ఎన్ ఎస్‌యూఐ నాయకులు, సేవాదళ్ నాయకులు, ఎస్సీ అండ్ ఎస్టీ సెల్ నాయకులు, ఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున తరలి వచ్చి హన్మంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జగద్గిరిగుట్ట డివిజన్‌లో కాంగ్రెస& మల్కాజ్గిరి గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్నా శివారెడ్డి, కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హనుమంత్ రెడ్డి , కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి కలిసి లోక్ సభ ఎన్నికల రోడ్డు షో నిర్వహించారు.
నవతెలంగాణ - బాలానగర్

మైనారిటీల అభ్యున్నతికి

పనిచేసిన ఏకైక పార్టీ బీఆర్ఎస్

- కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్యారెంటీ లేదు
- ఎమ్మెల్యే కేపీ. వివేకానంద, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మైనారిటీ సోదరుల అభ్యున్నతికి పనిచేసిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. 29 - సూరారం డివిజన్ షాపూర్ నగర్ లోని ఎం.జె.గార్డెన్స్ నందు సోమవారం నిర్వహించిన ముస్లిం మైనారిటీ సోదరుల ఆత్మీయ సమ్మేళనానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం అనే ముచ్చటే మరిచారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులకు అసలు ఇక్కడ ఓటు హక్కే లేదని వీరు రాజకీయ పునరావాసం కోసం మల్కాజిగిరి లో పోటీ చేస్తున్నారు తప్పా ప్రజా సంక్షేమం కోసం కాదన్నారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం అంటే బీఆర్ఎస్, బీఆర్ఎస్ అంటేనే సంక్షేమం అనే విధంగా పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టామని తెలిపారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆరు గ్యారెంటీల అమలుకు గ్యారెంటీ లేదని, అసలు ఐదేండ్లు ఈ ప్రభుత్వం ఉంటుంది అనడానికే గ్యారెంటీ లేదన్నారు.రెండు ఎంపీ స్థానాలతో ప్రారంభమై పార్లమెంట్‌లో కొట్లాడి తెలంగాణ సాధించుకున్నామని, కావున పార్లమెం ట్‌లో 12 మంది ఉంటే మన హక్కులు, మనకు రావాల్సిన బడ్జెట్‌ను సాధించుకోలేమా...? అని ప్రశ్నించారు. అంతేకాక జూన్ 2వ తేదీతో హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అనేదానికి ముగింపు ఉంటుందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించుకుంటే బీజేపీ ప్రభుత్వం చేసే కేంద్రపాలిత ప్రాంతం అనే కుట్రను తిప్పి కొట్టవచ్చన్నారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డిని, ఎమ్మెల్యే కేపీ వివేకానందను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ శేఖర్ గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు, సోదరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళతప్పిన కలెక్టరేట్..!

- నాడు కళకళ.. నేడు వెల వెల..
- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో కనిపించని సుందరీకరణ
- ఎండుతున్న మొక్కలు.. రాలుతున్న ఆకులు
- పట్టని అధికారగణం..!



పారంభ సమయంలో పచ్చదనం



ప్రస్తుతం బీడులా మారిన కలెక్టరేట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

'చుట్టూ పచ్చదనం. మధ్యలో కార్యాలయం. బిట్స్‌బిలానీ చౌరస్తా మొదలు, ఎంట్రెన్స్ నుంచి కార్యాలయ ప్రాంగణం వరకు పచ్చటి మొక్కలతో కళకళలాడేది. చూపరులను ఆకట్టుకునేది. అదే మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ కార్యాలయం. ఇది కార్యాలయం ప్రారంభ సమయంలో మాట. కానీ దాదాపు ఏడాది కాలంగా పరిస్థితులు మారాయి. అధికారుల పట్టింపు లేమీయో..? వరుస ఎన్నికల ఎఫెక్టో తెలియదు కానీ.. కలెక్టరేట్‌ను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న మొక్కలను సాకే వారు లేక మొక్కలన్నీ ఎండు ముఖం పట్టాయి. ప్రస్తుతం అసలే ఎండాకాలం.. దీనికితోడు మొక్కలకు నీళ్లు కూడా పట్టేవారు కూడా లేకుండా పోయారు. దీంతో కొన్ని మొక్కలు ఇప్పటికే మొత్తం ఎండిపోగా.. మరికొన్ని మొక్కలు చివరి దశలో ఉన్నాయి. నీళ్లు పోసే వారు లేక.. నిర్వహణ గాలికొదిలేయడం, పట్టించుకునే వారు లేకపోవడంతో కాలంతో సంబంధం లేకుండా కళకళలాడాల్సిన కలెక్టరేట్ నేడు కళ తప్పి అంద విహీనంగా కనిపిస్తోంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సమీకృత పరిపాలనా భవనం, అన్ని ప్రభుత్వ శాఖల సమూహం. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని అంతాయిపల్లి గ్రామ పరిధిలో సుమారు 30 ఎకరాల్లో ఈ కలెక్టరేట్ విస్తరించి ఉంది. సుమారు రూ.52 కోట్లతో నిర్మించారు. 2017 అక్టోబర్ 11వ తేదీన శిలా ఫలకం వేయగా.. 2022 ఆగస్టు 17వ తేదీన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. అప్పుడు కళకళలాడిన కలెక్టరేట్.. ఇప్పుడు వెల వెల బోతోంది. నిర్వహణ లోపంతో ఏడాదిన్నరలోపే కళ తప్పింది. కలెక్టర్ మొదలు, ఇద్దరు అడిషినల్ కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారి, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సైతం నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. వీరికితోడు ఆయా శాఖల జిల్లా అధికారులు సైతం వస్తూ.. వెళ్తూ ఉంటారు. అయినా ఎక్కడా సుందరీకరణ కనిపించడం లేదు. ఇక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌తోపాటు ఆయా శాఖల జిల్లా అధికారులంతా అక్కడే ఉంటారు. ఎంతో సుందరంగా, అన్ని వసతులతో నిండి ఉండాల్సిన భవనం నేడు పట్టించుకునే నాథుడు లేక విలవిల్లాడుతోంది. బిట్స్ బిలానీ చౌరస్తా మొదలు, కలెక్టరేట్ ప్రధాన గేటు, కార్యాలయం చుట్టు ప్రాంగణం, ముందు ఉన్న మైదానంలో మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. ఇక దీనికి తోడు అధికార యంత్రాంగం రోజూ వస్తున్నా.. కలెక్టరేట్ ఆచూకీ తెలిపేలా ఎక్కడా సూచికలు పెట్టకపోవడంతో జిల్లా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దగ్గరికి వచ్చి చూసే వరకు తెలియడం లేదు.. ఇది కలెక్టర్ కార్యాలయం అని. ఇప్పటికైనా మొక్కల సంరక్షణతోపాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఇలాగైతే ఎలా..

30 ఎకరాల భూమిని సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కార్యాలయం పరిధిలో పచ్చదనం మచ్చుకైనా కనిపించడం లేదు. రాజీవ్ రహదారి, కీసర, శామీర్‌పేట మండలం, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు కలెక్టరేట్ దారి చూపే స్వాగత తోరణాన్ని రోడ్డుపక్కన పడేసి ఏడాది దాటి పోయింది. వచ్చిపోయే అధికా రులు అటువైపు కూడా చూడటం లేదు. కలెక్టరేట్‌కు ఎటు వెళ్లాలో తెలియదు. ఏ దారిలోనూ సూచికల్లేవు. అంతాయిపల్లి-బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ చౌరస్తా వద్ద మార్గ సూచీ లేకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. సమీప ప్రాంతాల నుంచి కలెక్టరేట్ వచ్చేందుకు రవాణా సౌకర్యం కూడా లేదు. కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో బసెషెల్టర్ ఏర్పాటు చేయ లేదు. ఇంకా కీసరలోని పాత కలెక్టరేట్ మార్గ సూచీలే అక్కడక్కడ దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం కలెక్టరేట్ ప్రాంగణం మొత్తం బీడు భూమిలా కనిపిస్తున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

మార్నింగ్ వాకర్స్‌తో ఎమ్మెల్యే ముఖాముఖి



నవతెలంగాణ - కూకట్ పల్లి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు సోమవారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, ముఖ్య నాయకులతో కలసి మూసాపేట్ డివిజన్‌లో పీఆర్ నగర్ పార్క్ లో వాకర్స్‌తో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో, బీఆర్ఎస్ మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డి గెలుపు కోసం చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మూసాపేట్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సి. హెచ్.సత్యనారాయణ, ఎన్.సత్యం, రాజ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



- పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్

నవతెలంగాణ - కూకట్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతీ ఒక్కరు పని చేయాలని పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి సమక్షంలో పలువురు వెల్ఫేర్ సభ్యులు, బస్తీకి చెందిన వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధిని ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు, పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న గడ్డం రంజిత్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి, మరోమారు పార్లమెంటుకు పంపించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. బస్తీ ప్రధాన కార్యదర్శి ఆర్.భగవంత రెడ్డి, నాయకులు మల్లేష్ మేస్త్రి, రాజిరెడ్డి టైల్స్, దాకూరు తిరుపతిరెడ్డి, నరసింహ, ఎల్లయ్య, కిరణ్, రాజు , రంగా రాజు, వెంకటేష్, ఆంజనేయులు, రమేష్, ఉప్పలయ్యలను జగదీశ్వర్ గౌడ్ పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ కోశాధికారి నర్సింహులు ముదిరాజ్ నాయకులు కె.వి .రాజు, తాటి కిరణ్, మొగుళ్ల కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనిషిలోని అజ్ఞానాన్ని చదువు తొలగిస్తుంది

- ఎమ్మెల్యే కేపీ. వివేకానంద
- ఘనంగా వ్యాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్

మనిషిలోని అజ్ఞానాన్ని చదువు తొలగిస్తుందని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ చింతల్ డివిజన్ హెచ్ఎంటీ కాలనీ, షాపూర్ నగర్ నందు నూతనంగా ఏర్పాటుచేసిన వ్యాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఎమ్మెల్యే కేపీ. వివేకానంద, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు,మండల పూర్వ మండల విద్యాధికారి ఆంజనేయులు, ట్రస్మా రాష్ట్ర నిర్వాహక అధ్య క్షులు శివరాత్రి యాదగిరి,రాష్ట్ర ఎలక్షన్ కమిటీ అధ్యక్షులు ఇన్నారెడ్డి,ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జె.నాగరాజు లు ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాల చైర్మన్ అల్వాల వనజ అశోక్, డైరెక్టర్లు సంతోష్ పాటిల్,నవీన్ రెడ్డి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల క్రితం (హెచ్ఎంటి)ఈ పాఠశాలలో తాను చదువుకున్నానని గుర్తు చేశారు. కొన్ని కారణాలవల్ల ఈ పాఠశాల మూతపడడం బాధాకరం అని.. అయినా మళ్లీ కొత్త ఉత్తేజంతో వ్యాక్సన్ ఇంటర్నేషనల్ పేరుతో నేడు సువిశాలమైన,ఆహ్లాదకర వాతావరణంలో కార్పొరేట్ స్థాయి తరహాలో పాఠశాల అదే చోట ప్రారంభించుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.పాఠశాలకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు.పూర్వ మండల విద్యాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ విద్యతో పాటు,సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పిస్తూ విలువలతో కూడిన కూడిన విద్యనందించాలని యాజమాన్యానికి సూచించారు.అనంతరం పాఠశాల చైర్మెన్ అల్వాల వనజ అశోక్ మాట్లాడుతూ హెచ్ఎంటి గ్రౌండ్‌లో వ్యాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభించుకోవడం తమ ఎన్నో ఏండ్ల కల అన్నారు. తమ పాఠశాలలో (సీబీఎస్ఈ)సిలబస్ తో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ,ఆట పాటలకు,క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు అన్ని రంగాలలో నైపుణ్యం పొందాలన్నదే మా ఆశయం, లక్ష్యం అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.బాలారాజు,పలు పాఠశాలల కరస్పాండెంట్ లు ఛాయా,శేషు కుమార్, ఆనంద్,రాంబాబు,ప్రవీణ్ తోపాటు మాజీ కార్పొరేటర్ జి. సురేష్ రెడ్డి,నాయకులు మొహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అత్యంత పారదర్శకంగా ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కుత్బులాపూర్ నియోజవర్గం సెగ్మెంట్ పరిధిలోని లయోలా జూనియర్ కళాశాల, అల్వాల్ నందు ఈవీఎం కమిషనింగ్‌లో భాగంగా సోమవారం రాజకీయ పార్టీ వారు ఎంపిక చేసిన 5 శాతం అనగా 30 ఈవీఎంలకు మాక్ పోల్ నిర్వహించారు. ప్రతి ఈవీఎంలో 1000 ఓట్లు వేసి రాజకీయ పార్టీ వారి సమక్షంలో లెక్కింపు జరిగింది. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ పులి సైదులు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్. వి. నర్సింలు, ఈఆర్ఓ , కుత్బులాపూర్ నియోజవర్గం సెగ్మెంట్ కుత్బుల్లాపూర్, గండిమైసమ్మ బాచుపల్లి తహశీల్దార్లు పాల్గొన్నారు



బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- డి.ఎఫ్.సి.ఎస్ మేడ్చల్ జిల్లా చైర్మెన్ మన్నె రాజు

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మేడ్చల్ జిల్లా డి.ఎఫ్.సి.ఎస్.చైర్మెన్ మన్నె రాజు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోరుతూ సోమవారం ఆ పార్టీ శ్రేణులు విస్తత ప్రచారం నిర్వహించారు. 130 డివిజన్ సుభాష్ నగర్ లో మన్నె రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సాయిబాబా నగర్, సూరారం కాలనీ, కషి కాలనీలలో రాగిడి లక్ష్మారెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టరు హుస్సేన్, వెంకటస్వామి, పందిరి యాదగిరి, ప్రభాకర్ బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ హస్తం ప్రజల నేస్తం..

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ హస్తం ప్రజల నేస్తమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సోమవారం చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ లో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టి.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్నర్ మీటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు.మల్కాజ్ గిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని పట్నం సునీత మహేందర్ రెడ్డి ని చెయ్యి గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.ఎంపీ అభ్యర్థిని పట్నం సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ప్రజా సంక్షేమానికి పాటుపడే ప్రభుత్వం కాంగ్రెస్సేనని ఆమె స్పష్టం చేశారు. డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డిగారు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి భగత్ సింగ్ నగర్ ప్రజలు పొదుపు సంఘాల మహిళలు, పార్టీ నాయకులు, మిత్ర పక్షాల నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ : కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డికి మద్దతు గా సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని ఎస్సార్ నాయక్ నగర్, అపురూప కాలనీల్లో మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, నాయ కులు గుంజ శ్రీనివాస్, గుబ్బల రమణ, బొబ్బ ప్రసాద్, మల్లేష్ గౌడ్, కుమ్మరి శంకర్, తులసి, సీతామహాలక్ష్మి, నాగమణి, ప్రభాకర్ రావ్, మహేందర్ రెడ్డి, వీర్ ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్, వీరేశం గుప్త, పాటిల్, నాగిరెడ్డి, నరేందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మోహన్, సీతారాం రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో గులాబీ జెండా ఎగురవేస్తాం



- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

నవతెలంగాణ - కూకట్ పల్లి

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా సోమవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని, దీన్ దయాళ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆల్విన్ కాలనీ ఫేస్ వన్, కాలనీ వాసులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ ఫేస్ 1 కాలనీ వాసులు కాసాని జ్ఞానేశ్వర్‌కు పూర్తి మద్దతు తెలియచేయడం చాలా గొప్ప విషయం అన్నారు. అందుకు అందరికి కతజ్ఞతలు తెలియచేస్తున్నానన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని, రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తూ వస్తున్నదని,ఈ సారి కూడా పార్టీ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. పార్టీ రెండు సార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని ఆ ఇద్దరిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్నదని,కేసీఆర్‌ను ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఏ ఒక్క గ్యారెంటీ అమలు చేయలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిత్యవసర సరుకులు, గ్యాస్ ధరలను పెంచి సామాన్యుల బతుకులపై గుది బండగా మారిందని, మత రాజకీయాలు చేసి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప ఈ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో పేదలకు అందిన ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీ కి శ్రీరామ రక్ష అని తెలియచేసారు. బీసీ సామాజిక వర్గానికి పెద్ద పీట వేస్తూ , బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను కేసీఆర్ నిలబెట్టారని, అందరూ కలిసి కట్టుగా పనిచేసి కాసానిని గెలిపిద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి,ఆల్విన్ కాలని డివిజన్ మాజీ అధ్యక్షుడు జిల్లా గణేష్, రౌతు మోహన్ రావు, కృష్ణ గౌడ్, కష్ణమూర్తి,వంశి,సుభాష్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలను ఇంటింటికి చేరవేయాలి



- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

కాంగ్రెస్ పథకాలను ఇంటింటికి చేరవేయాలని కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం బండి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యురాలు జ్యోతిమని, పార్టీ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కో ఆర్డినేటర్ వినయ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతిమని మాట్లాడుతూ నియోజకవర్గం లోని ప్రతీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి ప్రచారం చేస్తూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను వివరించాలన్నారు. అదేవిధంగా రాహుల్ గాంధి పాంచ్ న్యాయ్, పాంచ్ గ్యారంటీలలో మహిళలకు పెద్దపీట వేసినట్టు తెలిపారు. ప్రతీ కుటుంబంలోని మహిళకు సంవత్సరానికి రూ. లక్ష రూపాయలు అంటే నెలకు రూ. 8 వేల 500 వస్తాయని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 2 వేల 500లు కలిపి రూ. పదకొండు వేలు వస్తాయని, కాబట్టి ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసే విధంగా చూడాలని నాయకులకు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సత్యం శ్రీరంగం, తూము వేణు, నాగిరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, ఎండీ మోయిజ్, శేరి సతీష్ రెడ్డి, దండుగుల యాదగిరి, గాలి బాలాజీ, డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్, ప్రవీణ్, మహేష్ యాదవ్, కష్ణ రాజపుత్, కుక్కల రమేష్, మధు గౌడ్, పుష్పారెడ్డి, రమాదేవి, జ్యోతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో వైద్య శిబిరం



నవతెలంగాణ-దుండిగల్


మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి ప్రముఖ గైనకాలజిస్ట్ డా. సజన విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆరోగ్యం అంటే శారీరికంగా దఢంగా ఉండడమే కాక, మానసిక స్థైర్యం కూడా ఉండాలని అప్పుడే మనిషి పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టని తెలిపారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం, వ్యాయామం, నిద్ర ఈ మూడింటి పై చాలా శ్రద్ధ వహించాలని సూచించారు. ఇందులో భాగంగానే అందరికి బీమా అనే శీర్షికతో జాతీయ బీమా సంస్థ ప్రతినిధి రమేశ్ సదానందన్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ బీమా తీసుకోవాలని, అది భవిష్యత్తు లో తప్పక మనకు అండగా ఉంటుందని తెలిపారు. అలాగే ముచ్యువల్ ఫండ్స్ పై అవగాహన కల్పిస్తూ, చిన్న మొత్తంలో ఆదా చేస్తే పెద్ద మొత్తంలో ఆదాయం మన భవిష్యత్తు తరాలకు అందించిన వారమవుతామని తెలిపారు. కార్యక్రమానికి కళాశాల చైర్మెన్ జె. నర్సింహారెడ్డి, కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి , కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్. లోకనాథం, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సినీ రంగం అంటేనే కత్తి మీద సాము. అందులోనూ ఎటువంటి పరిచయాలు, కుటుంబ నేపథ్యం లేని వారు ఈ రంగంలో రాణించాలంటే మామూలు విషయం కాదు. ఇక మహిళలు అవకాశాలు దక్కించుకోవాలంటే మరింతగా శ్రమించాల్సి వుంటుంది. సినీ రంగం రంగుల ప్రపంచం కాకముందు కేవలం నలుపు తెలుపులో మాత్రమే చిత్రాలు నిర్మించేవారు. ఆ సమయంలో ఈ రంగంలోకి మహిళలు అడుగుపెట్టడమే మహా అద్భుతం. అలాంటిది ఒక మహిళ నాటక రంగం నుండి సినీ రంగంలోకి అడుగుపెట్టింది. తన సహజమైన నటనతో తనకంటూ ఓ సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుంది. నేటి తరం తారలకు స్ఫూర్తిగా నిలిచింది. గొప్ప నటుల పక్కన నటించి ప్రేక్షకుల హృదయాలను దోచుకుంది. ఆ నటి మరెవరో కాదు పసుపులేటి కన్నాంబ. ఈ రోజు ఆమె వర్ధంతి సందర్భంగా....



నట శిరోమణి కన్నాంబ



కన్నాంబ పేరు చెప్పగానే మొదటిగా గుర్తుకొచ్చేది లవకుశలో ఆమె పోషించిన కౌసల్య పాత్ర. తర్వాత మనోహరలోని పాత్ర. ఆ రోజుల్లో ఆమెకు ధీటైన నటులు ఎస్వీ రంగారావు, శివాజీ, సావిత్రి. గంభీరమైన స్వరం, చక్కటి రూపం వీటికి తోడు మాటలు పలకడంలో ఆమె చాతుర్యం, హావభావాలతో ప్రేక్షకుల మనసులో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారు.

నాటక రంగం నుండి...

కన్నాంబ పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరులో 1912లో జన్మించారు. తండ్రి వెంకట నరసయ్య, తల్లి లోకాంబ. తండ్రి ప్రభుత్వ కాంట్రాక్టర్‌గా పని చేసేవారు. వీరికి కన్నాంబ ఒక్కతే కూతురు. ఈమె తన చిన్నతనంలో ఎక్కువగా అమ్మమ్మ ఇంట్లోనే పెరిగారు. కన్నాంబ సంగీతం మీద ఆసక్తి కనబర చడంతో తాతయ్య ఆమెకు సంగీతంలో శిక్షణ ఇప్పించారు. ఆనాటి నావెల్ నాటక సమాజంలో తన 13వ ఏట బాల పాత్రలు వేస్తూ తొలిసారిగా నాటక రంగప్రవేశం చేశారు. ఆమెకు పదహారేళ్ళ వయసులో ఏలూరులో సత్యహరిశ్చంద్ర నాటకం జరుగుతోంది. ఆ నాటకానికి కన్నాంబ కూడా వెళ్ళారు. చంద్రమతి పాత్రధారిణి శోకరసంలో పాడాల్సిన పద్యాలను పాడకపోవడంతో ప్రేక్షకులు గేలి చేయడం మొదలుపెట్టారు. ప్రేక్షకుల మధ్య నుంచి కన్నాంబ లేచి స్టేజ్ మీదకు వెళ్ళి చంద్రమతి పాత్రను తను పోషిస్తానని ప్రకటించి, వేగంగా ముఖానికి రంగు పూసుకొచ్చి పద్యాలు పాడుతూ వుంటే, ప్రేక్షకులు ఆశ్చర్యపోయి చూస్తూ వన్స్ మోర్లు కొట్టారంట. అలా కన్నాంబ నటనా ప్రస్థానం మొదలైంది. ఇదే నాటక సమాజం వారు కన్నాంబకు సావిత్రి, సత్యభామ, అనసూయ, చంద్రమతి వంటి మంచి పాత్రలు ఇచ్చి వారి నాటకాలను రక్తికట్టించే ప్రయత్నం చేశారు. ఆమె దొన్నేటి సూర్యనారాయణతో కలిసి 'రంగూన్ రౌడి' అనే నాటకాన్ని దేశ వ్యాప్తంగా ప్రదర్శించి మన్ననలు పొందారు. తన నాటక రంగ అనుభవంతో 1935లో హరిశ్చంద్ర అనే తెలుగు చలనచిత్రంలో చంద్రమతిగా అడుగు పెట్టారు. ఆ తర్వాత ద్రౌపతి వస్త్రాపహరణంలో ద్రౌపది పాత్రలో అద్భుతంగా నటించి తెలుగు ప్రేక్షకుల మన్ననలను, ప్రశంసలను అందుకున్నారు.

కటిక పేదరికంలో...

ఆవిడ గొప్ప మనసు గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అని చెప్పకోవాలి. శ్రీ రాజరాజేశ్వరి ప్రొడక్షన్స్ ఆనాడు ఒక దాన ధర్మ నిలయంగా విలసిల్లేదని నేటికీ సినీ పరిశ్రమలో ఎంతో మంది చెప్పుకుంటారు. ఇటువంటి గొప్ప నటి కటిక పేదరికంలో చనిపోయారు అని తలచుకుంటే ఎవరికైనా గుండె ద్రవించక మానదు. సుమారు ఐదు దశాబ్దాలు తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తనదైన ప్రత్యేక ముద్ర వేసుకున్న కన్నాంబ 1964 మే 7న తన తుది శ్వాస విడిచారు.

అతి తక్కువ సమయంలో...

కన్నాంబ సుమారు 150 పౌరాణిక, జానపద, చారిత్రక చిత్రాలలో తనదైన శైలిలో అద్వితీయంగా నటించి, గొప్ప నటీమణిగా కీర్తి గడించారు. నవరసాలను సమర్థవంతంగా పోషించగల అద్భుత నటి. కన్నాంబ భర్త కడారు నాగభూషణం. వీరిద్దరూ కలిసి 'రాజరాజేశ్వరి' చిత్ర నిర్మాణ సంస్థను స్థాపించారు. దీని ఆధ్వర్యంలో తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఎన్నో చిత్రాలు నిర్మించారు. కన్నాంబ అతి తక్కువ సమయంలోనే ఎం.జీ.రామచంద్రన్, ఎస్.ఎస్.రాజేంద్రన్, శివాజీ గణేషన్, నాగయ్య, పి.యు.చిన్నప్ప, నందమూరి తారక రామారావు వంటి అగ్రశ్రేణి నాయకుల సరసన ఎన్నో చిత్రాల్లో నటించారు. కేవలం కనుబొమ్మలతో ఆవిడ ప్రేమ, కరుణ, రౌద్రం... ఒకటేమిటి నవరసాలు పలికించేవారు.

కన్నాంబ లోలాకులు...

ఆ రోజుల్లో ఆమె నటించిన చిత్రాలలోని పాత్రల పేరుతో కాంచనమాల గాజులు, కన్నాంబ లోలాకులు అంటూ ఆభరణాలు వచ్చేవి. వాస్తవానికి కన్నాంబ గొప్ప ఐశ్వర్యవంతురాలు. కానీ ఐశ్వర్య ఎలా వస్తుందో ఎలా పోతుందో ఎవరూ చెప్పలేరని పెద్దలు అంటుం టారు. అలా ఆమె ఐశ్వర్యం ఎలా పోయిందో, ఏమైపోయిందో కానీ కన్నాంబ మరణంతో వారు స్థాపించిన కంపెనీలతో సహా అన్నీ మాయమై పోయాయి. ఆమె భర్త నాగభూషణం ఒక చిన్న గదిలో ఉంటూ కాలక్షేపం చేశారు. కన్నాంబ నటించిన చిత్రాలలో ఆత్మబలం, లవకుశ, దక్షయజ్ఞం, జగదేకవీరుని కథ, మాంగల్యబలం, తోటి కోడలు, చరణదాసి, అనార్కలి, పాదుకా పట్టాభిషేకం, అన్నా తమ్ముడు, తల్లి ప్రేమ, సారంగధర వంటి చిత్రాలు ఆమెకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. ప్రతి చిత్రంలోనూ ఆమె నటన అద్భుతమే. సహజ సౌందర్యంతో నటించి ప్రేక్షకులను మెప్పించారు.

మంచి గాయనిగా...

కేవలం నటిగానే కాదు మంచి గాయనిగా కూడా పేరు తెచ్చుకున్నారు. ఒకప్పుడు కన్నాంబ పాడిన కృష్ణం- భజరాధా గ్రామఫోన్ గీతాలు ప్రతి ఇంటా మారుమోగుతూ ఉండేవి. చండిక చిత్రంలో చేతిలో కత్తి పట్టుకుని, వీరావేశంతో గుర్రం మీద కూచుని ఠీవిగా, కళ్లెర్రజేస్తూ 'నేనే రాణినైతే, ఏలనే ఈ ధర ఏకధాటిగా' అనే పాట కోసమే చాలా మంది ఆ రోజుల్లో ఆ సినిమా చూసేవారు. 'ఏమే ఓ కోకిల..ఏమో పాడేదవు ఎవరె నేర్పినది ఈ ఆట ఈ పాట...' అంటూ సాగే ఈ పాటలో ఆమె నవ్వులు రువ్వుతు పాడారు. మధ్య మధ్యలో వచ్చే ఆ నవ్వు ఆమె తప్ప ఇంకెవరు అలా నవ్వులు కలుపుతూ పాడలేరని కూడా ఆనాటి ప్రేక్షకులు చెప్పుకునేవారు.

- పాలపర్తి సంధ్యారాణి

వ్యాయామం చేస్తే..

వ్యాయామం చేయడం వల్ల ఎన్నో లాభాలుంటాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రతి రోజూ వ్యాయామం చేసి చాలా ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు.



ఊబకాయం మొదలు గుండె సంబంధిత సమస్యల వరకు ఎన్నో రకాల సమస్యలకు వ్యాయామం బెస్ట్ ఆప్షన్‌గా చెబుతారు. అయితే వ్యాయామంతో నిద్రలేమి సమస్య కూడా దూరమవుతుందని పరిశోధకులు చెబుతున్నారు. ఇటీవల నిర్వహించిన కొన్ని అధ్యయనాల్లో ఈ విషయం వెల్లడైంది. వారానికి కనీసం రెండు, మూడుసార్లు చేసినా రాత్రిపూట బాగా నిద్ర పడుతున్నట్లు అధ్యయనంలో వెల్లడైంది. కేవలం శారీరక ఆరోగ్యం మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కూడా వ్యాయామం ఉపయోగపడుతుందట. ఈ పరిశోధన కోసం సుమారు 4400 మందిని ఎంచుకొని వారానికి ఎన్నిసార్లు, ఎంతసేపు, ఎంత తీవ్రతతో వ్యాయామం చేస్తున్నారు, నిద్రలేమి లక్షణాలు ఎలా ఉన్నాయి.? లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. అలాగే రాత్రిపూట ఎంతసేపు పడుకుంటున్నారు.? అనే విషయాలను పరిశీలించి ఈ విషయాలను వెల్లడించారు. వారానికి కనీసం రెండు, అంతకన్నా ఎక్కువసార్లు వ్యాయామం చేసేవారిని చురుకుగా ఉన్నవారిగా పరిగణనలోకి తీసుకుని వారి నిద్రకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఇలాంటి వారిలో నిద్రలేమి ముప్పు 42శాతం తక్కువగా ఉంటోందని గుర్తించారు. అలాగే వీరిలో నిద్రలేమి లక్షణాలు 22-40శాతం వరకు తక్కువగా ఉన్నట్టు పరిశోధనల్లో తేలింది.

నేడు వర్షసూచన !

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మంగళవారం పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ సూచించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పలుచోట్ల పడే సూచనలున్నట్టు తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షం కురిసే సూచనలున్నాయని హెచ్చరించింది. బుధ, గురు, శుక్రవారాల్లో కూడా ఆయా జిల్లాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం పడే అవకాశాలున్నాయి. హైదరాబాద్ పరిధిలో రాబోయే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వాన పడే అవకాశముంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 39, కనిష్ట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీల మేర నమోదయ్యే సూచనలున్నాయి. ఈ నేపథ్యంలో కొంత మేర ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశాలున్నాయి. సోమవారం రాష్ట్రంలో అత్యధికంగా గుళ్లకోట, అల్లీపూర్ (జగిత్యాల)ల్లో 46.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఆదివారంతో పోలిస్తే కొంతమేర ఉష్ణోగ్రతలు తగ్గాయి. అయితే, ఉబ్బరం మాత్రం తీవ్రస్థాయిలో ఉంది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

గుళ్లకోట (జగిత్యాల)	46.8 డిగ్రీలు
అల్లీపూర్(జగిత్యాల)	46.8 డిగ్రీలు
ముత్తారం(పెద్దపల్లి)	46.4 డిగ్రీలు
కొల్వాయి(జగిత్యాల)	46.4 డిగ్రీలు
సుగ్లంపల్లి (పెద్దపల్లి)	46.3 డిగ్రీలు

అచ్ఛేదిన్ కాదు.. చచ్చేదిన్

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టు చేసి జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను భయపడను. కాంప్రమైజ్ కాను. ఎట్టి పరిస్థితుల్లోనూ పోరాటం చేస్తానే తప్ప కేసీఆర్ ఏనాడూ లొంగిపోలేదు. ఇప్పుడు కూడా లొంగిపోయే ప్రసక్తే లేదు. ఆరు నూరైనా సరే లొంగిపోను" అని స్పష్టం చేశారు.

బోనస్.. ఓ బోగస్..

ఆరు గ్యారంటీ హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్.. వట్టి బోగస్ అని విమర్శించారు. 'సరైన సమయంలో రైతులకు రైతుబంధు వేయలేదు. కేసీఆర్ రోడ్డెక్కడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు వేయడం ప్రారంభించింది' అని తెలిపారు.

14 ఎంపీ స్థానాలు గెలిస్తే తెలంగాణ కీలకం

మోడీకి మెజార్టీ వస్తలేదు.. ఎన్డీఏ కూటమికి 250 కి మించి సీట్లు రావు.. మనం 14 ఎంపీ స్థానాలు గెలిస్తే కేంద్ర రాజకీయాల్లో తెలంగాణ కీలకంగా మారుతుందని కేసీఆర్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ గవర్నమెంట్ రాదని, ప్రాంతీయ శక్తులు ఏర్పాటు చేసే గవర్నమెంటే వస్తదని, అప్పుడు బీఆర్ఎస్ కీలక పాత్ర అయితదని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేష్ గుప్త, జెడ్పీ చైర్మెన్ విఠల్‌రావు, మేయర్ దండు నీతూ కిరణ్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీతో దేశ సమైక్యతకు ముప్పే

(మొదటిపేజీ తరువాయి)

దేవుణ్ని, రాముణ్ని చూపి ఓట్లడగడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. రాజకీయాల్లో విలువలు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 13న పోలింగ్ జరిగే ఎన్నికల్లో పోటీ చేసే వారిలో 246 మంది అభ్యర్థులు హత్యలు, లైంగికదాడులకు పాల్పడిన వారున్నారని వివరించారు. రాజకీయాలు వ్యాపార మయమయ్యాయని చెప్పారు. ఎన్నికల్లో పెట్టిన పెట్టుబడిని గెలిచిన తర్వాత రాబట్టుకునే పనిలో రాజకీయ నాయకులుంటున్నారని అన్నారు. రాజకీయాల్లో విలువలను పున:ప్రతిష్ట చేయాల్సిన అవసరముందన్నారు. పార్లమెంటులో సీపీఐ(ఎం), వామపక్షాల ప్రాతినిధ్యం పెరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలను ప్రభావితం చేయగలిగేలా క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని అన్నారు.



కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్లు మాఫీ

గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు పెరిగాయని వీరయ్య చెప్పారు. ధరల నియంత్రణలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గితే దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలతోపాటు నిత్యావసరాల ధరలు పెరిగాయని అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్నారనీ, పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలివ్వాలని చెప్పారు. కానీ నిరుద్యోగం తీవ్రంగా పెరిగిందన్నారు. రైతులకు పంటలకు మద్దతు ధర అడిగితే దాడులు చేస్తున్నారని చెప్పారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్నారనీ, అది నెరవేరలేదని అన్నారు. కానీ కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్లు రుణాలు మాఫీ చేశారని విమర్శించారు. అదానీ, అంబానీ ఆస్తులు విపరీతంగా పెరిగాయన్నారు. రూ.53 వేల కోట్లున్న అదానీ ఆస్తి నేడు రూ.17 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. అదానీ అక్రమంగా సంపాదించారంటూ ఆధారాలతో సహా బయటపెట్టినా మోడీ ప్రభుత్వం కనీసం విచారణకు ఆదేశించలేదని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేస్తున్నారనీ, ఎల్ఐసీ, స్టీల్‌ప్లాంట్ వంటి వాటిని ప్రయివేటుపరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సవరణ బిల్లు అమల్లోకి వస్తే ఉచిత కరెంటు ఉండబోదని చెప్పారు. ప్రజలకు సబ్సిడీలు ఎత్తేస్తారనీ, కరెంటు బిల్లులు రెండు, మూడు రెట్లు పెరుగుతాయని అన్నారు. రవాణారంగం సవరణ చట్టం తెచ్చారనీ, దీంతో భవిష్యత్తుల్లో ఆర్టీసీలు మిగిలే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికే ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశారని గుర్తు చేశారు.

రాచరిక పాలనవైపు మోడీ అడుగులు

మోడీ ప్రభుత్వం నిరంకుశ విధానాలను అవలంబిస్తున్నదని వీరయ్య విమర్శించారు. స్వతంత్రంగా పనిచేయాల్సిన ఈడీ, సీబీఐ వంటి రాజ్యాంగ సంస్థలు బీజేపీకి అనుకూలంగా ఉంటున్నాయని అన్నారు. ప్రశ్నించే వారి మీద దాడులు చేస్తున్నాయని చెప్పారు. బీజేపీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. దారికొస్తావా? లేదా అరెస్టు చేయాలా? అనే పద్ధతిని పాటిస్తున్నదని అన్నారు. అందులో భాగంగానే కేజ్రీవాల్, హేమంత్ సోరెన్, కవితను అరెస్టు చేశారని వివరించారు. బ్లాక్‌మెయిలింగ్‌లో భాగమే సీఎం రేవంత్‌రెడ్డికి నోటీసులిచ్చారని చెప్పారు.

ఒకే దేశం, ఒకే ఎన్నికలు, ఒకే నాయకుడు, ఒకే రాజు అంటూ నిరంకుశ పాలనవైపు, రాచరిక పాలనవైపు మోడీ అడుగులు వేస్తున్నారని విమర్శించారు. బీజేపీ మ్యానిఫెస్టోలో చివరి పేజీలో మోడీ రాజదండం పట్టుకుని ఉన్న ఫొటో ముద్రించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఆ పార్టీ మళ్లీ గెలిస్తే ఇవే చివరి ఎన్నికలు, లేదా నామమాత్రం అవుతాయన్న చర్చ బలంగా ఉందన్నారు. మెజార్టీ మతం ఓట్లు పొందాలని కుట్ర చేస్తున్నదని అన్నారు. మోడీని ఓడించడం కోసమే ఇండియా కూటమి ఏర్పడిందన్నారు. ఆ దిశగానే ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నదని చెప్పారు. సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. రాష్ట్రంలో భువనగిరిలో సీపీఐ(ఎం)ను, మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విలేకర్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కె విరాహత్ అలీ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఐదేండ్లలో ఓ బ్రిడ్జి కూడా కట్టలే

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పది సంవత్సరాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సొమ్మును దోచుకుంటూ దోపిడీ చేశాయని తెలిపారు. అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పదేండ్లు ప్రధానిగా ఉన్న మోడీ ఈ ప్రాంతానికి పది పైసలు కూడా ఇయ్యకుండా ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు కర్మాగారం నిర్మించలేదని, మెట్రోను పొడిగించలేదని, నగరానికి వరదలు వస్తే కనీసం నిధులు విడుదల చేయలేదని, ఐటీఆర్ ప్రాజెక్టును గుజరాత్‌కు తరలించుకు పోయారని, రాష్ట్రానికి రావాల్సిన రైల్వే కోచ్ కూడా గుజరాత్‌కి తీసుకెళ్లారని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ సర్కారు ఉన్నప్పుడు ఐటీఐఆర్ కారిడార్ కోసం అనుమతులిస్తే.. వాటిని మోడీ రద్దు చేశారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఆరు గ్యారంటీలు కేటీఆర్‌కు కనబడకపోతే చీర కట్టుకొని చింతమడక నుంచి సిరిసిల్ల వరకు బస్సు ఎక్కితే.. అమలు అవుతున్నాయో లేదో తెలుస్తుందన్నారు. బీఆర్ఎస్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి దాన నాగేందర్, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి, సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నాయకులు, దశరథ్, మహేందర్, రాములు, షబానా, కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్లు గరిగంటి శ్రీదేవి రమేష్, పులి జగన్, దిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఫ్లైఓవర్ గురించి ఈటల కేంద్రాన్ని అడిగారా..

గతంలో మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ బలహీనవర్గాల కోసం ఏమైనా చేశారా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఉప్పల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. పంపకాల్లో తేడాలొచ్చి బీఆర్ఎస్ నుంచి రాజేందర్ బయటకు వచ్చారని, ఉప్పల్‌లో పనులు నిలిచిపోయిన ఫ్లైఓవర్ గురించి కేంద్రాన్ని ఎప్పుడైనా ఈటల అడిగారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పోటీలోనే లేదని, సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.269 కోట్ల నగదు, మద్యం పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

సోదాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు, బంగారం ఇతర వస్తువులు తీసుకెళ్లేటప్పుడు తగిన రశీదులు అందుబాటులో ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

రేవంత్‌కు రాజకీయ భవిష్యత్ శూన్యమే

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయాలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. వందల కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించామ న్నారు. నల్లగొండ ప్రజలారా ఒక్కసారి సైదిరెడ్డిని పార్లమెంటుకు పంపించండి, అభివృద్ధిని పెంచుకోండి అని అన్నారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి పెరిగింది కానీ, అభివృద్ధి పెరగలేదని విమర్శించారు. రిజర్వేషన్లు రద్దు చేసే ప్రసక్తే లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు మాదగోని శ్రీనివాస్‌గౌడ్, రామచందర్‌రావు, సంకినేని వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు డాక్టర్ వర్షిత్‌రెడ్డి, హనుమంతరెడ్డి శ్రీదేవి రెడ్డి పాల్గొన్నారు.

కవితకు మళ్లీ నిరాశే

(మొదటిపేజీ తరువాయి)

స్వభావం, నిందితుడి పలుకుబడి' ఆదేశాలను ఆర్డర్ కాపీలో పొందుపరిచింది. ఇందుకు విరుద్ధంగా కవితపై ఆరోపణలు ఉన్నాయని స్పష్టం చేసింది. అలాగే కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం వర్సెస్ సీబీఐ, విజయ మదన్ లాల్ చౌదరి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, ప్రశాంత్ సింగ్ భాటి వర్సెస్ ఎన్సీటీ ఢిల్లీ, నిమ్మగడ్డ ప్రసాద్ వర్సెస్ సీబీఐ, సత్యేంద్ర కుమార్ జైన్ వర్సెస్ ఈడీ, ఇతర కేసులను ప్రస్తావించింది. అందువల్ల న్యాయపర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుతం కేసు దర్యాప్తు స్టేజ్‌లో కవితకు బెయిల్ ఇవ్వలేమని తేల్చి చెప్పింది. కేంద్ర దర్యాప్తు సంస్థల వాదనలతో ఏకీభవిస్తూ కవిత దాఖలు చేసిన రెండు వేర్వేరు బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తున్నట్టు వెల్లడించింది. లిక్కర్ స్కాం కేసులో కవిత 'కింగ్ పిన్' గా పేర్కొన్న దర్యాప్తు సంస్థల వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ఇప్పుడు బెయిల్ ఇస్తే ఆధారాలు, సాక్ష్యాలను కవిత తారుమారు చేసే అవకాశం ఉందన్న వాదనతో ఏకీభవించింది. కవిత బయటకు వస్తే కేసు దర్యాప్తు ప్రభావితం అవుతుందని భావిస్తున్నట్టు తీర్పులో పొందుపరిచింది.

రైతులకు గుడ్‌న్యూస్

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల కమిషన్ అనుమతివ్వడంతో నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15,814 ఎకరాల్లో పంట నష్టానికి గాను 15,246 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ. 15.81 కోట్ల నిధులు విడుదల చేసింది. అత్యధికంగా కామారెడ్డిలో 10,328.04 ఎకరాలు, అత్యల్పంగా సంగారెడ్డిలో 76.04 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ గుర్తించిన లబ్దిదారులకు త్వరలో బ్యాంకుల ద్వారా పరిహారం అందించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

రాజ్యాంగంపై బీజేపీ వైఖరేంటి?

- టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాజ్యాంగంపై బీజేపీ వైఖరేంటని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ గెలిస్తే రాజ్యాంగ పీఠికను సవరిస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ అన్నారని గుర్తుచేశారు. రాజ్యాంగ పీఠికను, సెక్యులర్ పదాన్ని మార్చబోమంటూ ఆ పార్టీ సీనియర్ నాయకులు రాజ్‌నాథ్‌సింగ్ ఇప్పుడు ప్రజలను నమ్మించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు.



అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్

రైతుబంధుపై కాకిలా అరుస్తున్న కేసీఆర్ :
డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ - బోనకల్

అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ పుట్టిందని, రైతుబంధుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాకిలా అరుస్తున్నారని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సీపీఐ(ఎం), సీపీఐ బలపరుస్తున్న ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డితో కలిసి బోనకల్ మండల కేంద్రంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఖమ్మం జిల్లాలో కలిశారని, మరో పార్టీ అభ్యర్థికి ఇక్కడ స్థానం లేదని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతవుతుందని, ఒక్క సీటు కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు. రాజీవ్, ఇందిరాసాగర్ ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో అంచనాలను రూ.25 వేల కోట్లకు పెంచి ఖమ్మం జిల్లాకు చుక్క నీరు ఇవ్వని దుర్మార్గుడు కేసీఆర్ అని విమర్శించారు. పదేండ్లు పాలించిన మీరు ఏనాడైనా మొదటి వారంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వేశారా అని ప్రశ్నించారు.

జిల్లాలో ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య నువ్వా నేనా అన్నట్టు పోటీ ఉండేదని, ఇవాళ కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని అన్నారు. ఈ కూటమికి తెలుగు తమ్ముళ్లు సైతం మద్దతు ఇస్తున్నారని వివరించారు. ఖమ్మం జిల్లా భూములను సస్యశ్యామలం చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రూ.1400 కోట్లతో రాజీవ్, ఇందిరా సాగర్ ఎత్తిపోతల పథకాలు చేపడితే, బీఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ పేరుతో రూ.25 వేల కోట్లకు అంచనాలు పెంచిందని చెప్పారు. ఇప్పటి వరకు రూ.8 వేల కోట్లు ఖర్చు చేసి చుక్క నీరు అందించలేదన్నారు. రాజీవ్, ఇందిరా సాగర్ ఎత్తిపోతల పథకాలు పూర్తిచేసి ఖమ్మం జిల్లా రైతుల కాళ్లు కడుగుతామన్నారు. మొదటి దశలో రూ.5 లక్షలతో ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లను చేపట్టనున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.ఆరు లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని తెలిపారు.

అయోధ్య రాముడు పేరుతో మోడీ రాజకీయాలు
రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి

అయోధ్య రాముడి పేరుతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజకీయాలు చేస్తున్నారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని, లక్ష 50 వేల కోట్ల రాష్ట్ర సంపదను కేసీఆర్ దోచుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ వయసుకు తగ్గట్టుగా మాట్లాడాలని హితవు పలికారు. గత సంవత్సరం నాగార్జున సాగర్ నుంచి రైతులకు సాగునీరు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని, సాగర్ నీటిని ఆంధ్ర ప్రాంతానికి ఇచ్చిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. బీజేపీకి బీ టీం బీఆర్ఎస్ అన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి రామసహాయం రాఘురామిరెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, సీపీఐ జాతీయ నాయకులు బాగం హేమంత్‌రావు మాట్లాడారు.

పోరాడే శక్తులకు బలమివ్వండి

రామన్నపేట రోడ్‌షోలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



(మొదటిపేజీ తరువాయి)

ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని, 140 కోట్ల జనాభా భవిష్యత్‌కు సంబంధించిన కీలకమైన ఎన్నికలని అన్నారు. బీజేపీ పదేండ్ల కాలంలో ప్రజల మధ్య వైషమ్యాలను పెంచిపోషించిందని, అందుకే ఆ పార్టీని ఓడించడానికి దేశంలోని 28 పార్టీలు ఒక్కటై పోరాడుతున్నాయని చెప్పారు. ఇటీవల మోడీ "ఇప్పటివరకు మేము చూపించింది ట్రైలర్ అని.. ఈసారి గెలిస్తే అసలు సినిమా చూపిస్తామంటున్న" దాంట్లో ఏముందో అర్థం చేసుకోవాలన్నారు. రామరాజ్యం తెస్తామంటే తప్పే ముందని పొరపాటున కూడా అనుకోవద్దని, హిందూ రాజ్యం అంటే అగ్రకులాల ఆధిపత్య రాజ్యమని, దేశ సంపదను దోచుకుపోయే రాబందుల రాజ్యం తప్ప మరొకటి కాదని తెలిపారు. దేశంలోని అనేక సామాజిక తరగతులు, వర్గాలకు సమాన హక్కులు లభించాల్సి ఉందని, అందుకోసం తాము నిరంతరం పోరాడుతూనే ఉన్నామని అన్నారు.

ఇప్పటివరకు జనాభా, కుల గణన చేపట్టలేదని, రిజర్వేషన్లు రద్దు చేయడానికి బీజేపీ ప్రయత్నాలు మొదలు పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) 63 మంది ఎంపీలతో ఉన్న సమయంలో నాటి ప్రభుత్వాన్ని నిలదీసి దేశంలోని లక్షలాది మంది కూలీలకు ఉపాధినివ్వడానికి ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. బడుగు, బలహీన, పేద రైతులు, కార్మికులకు ఉపయోగపడే అనేక చట్టాలను పోరాడి సాధించామన్నారు. గిరిజనులకు, ఆదివాసులకు లక్షలాది ఎకరాల భూమిని ప్రభుత్వం ద్వారా పంపిణీ చేయించి పట్టాలిప్పించామని చెప్పారు. రాజకీయాలను కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ భ్రష్టు పట్టించాయని, ఫిరాయింపులను ప్రోత్సహించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వారు ఓటు అడగడానికి వస్తే ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారంటీని కూడా అడగాలని, మీ అభ్యర్థులు గెలిస్తే బీజేపీలోకి వెళ్లరనే గ్యారంటీ ఇవ్వాలని అడగాలని అన్నారు. బూర నర్సయ్యగౌడ్ బీసీ అని ముందుకు వస్తున్నారని, ఆయన బీసీ అయినా.. బీసీలను అణగదొక్కే అగ్రవర్ణాల పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్న విషయం మరువొద్దన్నారు.

పోరాడే వ్యక్తులకు, శక్తులకు బలాన్ని ఇవ్వాలని, ఆ వ్యక్తుల, శక్తుల చేతికి ఆయుధాన్ని ఇవ్వాలని.. అలా ఇస్తే మరింత పదునుగా పోరాడతారని చెప్పారు. అందుకే కమ్యూనిస్టులను చట్టసభల్లోకి పంపించాలని, మచ్చలేని జహంగీర్‌ను భువనగిరి నుంచి గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని, సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. భువనగిరి పేరు ప్రతిష్టలు నిలపాలని వేడుకున్నారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు తెలిసిన జహంగీర్‌తోనే పరిష్కారం కూడా సాధ్యమన్నారు. గతంలో రామన్నపేట నియోజకవర్గంగా ఉండి అనేక డివిజనల్ ప్రభుత్వ ఆఫీసులు ఉండేవని, ప్రస్తుతం ఒక్కొక్కటి మాయమవుతున్నాయన్నారు. ప్రభుత్వాస్పత్రి 50 ఏండ్లు పూర్తిచేసుకుని శిథిలావస్థకు చేరిందన్నారు. 30 మంది డాక్టర్లకు ముగ్గురు కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సమస్యలతో సతమతమవుతున్న ఈ ప్రాంతం అభివృద్ధి కావాలంటే జహంగీర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు నల్లగొండ చిట్యాల పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో తమ్మినేని, చెరుపల్లి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి మహమ్మద్ జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్‌రెడ్డి, కల్లూరి మల్లేశం, ఆనగంటి వెంకటేశం, నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, జల్లెల పెంటయ్య, కూరెళ్ళ నర్సింహాచారి, మామిడి వెంకట్‌రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్, జిల్లా అధ్యక్షులు గంటెపాక శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేకి, మతోన్మాద బీజేపీని ఓడించండి

సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ని గెలిపించండి : సీఐటీయూ ఆల్ ఇండియా కోశాధికారి ఎం.సాయిబాబు



నవతెలంగాణ-భువనగిరి

మతోన్మాద, కార్మిక వ్యతిరేకి బీజేపీని ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని, పేదల పక్షపాతి సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఐటీయూ ఆలిండియా కోశాధికారి ఎం.సాయిబాబు పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులలో ఎండీ జహంగీర్ 35 ఏండ్లుగా ప్రజా ఉద్యమాల్లో ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి అని,మిగతా అభ్యర్థులు వందల కోట్ల డబ్బులు సంపాదించి పదవుల కోసం రాజకీయాలకు వచ్చారని తెలిపారు.ఎన్నికలలో కార్మిక వర్గం చైతన్యయుతంగా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. చట్టాలను రద్దుచేసి.. నాలుగు లేబర్ కోడ్లు తెచ్చి.. పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచి.. కార్మికుని రోజువారి వేతనం రూ.178 మాత్రమే సరిపోతుందని చెప్పిన మతోన్మాద, కార్పొరేట్ బీజేపీ అభ్యర్థులను ఓడించాలని అన్నారు. ఫ్యూడల్ వ్యవస్థ విధానాల ను అవలంబిస్తూ కార్మికులను, ప్రజలను బానిసత్వం వైపు తీసుకెళ్లాలని బీజేపీ చూస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రతి కార్మికుని సమస్యపైనా,ఆశా,అంగన్‌వాడీ,మధ్యాహ్నం భోజనం గ్రామపంచాయతీ కార్మికులు ఇలా అన్ని రంగాల కార్మికులకు అండగా నిలబడి పోరాడిన జెండా సీఐటీయూ అని గుర్తు చేశారు. భువనగిరి పార్లమెంట్‌లో పోటీ చేస్తున్న ఎండీ. జహంగీర్‌కు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని చెప్పారు.జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్మికులకు సూచించారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం, జిల్లా సహాయ కార్యదర్శి మాయకృష్ణ, ఐద్వా రాష్ట్ర నాయకులు ఆశాలత, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, నాయకులు గాడి శ్రీను ఉన్నారు.

ప్రతి పథకాన్నీ అమలు చేసి తీరుతాం..

- రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి : సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి



నవతెలంగాణ-పెద్దఅడిశర్లపల్లి

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లోని ప్రతి పథకాన్నీ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. మతతత్వ రాజకీయాలు, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. నల్లగొండ లోక్‌సభకు వామపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల బతుకుల్లో వెలుగులు నింపామని, గ్రామాల అభివృద్ధి జరిగిందని అన్నారు. వామపక్షాలతో కలిసి తాగు, సాగునీటి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశామన్నారు. త్వరలోనే ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని, కాలువను పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే రెండు పడక గదుల ఇండ్లు, రూ.2 లక్షల రుణమాఫీ, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, సీపీఐ(ఎం) నాయకులు కంబాలపల్లి ఆనంద్, సీపీఐ నాయకులు కలకొండ కాంతయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వీరబోయిన ఎల్లయ్యయాదవ్, యువనేత డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



భిన్న కాన్సెప్ట్‌తో భలే ఉన్నాడే

రవికిరణ్ ఆర్ట్స్ బ్యానర్‌పై ఎన్‌వి కిరణ్ కుమార్ నిర్మాణంలో జె శివసాయి వర్ధన్ దర్శకత్వంలో హీరో రాజ్ తరుణ్ నటిస్తున్న 'భలే ఉన్నాడే' చిత్రానికి దర్శకుడు మారుతి ప్రజెంటర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను ఆయన గ్రాండ్‌గా లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ,'ఇది కాన్సెప్ట్ ఫిల్మ్.. ప్రేక్షకులని థియేటర్స్‌కి రప్పించే ఫిల్మ్. ఇది మన మధ్యలో జరిగే ఒక కథలా ఉంటుంది. మనిషా చాలా చక్కగా నటించింది. శివసాయి చాలా ప్యాషన్ ఉన్న దర్శకుడు. శేఖర్ చంద్ర మంచి పాటలు ఇచ్చారు. ఇద్దరు డీవోపీలు ది బెస్ట్ వర్క్ ఇచ్చారు. దాదాపు ఇండస్ట్రీలో ఉన్న ఆర్టిస్టులు అందరూ ఉన్నారు. తమిళ్ నుంచి కూడా వీటీ గణేషన్ లాంటి నటులు తీసుకొచ్చారు. మంచి కంటెంట్‌తో రాబోతుంది ఈ సినిమా. చిన్న సినిమాగా విడుదలై పెద్ద సినిమా అవ్వబోతుంది. రెండు రీళ్ళు చూశాను. ఫ్లో చాలా బావుంది. ఈటీవీ విన్, ఆదిత్య మ్యూజిక్‌కి థ్యాంక్స్' అని తెలిపారు.

'టీజర్ మీ అందరికీ నచ్చడం ఆనందంగా ఉంది. సినిమా కూడా ఖచ్చితంగా నచ్చుతుంది. త్వరలోనే రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తాం' అని హీరో రాజ్ తరుణ్ చెప్పారు. దర్శకుడు జె శివసాయి వర్ధన్ మాట్లాడుతూ,'ఇది నా మొదటి సినిమా. శేఖర్ చంద్ర చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. నగేష్ బానెల్లా వండర్ ఫుల్ విజువల్స్ ఇచ్చారు. ఈ సినిమా ఖచ్చితంగా అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది' అని అన్నారు. 'నన్ను ఎప్పుడూ ప్రోత్సహించే మారుతికి ధన్యవాదాలు. ఈ సినిమాలో షాకింగ్ కామెడీ ఉంటుంది. చాలా కొత్తగా ఉంటుంది. కంటెంట్‌తో ఉండే సాంగ్స్ ఉన్నాయి. చాలా కొత్తగా ప్రయత్నించాం' అని మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర చెప్పారు.

నిర్మాత రవికిరణ్ మాట్లాడుతూ,'ఈ సినిమా చాలా బావొచ్చింది. దర్శకుడు అద్భుతంగా తీశారు. ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులకు పైసా వసూల్ సినిమా అవుతుంది' అని తెలిపారు.

నవచిత్రం

ఘనంగా డి.ఎస్.ఆర్.ఫిల్మ్ అవార్డ్స్



దర్శకరత్న దాసరి 77వ జయంతిని పురస్కరించుకుని శిల్పకళావేదికలో దర్శకరత్న డి.ఎస్.ఆర్. ఫిల్మ్ అవార్డ్స్ ఘనంగా జరిగింది. సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిత్రసీమకు ఎటువంటి సహకారం కావాల్సినా తెలంగాణా ప్రభుత్వం ముందుంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దాసరి లెజండరీ నటుడు అవార్డు అందుకున్న మోహన్ బాబు మాట్లాడుతూ, "దర్శక కులానికి గౌరవం తెచ్చిన వ్యక్తి దాసరి. ఆయన పేరిట నెలకొల్పిన అవార్డు అందుకోవడం గర్వంగా భావిస్తున్నాను' అని అన్నారు.

దాసరి లెజండరి డైరెక్టర్ అవార్డును దర్శకులు కోదండరామిరెడ్డి, లెజండరీ ప్రొడ్యూసర్ అవార్డును అల్లు అరవింద్, లెజండరీ డిస్ట్రిబ్యూటర్ అవార్డును దిల్ రాజు, దాసరి లెజండరి ఫిలాంత్రఫిస్ట్ అవార్డును నటులు మురళీమోహన్, లెజండరీ స్టోరీ రైటర్ అవార్డ్‌ను పరుచూరి బ్రదర్స్ తరఫున పరుచూరి గోపాలకృష్ణ, లెజండరీ ఎగ్జిబిటర్ అవార్డును సునీల్ నారంగ్, లెజండరీ లిరిక్ రైటర్ అవార్డును చంద్రబోస్ తరఫున వారి సతీమణి సుచిత్ర చంద్రబోస్, లెజండరీ జర్నలిస్ట్ అవార్డును మాడభూషి శ్రీధర్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న దాసరి టీమ్ మెంబర్స్‌లో పదిమందికి పదివేలు చొప్పున నగదు సాయం అందించారు. ప్రభు, నిహారిక తమదైన వ్యాఖ్యానంతో ఈ కార్యక్రమాన్ని రక్తి కట్టించారు.

సత్య ట్రైలర్ అదుర్స్

శివమ్ మీడియా నిర్మాణ సంస్థ నుండి విడుదల అవుతున్న తొలి సినిమా 'సత్య'. ఈచిత్ర ట్రైలర్ సోమవారం 8 మంది దర్శకుల చేతుల మీదుగా రిలీజ్ అయ్యింది. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్లు, టీజర్‌కు ప్రేక్షకుల నుండి విశేష స్పందన లభించింది. ఈ సినిమాని ఈనెల 10న రిలీజ్ చేస్తున్నట్టు చిత్ర బృందం తెలిపారు.



ప్రార్థన సందీప్, హమరేష్

డైరెక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ, 'హమరేష్ చూడడానికి జి.వి. ప్రకాష్ లాంచ్ అయినప్పుడు ఎలా ఉన్నాడో అలా ఉన్నాడు. నిర్మాత శివ మల్లాల నా కెరీర్ మొదలుపెట్టినప్పటి నుండి తెలుసు, నన్ను జనాలకి చూపించ డానికి ఫొటోస్ తీసేవారు, నా మొహమాటాన్ని కూడా దాటి శివ కోసం ఫొటోస్ దిగేవాడిని. ఆయనకి ఈ సినిమా పెద్ద సక్సెస్ తీసుకుని రావాలని కోరుకుంటున్నాను సినిమాలో సరస్వతి ఉన్నారు కాబట్టి, ఈ సినిమాతో మా శివ మల్లాల కి లక్ష్మి కూడా రావాలి' అని కోరుకుంటున్నాను అన్నారు. 'శివ మల్లాల ఒక చిన్న ఫోటోగ్రాఫర్‌గా వచ్చి ఈరోజు ఒక నిర్మాతగా ఎదిగాడు. చాలా మంచి వ్యక్తి. అన్ని జనరేషన్స్ వాళ్ళతో మంచి రిలేషన్ మెయింటెన్ చేస్తాడు. చాలా తక్కువ డబ్బింగ్ సినిమాలు మాత్రమే విజయాన్ని అందుకుంటాయి. ఈ సినిమా విజువల్స్ చూస్తుంటే కచ్చితంగా సినిమా పెద్ద హిట్ అవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు' అని సీనియర్ జర్నలిస్ట్ ప్రభు చెప్పారు. దర్శకుడు వాలి మోహన్ దాస్ మాట్లాడుతూ, 'తమిళంలో ఈ సినిమాని నేను 'రంగోలి'గా తీసాను. ఇప్పుడు ఈ సినిమా తెలుగులో శివ మల్లాల ద్వారా 'సత్య'గా మీ ముందుకు రాబోతోంది. అందరూ చూసి మంచి సక్సెస్ చేస్తారని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

'ట్రైలర్ లాంచ్ మాట చెప్పడం కోసం ఎనిమిది మంది డైరెక్టర్స్ వచ్చారు అంటే చాలా హ్యాపీగా అనిపించింది. 10న ఈ సినిమాని గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం. తమిళంలో మాదిరిగా తెలుగులో ఈ సినిమా కచ్చితంగా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత శివ మల్లాల చెప్పారు.

ఆటలు

ఐపీఎల్‌లో నేడు
ఢిల్లీ X రాజస్థాన్
వేదిక : న్యూఢిల్లీ , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

శతకబాదిన సూర్య

- హైదరాబాద్‌పై ముంబయి గెలుపు
- హైదరాబాద్ 173/8, ముంబయి 174/3



నవతెలంగాణ-హైదరాబాద్

సూర్యకుమార్ యాదవ్ (102 నాటౌట్, 51 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. వాంఖడే స్లో పిచ్‌పై ఫటాఫట్ ఇన్నింగ్స్‌తో సన్‌రైజర్స్ బౌలర్లపై విరుచుకుపడిన సూర్యకుమార్ యాదవ్ ముంబయి ఇండియన్స్‌కు 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు. 174 పరుగుల ఛేదనలో సూర్యకు తోడుగా తిలక్ వర్మ (37 నాటౌట్, 32 బంతుల్లో 6 ఫోర్లు) సైతం రాణించగా 17.2 ఓవర్లలోనే ముంబయి లాంఛనం ముగించింది. రోహిత్ శర్మ (4), ఇషాన్ కిషన్ (9), నమన్ దిర్ (0) విఫలమయ్యారు. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (48, 30 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ పాట్ కమిన్స్ (35 నాటౌట్, 17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా 20 ఓవర్లలో 8 వికెట్లకు 173 పరుగులు చేసింది. వాంఖడే స్లో పిచ్‌పై ట్రావిశ్ హెడ్ (48), అభిషేక్ శర్మ (11) తొలి వికెట్‌కు 56 పరుగులు జోడించారు. పవర్‌ప్లేలో హెడ్ ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో వన్‌మ్యాన్ షో చూపించాడు. పవర్‌ప్లే తర్వాత సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌లో వేగం మందగించింది. మయాంక్ అగర్వాల్ (5), హెన్రిచ్ క్లాసెన్ (2), షాబాజ్ అహ్మద్ (10)లు విఫలమయ్యారు. నితీశ్ కుమార్ రెడ్డి (20), మార్కో జాన్సెన్ (17) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేదు. 96/5తో ఉన్న సన్‌రైజర్స్ ఓ దశలో 173 పరుగులు చేస్తుందని ఎవరూ అనుకోలేదు. అబ్దుల్ సమద్ (3) సైతం నిరాశపరిచినా కెప్టెన్ పాట్ కమిన్స్ (35 నాటౌట్) డెత్ ఓవర్లలో విలువైన పరుగులు జోడించాడు.

కప్పు వేటకు నయా జెర్సీ

టీ20 వరల్డ్‌కప్ భారత జెర్సీ ఆవిష్కరణ



ముంబయి : 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్ వేటలో భారత జట్టు ధరించే జెర్సీని కిట్ స్పాన్సర్ ఆడిడాస్ సోమవారం ఆవిష్కరించింది. సంప్రదాయ బ్లూ, ఆరెంజ్ రంగులో ఉన్న జెర్సీకి ఆడిడాస్ త్రీ స్ట్రిప్స్ తెలుగు రంగులో ఉన్నాయి. కాలర్‌కు మువ్వెన్నల జెండా రంగులను ఉంచారు. కొత్త జెర్సీపై అభిమానులు మిశ్రమ స్పందన వ్యక్తం చేస్తున్నారు. 2019 వరల్డ్‌కప్‌లో భారత జట్టు ధరించిన జెర్సీనే అటుఇటుగా మార్చి కొత్తగా విడుదల చేశారని విమర్శిస్తున్నారు. టీ20 ప్రపంచకప్ కరీబియన్, యుఎస్ వేదికగా జూన్ 2 నుంచి ఆరంభం కానున్న సంగతి తెలిసిందే.

మియామి విజేత నోరిస్

లాండో ఖాతాలో తొలి ఎఫ్1 టైటిల్



మియామి : మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ అద్భుతం చేశాడు. ట్రిపుల్ ఒలింపిక్, రెడ్‌బుల్ స్టార్ డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్‌ను నిలువరించి మియామి గ్రాండ్ ప్రీ ఎఫ్1 రేసు విజేతగా అవతరించాడు. 57 ల్యాప్స్‌లో 308.37 కిమీలను 1.30.49.876 సెకండ్లలో పూర్తి చేసిన లాండో నోరిస్ మియామి ఫార్ములా వన్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. లాండో నోరిస్ కెరీర్‌లో ఇదే తొలి ఫార్ములా వన్ రేసు టైటిల్ కావటం విశేషం. మాక్స్ వెర్‌స్టాపెన్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 'గత ఐదారేండ్ల కెరీర్‌లో ఎన్నో పొరపాట్లు చేశాను. కానీ ఈ రోజు అవన్నీ సరిదిద్దుకుని ముందుకెళ్లాను. కఠినమైన రేసు గెలవటం పట్ల ఎంతో గర్వపడుతున్నాను' అని లాండో నోరిస్ ఆనంద పరవశంతో చెప్పాడు.

మనిక సంచలనం

వరల్డ్ నం.2 వాంగ్‌పై గెలుపు



జెడ్డా (సౌదీ అరేబియా) : ఇటీవల భారత టాప్ ర్యాంక్ ప్లేయర్ హోదా కోల్పోయిన మనిక బత్ర.. సౌదీ స్మాష్ 2024లో సంచలన ప్రదర్శన చేసింది. వరల్డ్ నం.2 వాంగ్ మన్యు (చైనా)పై 3-1తో (6-11, 11-5, 11-7, 12-10) మెరుపు విజయం సాధించింది. 37 నిమిషాల్లోనే చైనా ప్యాడర్లను చిత్తు చేసిన మనిక.. తొలి సెట్‌లో నిరాశపరిచినా వరుసగా మూడు సెట్లలో విజయం సాధించింది. క్వార్టర్‌ఫైనల్లో చోటు కోసం వరల్డ్ నం.14 నైనా (జర్మనీ)తో మనిక బత్ర నేడు పోటీపడనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో హర్మీత్ దేశాయ్, యశస్విని జోడీ ఐదో సీడ్ స్పెయిన్ జంటను షాకిచ్చారు. 11-5, 5-11, 3-11, 11-7, 11-7తో సంచలన విజయం నమోదు చేసి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు.

స్ప్రింటర్లు చలో పారిస్

మెన్స్, ఉమెన్స్ రిలే జట్ల అర్హత



న్యూఢిల్లీ : భారత మెన్స్, ఉమెన్స్ 4x400 రిలే పరుగు జట్లు 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. ప్రపంచ అథ్లెటిక్స్ రిలేలో మన అథ్లెట్లు మెరుపు ప్రదర్శనతో ఈ ఘనత సాధించారు. ఉమెన్స్ రిలే జట్టులో రూపల్, పూవమ్మ, జ్యోతిక, సుభాలు 3.29.35 సెకండ్లలో రేసు ముగించి రెండో స్థానంలో నిలిచారు. జమైకా 3.28.54తో అగ్రస్థానంలో నిలిచింది. మెన్స్ రిలే జట్టు అనాస్, మొహమ్మద్, రాజీవ్, జాకబ్‌లు 3.3.23 సెకండ్లలో రేసును పూర్తి చేశారు. హీట్స్‌లో యుఎస్ఏ (2.59.95) తర్వాతి స్థానంలో నిలిచిన భారత జట్టు ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ప్రతి హీట్స్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. జులై 26-ఆగస్టు 11 వరకు పారిస్ వేదికగా 2024 ఒలింపిక్స్ జరుగనున్న సంగతి తెలిసిందే.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఇండియన్ బ్యాంక్ ఫలితాలు ఆకర్షణీయం

- తగ్గిన స్థూల ఎన్‌పీఏలు
- నికర లాభాల్లో 55 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 55 శాతం వృద్ధితో రూ.2,247 కోట్ల నికర లాభాలు సాధించింది. బ్యాంక్ ఆదాయం పెరగడంతో పాటుగా మొండి బాకీలు తగ్గడం మెరుగైన ఫలితాలకు దోహదం చేసింది. 2022-23 ఇదే క్యూ4లో రూ.1,447 కోట్ల లాభాలను నమోదు చేసింది. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.14,238 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ4లో 19 శాతం ఎగిసి రూ.16,887 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆసుతలు 3.93 శాతానికి దిగివచ్చాయి. 2023 మార్చి ముగింపు నాటికి స్థూల ఎన్‌పిఎలు 5.95 శాతంగా ఉన్నాయి. కాగా.. 0.90 శాతంగా ఉన్న నికర నిరర్థక ఆస్తులు.. 2024 మార్చి ముగింపు నాటికి 0.43 శాతానికి పరిమితమయ్యాయి. గడిచిన క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) 9 శాతం పెరిగి రూ.6,015 కోట్లుగా చోటు చేసుకుంది. 2022-23 ఇదే క్యూ4లో ఎన్‌ఐఐ రూ.5,508 కోట్లుగా నమోదయ్యింది. 2023-24 మొత్తం ఆర్థిక సంవత్సరంలో ఇండియన్ బ్యాంక్ నికర లాభాలు 53 శాతం వృద్ధితో రూ.8,063 కోట్లకు పెరిగాయి. 2022-23లో రూ.5,282 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.52,085 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 22 శాతం పెరిగి రూ.63,482 కోట్లకు చేరింది. ఏడాదికేడాదితో పోల్చితే 2024 మార్చి ముగింపు నాటికి బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 11 శాతం పెరిగి రూ.6,88,000 కోట్లుగా నమోదయ్యాయి. కరెంట్ ఎకౌంట్ సేవింగ్ ఎకౌంట్ (కాసా) డిపాజిట్లు 8 శాతం వృద్ధి చోటు చేసుకుంది. స్థూల రుణాలు 13 శాతం పెరిగి రూ.5,33,773 కోట్లకు చేరాయి. 2023 మార్చి ముగింపు నాటికి స్థూల రుణాలు రూ.4,73,586 కోట్లుగా నమోదయ్యాయి. సోమవారం బీఎస్‌ఈలో ఇండియన్ బ్యాంక్ షేర్ 1.93 శాతం తగ్గి రూ.533.05 వద్ద ముగిసింది.

ఆగస్టులో దేశ వ్యాప్తంగా 4జీ సేవలు

- బీఎస్‌ఎన్‌ఎల్ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రభుత్వ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ వచ్చే ఆగస్ట్ నుంచి దేశ వ్యాప్తంగా 4జీ సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవడానికి సిద్ధం అవుతోంది. దేశంలో 4జి, 5జి సేవల కోసం బీఎస్‌ఎన్‌ఎల్ 1.12 లక్షల టవర్లను అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 4జీ సేవల కోసం 9,000 టవర్లను ఇన్‌స్టాల్ చేసింది. పూర్తిగా స్వదేశీ సాంకేతికతను ఉపయోగించి ఈ సేవలు అందించనున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్ వర్గాలు తెలిపాయి. 700 మెగాహెర్జ్ ప్రీమియం స్పెక్ట్రమ్ బ్యాండ్‌తో పాటు పైలట్ దశలో 2,100 మెగాహెర్జ్ బ్యాండ్‌లో రూపొందించిన 4జీ నెట్‌వర్క్ ద్వారా సెకనుకు 40-45 ఎంబి స్పీడ్‌తో ఇంటర్నెట్ ఉంటుందని అధికారులు తెలిపారు. నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్, ప్రభుత్వ టెలికాం రీసెర్చ్ ఆర్గనైజేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. 4జీ పైలట్ ప్రాజెక్ట్ పంజాబ్‌లో చాలా బాగా పని చేస్తోందని అధికారులు అంటున్నారు. గత 4-5 ఏండ్లుగా బీఎస్‌ఎన్‌ఎల్ 4జి సామర్థ్యమున్న సిమ్‌లను మాత్రమే విక్రయిస్తోంది.

ఎన్నికల వేళ ప్రయాణాలు 47 శాతం పెరగొచ్చు

- రెడ్‌బస్ అంచనా

హైదరాబాద్ : ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల వేళ తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణికుల సంఖ్యలో 47 శాతం పెరుగదల ఉండొచ్చని రెడ్‌బస్ అంచనా వేసింది. మే 13న ఒకే విడతలో జరగనున్న ఎన్నికల్లో తమ విలువైన ఓటుని వేసేందుకు ఓటర్లు ఇప్పటికే వారి ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొంది. దీంతో తమ ప్లాట్ ఫామ్‌లో టిక్కెట్ల బుకింగ్ గణనీయంగా పెరిగిందని రెడ్ బస్ పేర్కొంది. మే 10, 11, 12 తేదీల్లో తమ సొంత ఊర్లకు వెళ్లే వారి సంఖ్య దాదాపు 47 శాతం పెరుగుదల ఉంటుందని రెడ్ బస్ అంచనా వేసింది. బస్ ఆపరేటర్లు రోజుకు 3000 కంటే ఎక్కువ సర్వీసులను నడుపుతున్నారని పేర్కొంది.

బీఏఎస్‌ఎఫ్ నుంచి ఎఫికాన్ కీటకనాశిని



హైదరాబాద్ : ప్రముఖ వ్యవసాయ క్రిమిసంహారకాల కంపెనీ బిఎఎస్‌ఎఫ్ కొత్తగా ఎఫికాన్ కీటకనాశినిని విడుదల చేసింది. దీనిని సోమవారం హైదరాబాద్‌లో బిఎఎస్‌ఎఫ్ అగ్రికల్చర్ సొల్యూషన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రు సిమోన్ బర్గ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సిమేన్ మాట్లాడుతూ.. గుచ్చి తిను, రసంపీల్చు పురుగులను సమర్థవంతంగా నియంత్రించేందుకు ఎఫికాన్ మద్దతునిస్తుందన్నారు. ఎఫికాన్ కీటకనాశిని తొలిసారి 2023లో ఆస్ట్రేలియాలో అందుబాటులోకి తెచ్చామన్నారు. రైతులకు మద్దతునివ్వడానికి భూమిపై అతిపెద్ద పని అయిన కీటకాల నుంచి పంటలను రక్షించడం, ఉత్పాదకతను పెంచడమే భారీ సవాలును విజయవంతంగా ఎదుర్కొనేందుకు సహాయపడటానికి తమ నైపుణ్యాన్ని వినియోగిస్తున్నామన్నారు.

జీ మీడియా సీఈవో అభయ్‌కు ఉద్వాసన



న్యూఢిల్లీ : జీ మీడియా కార్పొరేషన్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా ఉన్న అభయ్ ఓజాను ఆ సంస్థ అనూహ్యంగా తొలగించింది. మే4న జరిగిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని జీ మీడియా సోమవారం రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. కాగా.. అభయ్ తొలగింపునకు కారణాలను వెల్లడించలేదు. 2022లో చీఫ్ బిజినెస్ ఆఫీసర్‌గా చేరిన ఓజా.. గతేడాది సిఇఒగా బాధ్యతలు స్వీకరించారు.

ఆరేండ్ల గరిష్టానికి పి నోట్స్

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లలో ఫిబ్రవరి ముగింపు నాటికి పార్టిసిపేటరీ నోట్స్ (పి-నోట్స్) పెట్టుబడులు రూ.1.5 లక్షల కోట్లతో.. ఆరేండ్ల గరిష్ట స్థాయికి ఎగిశాయి. ఎలాంటి రిజిస్ట్రేషన్, గుర్తింపు లేకుండా విదేశీ ఇన్వెస్టర్లు పి-నోట్స్‌లో పెట్టుబడులు పెడతారు. జనవరి ముగింపు నాటికి రూ.1,43,011 కోట్లుగా ఉన్న పి-నోట్స్.. ఫిబ్రవరి ముగింపు నాటికి రూ.1,49,517 కోట్లకకు చేరాయని సెబీ గణంకాలు వెల్లడించాయి. 2017 జూన్‌లో రూ.1.65 లక్షల కోట్లతో గరిష్ట పెట్టుబడులు నమోదయ్యాయి.

ఫోన్‌పే 'అక్షయ తృతీయ' క్యాష్‌బ్యాక్ ఆఫర్

న్యూఢిల్లీ : ప్రముఖ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ ఫోన్‌పే ఈ ఏడాది అక్షయ తతీయ సందర్భంగా క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. మే 10న యూజర్లు ఫోన్‌పే యాప్‌లో గోల్డ్‌ను కొనుగోలు చేస్తే రూ.2000 వరకు గ్యారంటీ క్యాష్‌బ్యాక్‌ను పొందవచ్చని పేర్కొంది. ఈ ఆఫర్‌ను పొందాలంటే కనీసం రూ.1000 విలువ చేసే గోల్డ్‌ను ఆర్డర్ చేయాలని తెలిపింది. ఇది 24 క్యారెట్ డిజిటల్ గోల్డ్ కొనుగోలుపై ఒకసారి మాత్రమే వర్తిస్తుందని వెల్లడించింది.

ప్రజ్వల్ తలెత్తుకోకుండా చేయాలి

బాధితురాలి సోదరి ఆగ్రహం





బెంగళూరు : రాసలీలల ప్రజ్వల్ రేవణ్ణకు విధించే శిక్ష ఆయన్ని తలెత్తుకొని తిరగకుండా చేయాలని అత్యాచార బాధితురాలి సోదరి మాల (పేరు మార్చడం జరిగింది) అభిప్రాయపడ్డారు. జేడీఎస్ ఎంపీ, హసన్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్డీఏ అభ్యర్థి ప్రజ్వల్ రికార్డు చేసిన మూడు వేల వీడియో క్లిప్పింగుల్లో బాధితురాలు మృదుల (పేరు మార్చడం జరిగింది) కూడా ఉన్నారు. అయితే ఆ విషయాన్ని మృదుల కుటుంబసభ్యులు గుర్తించే లోగానే రేవణ్ణ కుటుంబ సన్నిహితుడు సతీష్ బాబన్న ఆమెను కిడ్నాప్ చేసి తీసికెళ్లాడు. వీడియోల వ్యవహారాన్ని మృదుల బంధువులు, స్నేహితులు ఆమె కుమారుడి దృష్టికి తీసికెళ్లారు.

మృదుల, ఆమె భర్త ఇద్దరూ ప్రజ్వల్ తండ్రి హెచ్‌డీ రేవణ్ణ వ్యవసాయ క్షేత్రంలో పనిచేశారు. మూడు సంవత్సరాల క్రితం అక్కడ పని మానేసి గర్భిణిగా ఉన్న కుమార్తె బాగోగులు చూసుకోవడానికి మైసూరు జిల్లాలోని స్వగ్రామం వచ్చారు. 'ఆమె తనపై జరిగిన అత్యాచారం గురించి అప్పుడు కూడా ఎవరికీ చెప్పలేదు. మేము ఆమెను తిడతామేమోనని భయపడి ఉంటుంది. కానీ ఆమె అత్యాచారానికి గురైంది. ఆమె ఏ తప్పూ చేయలేదు. కానీ ప్రజలేమో ఆమెదే తప్పని అంటున్నారు. మా తప్పేమీ లేకపోయినా పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలియడం లేదు' అని మృదుల సోదరి మాల చెప్పారు.

సతీష్‌ను ఈ నెల 3న పోలీసులు అరెస్టు చేసి మృదులను కాపాడారు. ఆ మరునాడు బెంగళూరు తీసుకొచ్చారు. అదే రోజు హెచ్‌డీ రేవణ్ణను కూడా అరెస్టు చేశారు. రెండు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసినప్పటికీ ప్రజ్వల్ ఇంకా పరారీలోనే ఉన్నారు. కుటుంబసభ్యులు మృదులను చిట్టచివరి సారిగా గత నెల 24న చూశారు. సతీష్‌తో కలిసి వెళ్లిన మృదుల పోలింగ్ రోజు తిరిగి వచ్చారు. రెండు రోజుల తర్వాత సతీష్ మళ్లీ వచ్చి తనతో రావాలని మృదులను ఒత్తిడి చేశాడు. మృదులకు సంబంధించిన ఓ పోలీసు కేసుకు సంబంధించి మాట్లాడేందుకు రమ్మని హెచ్‌డీ రేవణ్ణ చెప్పారని తెలిపాడు. దీంతో ఆమె సతీష్ వెంట వెళ్లారు.

ఆ తర్వాత మృదులను కలిసేందుకు కుటుంబసభ్యులు ఎంతగానో ప్రయత్నించారు. అయితే మృదులను పోలీసులు అరెస్ట్ చేశారని, బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నామని సతీష్ వారికి చెప్పాడు. మృదులను బంధించి అత్యాచారం జరిపిన వీడియో బయటకు వచ్చిన తర్వాతే ఆమె కుమారుడికి విషయం తెలిసింది. మృదులను కిడ్నాప్ చేశారని అర్థం చేసుకున్న కుటుంబసభ్యులు ఈ నెల 2న కేఆర్ నగర పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. ప్రజ్వల్ రాజకీయ ప్రత్యర్థులు ఆ వీడియోలను పెన్‌డ్రైవ్‌లలో అప్‌లోడ్ చేసి హసన్ జిల్లాలోని పార్కులు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాపులు, దుకాణాల్లో పంపిణీ చేశారు. హసన్‌లో పోలింగుకు ముందు ఈ వీడియోలు వైరల్ అయ్యాయి.

మృదుల సోదరి మాలకు రేవణ్ణ, ప్రజ్వల్ గురించి పెద్దగా తెలియదు. ఆమె ఓ పండుగ కోసం గత నెల 29న స్వగ్రామానికి వచ్చారు. తమకు ఏ అవసరం వచ్చినా రేవణ్ణ భార్యను కలిసేవారమని, ఉద్యోగం ఉన్నదని సతీష్ చెప్పడంతో అంగీకరించామని అంటూ ఇలా జరుగుతుందని ఎవరు ఊహిస్తారు అని ఆవేదనతో ప్రశ్నించారు. మృదుల కుటుంబం రెండు గదులు చిన్న ఇంటిలో నివసిస్తోంది. కేసు నమోదైనప్పటి నుండి వారి ఇంటి వద్ద పోలీసులు కాపలాగా ఉన్నారు. ఇప్పుడు రేవణ్ణ కుటుంబం అంటే తామేమీ భయపడడం లేదని మృదుల బంధువులు తెలిపారు. రేవణ్ణ కుటుంబంపై మృదుల గ్రామస్తులు మండిపడుతున్నారు. తమ ఊరి పేరు నాశనం చేశాడంటూ శాపనార్థాలు పెడుతున్నారు.

తూర్పు రఫాను ఖాళీ చేయండి

- ఇజ్రాయిల్ ఆదేశాలు
- పాలస్తీనియన్లలో పెరిగిన భయాందోళనలు
- మూటా ముల్లె సర్దుకుని వీధుల్లో గుంపులు, గుంపులుగా : ప్రతిఘటనకు సిద్ధమయ్యామన్న హమాస్
- రఫాను మానవతా సంస్థలు వీడరాదని విజ్ఞప్తి
- కైరో చర్చల్లో ప్రతిష్టంభన?



గాజా, జెరూసలేం : తూర్పు రఫా నగరాన్ని ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయిల్ మిలటరీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పది లక్షల మందికి పైగా ప్రజలు తలదాచుకుంటున్న ఈ నగరంపై పూర్తి స్థాయిలో మిలటరీ దాడి జరగబోతోందన్న భయాందోళనలు ప్రజల్లో పెరిగాయి. కాగా, రఫా నగరంపై జరిగే ఏ దాడైనా ఇజ్రాయిల్ బలగాలకు 'పిక్నిక్' లా వుండబోదని హమాస్ వ్యాఖ్యానించింది. ఏదేమైనా పాలస్తీనియన్లను రక్షించుకోవడానికి తాము పూర్తిగా సంసిద్ధంగా వున్నామని చెప్పింది. సాయుధ విభాగం అల్ కసమ్ బ్రిగేడ్ల నేతృత్వంలో వీరోచితంగా ఇజ్రాయిల్ బలగాలను ప్రతిఘటించేందుకు సమాయత్తమయ్యామని హమాస్ ప్రకటించింది. ఆదేశాలు వెలువడిన గంటల వ్యవధిలోనే వేలాదిమంది ప్రజలు మూటా ముల్లె సద్దుకుని, పిల్లలు, వృద్ధులతో సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. ముఖ్యమైన వస్తువులను తీసుకుఏని స్వంత వాహనాల్లో రఫా సెంట్రల్, అల్ మవసి ప్రాంతాలకు వెళుతుండడం కనిపిస్తోంది. నుస్రత్, డేర్ ఎల్ బాలాహ్ వీధుల్లో ప్రజలు గుంపులు, గుంపులుగా తరలుతున్నారు. ఎక్కడ సురక్షిత ప్రాంతం వుందో కూడా తమకు అర్థం కావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇజ్రాయిల్ ఆదేశాలు వెలువడిన వెంటనే అమెరికా అధ్యక్షుడు బైడెన్, నెతన్యాహుతో మాట్లాడారు. మరో ఊచకోత మొదలవబోతోందని జోర్డాన్ వ్యాఖ్యానించింది. పరిస్థితులేమీ బాగా లేవని మానవతా సాయం కార్యకర్తలు తెలిపారు. మొండిగా ముందుకు సాగుతున్న ఇజ్రాయిల్‌పై మరిన్ని ఆంక్షలు విధిస్తామని బెల్జియం ప్రకటించింది. దీనిపై కసరత్తు జరుగుతోందని తెలిపింది.

ఎవరెంత చెప్పినా వినకుండా మొండిపట్టుతో, మూర్ఖత్వంతో ఒక పద్ధతి ప్రకారం రఫాపై దాడికి ఇజ్రాయిల్ సిద్ధమవుతున్న తరుణంలో అంతర్జాతీయ సమాజం అత్యవసరంగా చర్యలు తీసుకుని ఈ నరమేధాన్ని ఆపాలని హమాస్ కోరింది. అనూహ్యమైన విపత్తు చోటు చేసుకుంటుందని హెచ్చరించింది. తూర్పు రఫాలోని కొన్ని ప్రాంతాల్లో నివసించే దాదాపు లక్ష మందిని అక్కడ నుండి తరలిపోవాల్సిందిగా ఇజ్రాయిల్ మిలటరీ ఆదేశించిన నేపథ్యంలో మహిళలు, చిన్నారులు, వృద్ధులతో సహా వందల వేల సంఖ్యలో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లనుందని పేర్కొంది. అలాగే రఫా నగరాన్ని వీడి వెళ్లవద్దని పాలస్తీనియన్ల వ్యవహారాలు చూసే ఐక్యరాజ్య సమితి శరణార్థ సంస్థ (యుఎన్ ఆర్‌డబ్ల్యుఎ)తో మానవతా సంస్థలకు హమాస్ విజ్ఞప్తి చేసింది. మరోవైపు, ఈజిప్ట్ రాజధాని కైరోలో కాల్పుల విరమణ చర్చలపై అనుమానాలు తలెత్తుతున్నాయి. రఫా తరలింపు వున్నా చర్చలు కొనసాగించాలని భావిస్తున్నట్లు హమాస్ తెలిపింది. సానుకూల ధోరణితోనే చర్చలు కొనసాగించాలనుకుంటున్నామని అబ్దుల్ లతీఫ్ మీడియాకు తెలిపారు. శాశ్వతంగా కాల్పుల విరమణ కోసం ఒప్పందం కుదుర్చుకోవడం అవసరమని హమాస్ ప్రతినిధి చెప్పారు. కాగా ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ప్రతిపాదనలను బహిరంగంగానే తోసిపుచ్చుతోంది. కాగా, ఇజ్రాయిల్ వైఖరి వెంటనే తెలియరాలేదు. గత ఏడు మాసాలుగా సాగుతున్న యుద్ధంలో 34,735 మంది పాలస్తీనియన్లు మరణించగా, 78,108మంది గాయపడ్డారని పాలస్తీనా అధికారులు సోమవారం తెలిపారు.

దిక్కుతోచడం లేదు

సోమవారం రఫాలో ఇజ్రాయిల్ మిలటరీ వైమానిక దాడులు జరిపిందని ప్రజలు తెలిపారు. రఫాలోని పలు ప్రాంతాలను ఖాళీ చేయాలంటే ఇజ్రాయిల్ ఆదేశించిన కొన్ని గంటల వ్యవధిలో ఈ దాడులు జరిగాయి. తరలిపోవాలని ప్రజలు ఆదేశాలు అందుకున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇజ్రాయిల్ ఆర్మీ ఈ వైమానిక దాడులు చేపట్టింది. ఈ పరిస్థితుల్లో రఫాలో చాలా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాడులు ముంచుకొస్తున్న నేపథ్యంలో ఎక్కడకు వెళ్ళాలోకూడా తెలియడం లేదని పాలస్తీనియన్లు వాపోతున్నారు. 'ఇజ్రాయిల్ ఆదేశాల నేపథ్యంలో తమకు దిక్కుతోచని పరిస్థితులు నెలకొన్నాయని ఉత్తరప్రాంతంలో తలదాచుకున్న అబూ ముహే వ్యాఖ్యానించారు. భారీగా వర్షం పడుతోంది, ఎక్కడకు వెళ్ళాలో తెలియడం లేదు. ఇలాంటి రోజొకటి వస్తుందని భయపడుతునే వున్నాను. నా కుటుంబాన్ని ఎక్కడకు తీసుకెళ్ళాలో చూడాల్సి వుంది.' అని మరో శరణార్థి అబూ రయీద్ వ్యాఖ్యానించారు.

ఆమోదయోగ్యం కాదు

రఫాను ఖాళీ చేయాలంటూ ఇజ్రాయిల్ జారీ చేసిన ఆదేశాలు ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని యురోపియన్ యూనియన్ దౌత్యవేత్త జోసెఫ్ బొరెల్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. భద్రతా మండలి ఆమోదించిన 2728 తీర్మానాన్ని ఇజ్రాయిల్ తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన కోరారు.

బ్రిటన్ వర్శిటీల్లో నిరసన శిబిరాలు


గత కొద్ది వారాలుగా అమెరికా, కెనడా, ఫ్రాన్స్ సహా పలు దేశాల్లో సాగుతున్న విద్యార్థుల నిరసన శిబిరాలు తాజాగా బ్రిటన్‌కు పాకాయి. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వర్శిటీల్లో విద్యార్థులు పాలస్తీనా అనుకూల శిబిరాలను ఏర్పాటు చేశారు. పాలస్తీనియన్లకు సంఘీభావం తెలియచేయడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కొన్ని రోజుల పాట ఈ శిబిరాన్ని ఇలాగే కొనసాగిం చాలని భావిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. గాజాలో మారణహోమాన్ని, వర్ణవివక్షతను తక్షణమే నిర్మూలించాలని కోరారు. ఇజ్రాయిల్ ఆక్రమణల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే సంస్థలు, కంపెనీల్లో పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని కోరారు. గాజాలో ఉన్నత విద్యా రంగాన్ని పాలస్తీనా నేతృత్వంలో పునర్నిర్మిస్తామని ఆక్స్‌ఫర్డ్ వర్శిటీ హామీ ఇవ్వాలని కూడా వారు కోరారు.

15న సెంథిల్ బాలాజీ బెయిల్ పిటిషన్ విచారణ

న్యూఢిల్లీ : తమిళనాడు మాజీ మంత్రి వి సెంథిల్ బాలాజీ దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 15కు వాయిదా వేసింది. సోమవారం ఈ పిటీషన్‌ను జస్టిస్ ఎ.ఎస్. ఒకా నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. 328 రోజుల నుంచి కస్టడీలో ఉన్నానని, తనకు బెయిల్ మంజారు చేయాలని సెంథిల్ బాలాజీ ఈ పిటీషన్‌లో కోరారు. అయితే బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యులను, బాధితులను సెంథిల్ బాలాజీ ప్రభావితం చేస్తారని ఇడి అభ్యంతరం వ్యక్తం చేసింది. 2014-15 మధ్య జరిగిన జాబ్ రాకెట్ స్కామ్‌లో సెంథిల్ బాలాజీని ఇడి గత ఏడాది జూన్‌లో అరెస్టు చేసింది. సెంథిల్ బాలజీ బెయిల్ పిటీషన్‌ను ఏప్రిల్ 1న మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

13లోగా నా పిటిషన్‌ను విచారించండి

- సుప్రీంను కోరిన హేమంత్ సోరెన్



న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ ఆరోపణలపై తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ పెట్టుకున్న పిటిషన్‌పై అత్యవసరంగా విచారించాల్సిందిగా జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సుప్రీం కోర్టును కోరారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై .చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ముందు సోరెన్ తరపు న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ, ఈ నెల 13న జార్ఖండ్‌లో పోలింగ్ జరగనుందని, తన పార్టీకి ప్రచారం చేసుకోవడానికి తనను అనుమతించాలని కోరారు. దీర్ఘకాలం నుండి హైకోర్టు తీర్పును పెండింగ్‌లో పెడుతోంది. ఫిబ్రవరిలో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసుకుంది. ఎంతకూ హైకోర్టుకు తీర్పును ప్రకటించకపోవడంతో చివరగా, తాత్కాలిక బెయిల్ కోసం సుప్రీం కోర్టుకు విజ్ఞప్తి చేసుకోవాల్సి వచ్చిందని సిబల్ తెలిపారు. సోరెన్ హక్కులు పూర్తిగా ఉల్లంఘించబడుతున్నాయని సిబల్ పేర్కొన్నారు. తాత్కాలిక బెయిల్‌పై పిటిషన్ మంగళవారం విచారణకు రానుందని చంద్రచూడ్ తెలియచేయగా, హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఆయన పెట్టుకున్న పిటిషన్‌ను కూడా దానితో పాటు విచారించాలని సిబల్ కోరారు. సోరెన్‌పై కేసును కొట్టివేయడానికి మే 3వ తేదీన హైకోర్టు తిరస్కరించింది. ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన వెంటనే జనవరి 31న సోరెన్‌ను అరెస్టు చేశారు.

మహారాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుపై బాంబే హైకోర్టు స్టే

ముంబయి : ఒకవేళ ప్రభుత్వ పాఠశాల ఒక కిలోమీటరు పరిధిలో ఉంటే ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ) కింద ప్రవేశాలకు మినహాయింపు ఇస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుపై బాంబే హైకోర్టు సోమవారం స్టే విధించింది. ప్రభుత్వ ఉత్తర్వు ప్రజా ప్రయోజనాలకు సంబంధించినదని, పూర్తి విచారణ చేయాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి డికె ఉపాధ్యాయ, న్యాయమూర్తి జస్టిస్ ఆరిఫ్ డాక్టర్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఇలాంటి ఉత్తర్వులు చిన్నారులకు ఉచిత విద్యను అందించడానికి ఆటంకం కలిగిస్తాయని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఫిబ్రవరి 9న మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009 (దీనినే ఆర్‌టిఇ కూడా పిలుస్తారు) లోని నిబంధనలకు విరుద్ధంగా ఉందని పిటీషన్ దాఖలయింది. ఆర్‌టిఇ ప్రకారం ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి లేదా ప్రీ-ప్రైమరీ సెక్షన్‌లో ఇబిసి, ఒబిసి చిన్నారులకు 25 శాతం సీట్లను కేటాయించాలి. వీరి ఫీజులను ప్రభుత్వం పాఠశాలలకు తిరిగి చెల్లిస్తుంది. అయితే ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు ఒక కిలోమీటరు పరిధిలో ప్రభుత్వ పాఠశాల ఉంటే ఆర్‌టిఇ అమలు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. దీనిపై విమర్శలు వెళువెత్తుతున్నాయి.

పూంచ్ దాడిఅనుమానితుల ఊహాచిత్రాలు విడుదల

శ్రీనగర్ : ఈ నెల 4న పూంచ్ వద్ద ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఎఫ్) వాహనాలపై దాడి కేసులో ఇద్దరు అనుమానితుల ఊహచిత్రాలను భారత సైన్యం సోమవారం విడుదల చేసింది. అలాగే నిందితుల ఆచూకీ చెప్పిన వారికి రూ. 20 లక్షల నగదు బహుమతిని కూడా ఆర్మీ ప్రకటించింది. విశ్వసనీయమైన అచూకీ చెప్పిన వారికి రూ. 20 లక్షల నగదు బహుమతితో పాటు అచూకీ చెప్పిన వారి గుర్తింపు రహస్యంగా ఉంచుతామని కూడా సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. శనివారం మధ్యాహ్నం పూంచ్‌లోని సూరన్‌కోట సమీపంలో జరిగిన దాడిలో ఇద్దరు లేదా ముగ్గురు ఉగ్రవాదులు పాల్గొన్నట్లు సైన్యం అనుమానిస్తోంది. ఈ దాడిలో ఒక ఐఎఎఫ్ జవాన్ మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. నిందితుల కోసం పూంచ్ అటవీ ప్రాంతంలో భారీ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది.

ఉత్తరాఖండ్ దావానలంపై 8న సుప్రీం అత్యవసర విచారణ

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్ దావానలంపై దాఖలైన పిటిషన్లను 8వ తేదీన అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. ఈ దావానలం సంఘటనల్లో 90శాతం ఉద్దేశ్యపూర్వకంగా చోటు చేసుకున్నవేనని పిటిషనర్లు పేర్కొంటున్నారు. ఉత్తరాఖండ్‌లో దావానలం సంఘటనలపై విచారణలు సుప్రీం కోర్టులో ఏళ్ళతరబడి పెండింగ్‌లో వుంటున్నాయని పిటిషన్లు పేర్కొన్నాయి. అమికస్ క్యూరీ, న్యాయవాది కె.పరమేశ్వర్‌కు విషయం తెలియ చేయాల్సిందిగా సీనియర్ న్యాయవాది రాజీవ్ దత్తాతో సహా పిటిషనర్లను జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ ఆదేశించింది. విచారణ సమయంలో ఆయన స్వయంగా హాజరవుతారని ఉత్తరాఖండ్ ప్రభుత్వం తరపున డిప్యూటీ అడ్వకేట్ జనరల్ తెలియచేశారు. తదుపరి విచారణ సమయానికల్లా స్టేటస్ రిపోర్ట్‌ను దాఖలు చేసేందుకు అనుమతి కోరారు. పరిస్థితి చాలా దారుణంగా, దిగ్భ్రాంతికరంగా వుంది. మొత్తంగా ఆ ప్రాంతాల్లో కార్బన్ డయాక్సైడ్ బాగా నెలకొందన్నారు. వాస్తవానికి జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు ప్రభుత్వం నివేదికను అందచేసిందని చెప్పారు. మంటలు రేగిన సంఘటనలు తగ్గుతున్నాయని ట్రిబ్యునల్ తెలిపిందన్నారు. తదుపరి విచారణ సమయంలో అమికస్ క్యూరీ, కేంద్ర సాధికార కమిటీని కూడా తీసుకురావాల్సి వుంటుందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. గత ఆరు మాసాల్లో 900కి పైగా కార్చిచ్చు సంఘటనలు చోటు చేసుకున్నాయి. మొత్తంగా 1100 హెక్టార్ల అటవీ భూములు తగలబడ్డాయి. వీటిలో 351 కేసులు మనుష్యుల వల్ల జరిగినవేనని వార్తా కథనాలు తెలుపు తున్నాయి. పదే పదే కార్చిచ్చు రగులుతున్నా నిర్లక్ష్యం, నిష్క్రియాపరత్వం, పట్టి పట్టని ధోరణి, సంసిద్ధత కొరవడడం వంటి కారణాలతో అడవులకు తీరని నష్టం జరుగుతోందని పిటిషన్‌దారులు పేర్కొంటున్నారు. దీనివల్ల వన్యప్రాణి సంరక్షణ ప్రమాదంలో పడుతోందన్నారు.

కేజ్రీవాల్‌పై ఎన్ఐఏ విచారణ

- ఢిల్లీ ఎల్‌జీ సిఫారసు.



న్యూఢిల్లీ : 'సిఖ్స్ ఫర్ జస్టిస్' అనే ఉగ్రవాద సంస్థ నుంచి రాజకీయ విరాళాలు తీసుకున్నారనే ఆరోపణలపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై ఎన్ఐఏ విచారణ చేయాలని రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సెనా సిఫారసు చేశారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ కార్యదర్శికి సక్సెనా ఒక లేఖ రాసినట్లు లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 1993 బాంబు పేలుళ్ల కేసు దోషి దేవేంద్ర పాల్ భుల్లార్ విడుదలకు సహకరించాలని కోరుతూ ఖలిస్తాన్ అనుకూల ఉగ్రవాద సంస్థల నుంచి 16 మిలియన్ డాలర్లను కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ స్వీకరించినట్లు తనకు ఫిర్యాదు అందినట్లు సక్సెనా లేఖలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా లేఖతో సక్సెనా జత చేసినట్లు సమాచారం.కాగా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే విషయాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించిన కొన్ని రోజుల్లోనే వికె సక్సెనా ఇలాంటి లేఖ రాయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'బిజెపి ఆదేశాలతో కేజ్రీవాల్‌పై ఇది మరొక కుట్ర'గా ఆప్ విమర్శించింది. ఢిల్లీలో మొత్తం ఏడు లోక్‌సభ స్థానాల్లోనూ ఓటమి చెందుతామనే భయంతోనే బిజెపి ఇలాంటి కుట్రలకు పాల్పడుతుందని ఆప్ నాయకులు, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ విమర్శించారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని జేపీ నడ్డా, అమిత్ మాలవియా, విజయేంద్రపై కేసు

బెంగళూరు : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, పార్టీ ఐటి సెల్ అధ్యక్షులు అమిత్ మాలవియా, పార్టీ కర్నాటక అధ్యక్షులు బివై విజయేంద్రపై బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఒక సోషల్ మీడియా పోస్టులో ఒక అభ్యర్థికి ఓటు వేయవద్దని ఎస్‌సీ, ఎస్‌టీ ప్రజలను బిజెపి నాయకులు బెదిరింపులకు గురి చేశారని కేపీసీసీ ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు ఐపిసిలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 505 (2) ప్రకారం కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కర్నాటక బీజేపీ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన వీడియోను కూడా ఫిర్యాదులో కాంగ్రెస్ జత చేసింది. బీజేపీ పోస్టు చేసిన వీడియో ఉద్దేశపూర్వకంగా అల్లర్లను రెచ్చగొట్టడం, వివిధ మతాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందించడం, ఒక నిర్దిష్ట అభ్యర్థికి ఓటు వేయవద్దని ఎస్‌సి, ఎస్‌టిలను బెదిరించడం, ప్రజల మధ్య సామరస్యాన్ని విఘాతం కలిగించేదిగా ఉందని కాంగ్రెస్ తన ఫిర్యాదులో పేర్కొంది.

హేయమైన చర్య ... కఠిన చర్యలు తీసుకోవాలి

- కోరుట్ల ప్రభుత్వాస్పత్రి ఘటనపై వైద్య, నర్సింగ్ సంఘాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోరుట్ల ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందిపై రోగి బంధువులు దాడి చేసి, డీజిల్ పోసి హత్యా ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని పలు వైద్య, నర్సింగ్ సంఘాలు ఖండించాయి. ఈ మేరకు సోమవారం తెలంగాణ నర్సెస్ అసోసియేషన్, తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసి యేషన్ (టీ-జూడా), హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డీఏ) వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. దాడి చేసిన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలనీ టీ జూడా డిమాండ్ చేసింది. ఇలాంటి ఘట నలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఆర్‌డీఏ కోరింది. ఇలాంటి ఘటనలతో వైద్యులు, వైద్య సిబ్బంది ఆత్మస్థైర్యం దెబ్బతిం టున్నదని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది.

కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఎదురు దెబ్బ

- పినరయి విజయన్, ఆయన కుమార్తెపై విచారణ జరపాలన్న పిటిషన్ తోసిపుచ్చిన విజిలెన్స్ కోర్టు





తిరువనంతపురం : కాంగ్రెస్ ఎమ్మెల్యే మాథ్యూ కుజల్నాదన్‌కు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె టి.వీణలపై విచారణ జరపాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను విజిలెన్స్ కోర్టు తోసిపుచ్చింది. ఎగ్జాలాజిక్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి సంబంధించి తాను చేసిన ఆరోపణలపై విజిలెన్స్ కోర్టు ప్రత్యక్ష విచారణ జరపాలని కుజల్నాదన్‌తో సహా పలువురు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇందుకోసం పెద్ద ఎత్తున పన్నిన కుట్రలో భాగంగా ఈ పిటిషన్ నమోదైంది. అయితే కోర్టు ఎన్నిసార్లు ప్రశ్నించినప్పటికీ కుజల్నాదన్ అవసరమైన సాక్ష్యాధారాలు అందచేయడంలో విఫలమయ్యారు. యుడిఎఫ్ అనుకూల మీడియా సాయంతో పదే పదే నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించడానికి కుజల్నాదన్ ప్రయత్నించారు. కానీ విజిలెన్స్ కోర్టు తీర్పుతో ఎదురు దెబ్బ తగిలింది. ముఖ్యమంత్రిపై, ఆయన కుమార్తెపై దాఖలైన పిటిషన్‌ను పరిశీలిస్తూ కోర్టు, సాక్ష్యాధారాలను సమర్పించాల్సిందిగా పిటిషనర్‌ను పలుసార్లు కోరింది. అయితే పిటిషన్‌ను పున: విచారణ చేయాలంటూ ఆయ కొత్తగా డిమాండ్ చేశారు. దాన్ని కూడా కోర్టు తిరస్కరిస్తూ, ఏ సాక్ష్యాధారాలు లేకుండా కోర్టుకు ఎలా వచ్చారని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మైనింగ్ కంపెనీ సీఎంఆర్ఎల్ చేసిన అన్ని డిమాండ్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించిందని కోర్టు తెలియచేసింది.

'ఉపాధి' వేతనాలను రూ.400కు పెంచుతాం


● రాహుల్‌గాంధీ



అలిరాజ్‌పూర్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఇజీఎ) కింద ఇచ్చే వేతనాలను రోజుకు రూ.400కు పెంచుతామని ఆ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. సోమవారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని రత్లామ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అలిరాజ్‌పూర్ పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. 'శతకోటీశ్వర్లకు రుణాలను మాఫీ చేస్తూ దానినే అభివృద్ధి అని గొప్పలు చెబుతున్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఇజీఎ కింద మీకు రోజుకు రూ.250 వస్తుందని మా దృష్టికి వచ్చింది. మేం అధికారంలోకి రాగానే రోజుకు రూ.400 వేతనాలు ఇస్తాం' అని రాహుల్ చెప్పారు. ఆ తరువాత ఖర్గాన్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సెగాన్ పట్టణంలో ఎన్నికల ర్యాలీలోనూ ఆయన పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో బిజెపికి 150 స్థానాలు కూడా రావని ఆయన జోస్యం చెప్పారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రక్షించడానికి చేస్తున్న పోరాటానికి ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు.

మాజీ సీఈసీ సూచననైనా పరిగణనలోకి తీసుకోండి

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు థామస్ ఐజాక్



తిరువనంతపురం : లోక్‌సభ ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు యత్నిస్తోందన్న ఆరోపణలను తోసిపుచ్చేందుకు ఎన్నికల కమిషన్ (ఈసీ) నిరాకరించడంపై సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, ఆర్థిక వేత్త థామస్ ఐజాక్ స్పందించారు. ఈసీ ఇప్పటికీ మొదటి రెండు దశల్లో ప్రతి నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్యను ప్రచురించాల్సి వుందని అన్నారు. వివరాలను ప్రకటించడం ప్రాముఖ్యత గురించి కనీసం మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఎస్.వై. ఖురేషీ సూచననైనా ఇసి పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. ఈమేరకు సోమవారం ఐజాక్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

పదేండ్లు ఏం చేశావు మోడీ?

● చనగాని దయాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్లు రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేననీ, ఆ పార్టీలను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. రోహిత్ వేముల ఆత్మహత్యకు కమలం పార్టీ నాయకులే కారణం కాదా? అని ప్రశ్నించారు. దోషులను శిక్షించేంత వరకు రోహిత్ వేముల కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందనీ, సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తామని తెలిపారు.

బీజేపీకి అంతిమ సంస్కారమే

● ఖలీల్ ఉర్ రహమాన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ చేసిన మోసాలు ప్రజలకు అర్థమయ్యాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖలీల్ ఉర్ రహమాన్ తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీకి అంతిమ సంస్కారం చేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారని చెప్పారు. అందుకే తమ విద్వేషాలు రెచ్చగొట్టేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నదని విమర్శించారు.

ప్రచార సభల్లో జాగ్రత్తగా వ్యవహరించాలి

● లేకపోతే కఠినంగా పరిగణిస్తాం : సీఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబుకు ఈసీ హెచ్చరిక



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం జగన్మోహన్ రెడ్డి, మాజీ సీఎం చంద్రబాబు నాయుడిని కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఈ మేరకు సోమవారం సీఎం జగన్మోహన్ రెడ్డి, మాజీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఈసీ నోటీసులిచ్చింది. ఒకరినొకరు పరస్పరం తీవ్రస్థాయిలో చేస్తున్న వ్యాఖ్యలపై హెచ్చరించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు భావించాల్సి వస్తుందని తెలిపింది. బహిరంగ సభల్లో, ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఈసీ తప్పుపట్టింది. ఇప్పటికే ఈ అంశంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు నోటీసు జారీ చేయగా వారు ఇచ్చిన సమాధానంతో ఈసీ సంతృప్తి చెందింది. ఇకపై ప్రచార సభల్లో అలా మాట్లాడటం సరికాదంటూ హెచ్చరించింది. చంద్రబాబుకు డైరెక్షన్ ఇస్తూ ఇకపై పబ్లిక్ మీటింగుల్లో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. ఇకపై ఇరువురు నేతలు ప్రచారంలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించింది.

గ్రామీణమే కీలకం

● ఛత్తీస్‌గఢ్‌లో వారి ఓట్లు అధికం

● రాష్ట్రంలో 76 శాతం జనాభా గ్రామీణ ప్రాంతాల్లోనే

● నేడు ఏడు లోక్‌సభ స్థానాలకు పోలింగ్

● కాంగ్రెస్, బీజేపీల మధ్యనే ప్రధాన పోటీ

● బరిలో పలువురు కీలక నేతలు



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని మిగిలిన ఏడు లోక్‌సభ స్థానాలకు మూడో దశలో భాగంగా మే 7న పోలింగ్ జరగనున్నది. రాష్ట్రంలో జరిగిన పోలింగ్‌లో బస్తర్‌లో జరిగిన తొలి దశలో 68.3 శాతం, రెండో దశలో 3 నియోజకవర్గాలైన రాజ్‌నంద్‌గావ్, కంకేర్, మహాసముంద్‌లలో 76.24 శాతం పోలింగ్ నమోదైంది. అధికార బీజేపీ, కాంగ్రెస్‌ల స్టార్ క్యాంపెయినర్లు ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించేందుకు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలకు తరలివచ్చారు. కారణం.. రాష్ట్ర మొత్తం జనాభాలో 76 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తుండటమే. దీంతో అభ్యర్థుల భవితవ్యం గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఓటర్ల పైనే ఉన్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార బీజేపీ, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌ల మధ్యనే ప్రధానంగా పోటీ నెలకొని ఉన్నదని అంటున్నారు.

ప్రస్తుతం ఎన్నికలు జరగనున్న ఏడు లోక్‌సభ స్థానాల్లో కోర్బా మినహా మిగిలిన ఆరు స్థానాలను 2019 ఎన్నికల్లో బీజేపీ గెలుచుకున్నది. గత ఏడాది డిసెంబర్ 10న బీజేపీ ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణు దేవ్ సాయిని ఎన్నుకున్నప్పుడు.. అతని నియామకం బీజేపీకి దేశవ్యాప్తంగా గిరిజనుల్లో ఆదరణ లభిస్తుందని ఆ పార్టీ అధినాయకత్వం భావించింది. దీంతో ఆయనను సీఎం సీట్లో కూర్చోబెట్టింది. ముఖ్యంగా మోడీ ప్రభుత్వం రెండో దఫా పాలనలో ఇది కనిపిస్తుంది. గిరిజన సంఘాలు సాంప్రదాయకంగా బీజేపీకి దూరంగా, కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇటు బీజేపీ మాతృ సంస్థ అయినటువంటి ఆర్ఎస్ఎస్ కూడా గిరిజన వర్గాల్లో క్యాడర్‌ను నిర్మించాలని నిరంతరం చూస్తున్నది. హిందూ జాగరణ్ మంచ్ వంటి సంఘ్ అనుబంధ సంస్థలు ఇందుకు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నాయి. గిరిజనుల అమాయకత్వాన్ని, పేదరికాన్ని ఆసరగా చేసుకొని వారిలోనూ మతం అనే విషబీజాలు నాటే ప్రయత్నాలను చేస్తున్నాయి.

కాగా, గిరిజనులను ఐక్యం చేయటంలో కాంగ్రెస్ కాస్త సవాళ్లను ఎదుర్కొంటున్నదని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. గత ఐదేండ్లలో తమ పాలనలో భూపేశ్ బఘేల్ ప్రభుత్వం చేపట్టిన 'దేవగుడి' (గిరిజన గ్రామ దేవాలయాలు), 'ఘోతుల' (ఆదివాసీల సామాజిక-సాంస్కృతిక కేంద్రాలు) అభివృద్ధి గురించి ప్రచారం చేసుకుంటున్నది. అలాగే, కాంగ్రెస్ తన 'న్యాయ్' మ్యానిఫెస్టో ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని నమ్ముతున్నది.

మంగళవారం పోలింగ్ జరగనున్న ఏడు స్థానాల్లో రెండు ఎస్టీ నియోజకవర్గాలు కాగా, ఒకటి ఎస్సీ వర్గానికి చెందినవి ఉన్నాయి. మూడో విడతలో 26 మంది మహిళలు సహా 168 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. 37 మంది కోటీశ్వరులు కాగా,16 మందిపై క్రిమినల్ కేసులు నమోద య్యాయి. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.బీజేపీ రాష్ట్ర క్యాబినెట్ మంత్రి బ్రిజ్‌మోహన్ అగర్వాల్, బీజేపీ సిట్టింగ్ ఎంపీ విజయ్ బాఘెల్, బీజేపీ రాజ్యసభ సభ్యుడు సరోజ్ పాండే (కోర్బా), కాంగ్రెస్ ఎంపీ జ్యోత్స్నా మహంత్ (కోర్బా), బీజేపీకి చెందిన చింతామణి మహరాజ్ (సర్గుజా స్థానం నుంచి) పోటీ పడుతున్న ప్రముఖ నాయకులు. కాంగ్రెస్ మాజీ రాష్ట్ర మంత్రి శివ దేహరియా (జంజ్‌గిర్-చంపా), కాంగ్రెస్ ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్ (బిలాస్‌పూర్) నుంచి బరిలో ఉన్నారు.

'గల్ఫ్ కార్మిక ద్రోహి... గప్పాల అరవింద్'



● చార్జిషీట్ విడుదల చేసిన కాంగ్రెస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత లోక్‌సభ ఎన్నికల్లో మాయ మాటలతో గల్ఫ్ కార్మికుల ఓట్లు కొల్లగొట్టి నిజామాబాద్ ఎంపీగా గెలిచిన అరవింద్ వారిని మోసం చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. "గల్ఫ్ కార్మిక ద్రోహి... గప్పాల అరవింద్" పేరిట టీపీసీసీ ఎన్నారై సెల్, గల్ఫ్ కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్ లో ఒక చార్జిషీట్‌ను విడుదల చేశారు. మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, టీపీసీసీ ఎన్నారై సెల్ నాయకులు మంద భీంరెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, కేరళ ప్రవాసి కాంగ్రెస్ నేత మునీర్‌తో కలిసి ఎంపీ అరవింద్‌పై చార్జిషీట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. చార్జిషీట్‌లో కాంగ్రెస్ నాలుగు ఆరోపణలు చేసింది. వాటికి బదులు చెప్పకపోతే అరవింద్‌కు గల్ఫ్ కార్మికుల ఓట్లు అడిగే అర్హతే ఉండబోదని విమర్శించారు.

చార్జిషీట్‌లోని ముఖ్యాంశాలు..

- 2020 సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల పొట్టగొడుతూ... కనీస వేతనాలు రూ.30 నుండి 50 శాతం వరకు తగ్గిస్తూ సర్క్యులర్లు జారీ చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వానికి కనీసం ఒక వినతిపత్రం కూడా ఇవ్వడం చేతకాని అసమర్థుడు అరవింద్.
- 'ప్రవాసి భారతీయ బీమా యోజన' లో సహజ మరణాన్ని చేర్చకుండా గల్ఫ్ కార్మికుల బతుకులతో బీజేపీ ప్రభుత్వం ఆడుకుంటే... అరవిందుడు కేంద్ర ప్రభుత్వంతో చర్చించ కుండా తప్పించుకుంటూ తిరిగిన 'గల్ఫ్ ద్రోహి'
- హైదరాబాద్‌లో సౌదీ అరేబియా, కువైట్ దేశాల కాన్సులేట్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి లెటర్ కూడా రాయటం చేతకాని అజ్ఞాని అరవింద్.
- కరోనా కష్టకాలంలో... గల్ఫ్ దేశాల నుంచి ఇండియాకు వచ్చిన పేద కార్మికుల రక్తం పిండి రెండింతలు, మూడింతలు విమాన చార్జీలు వసూలు చేసింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం. వారిని స్వదేశానికి. ఫ్రీగా రప్పించాల్సిన కేంద్రం.. అధిక చార్జీలు వసూలు చేయడాన్ని ప్రశ్నించలేని అరవింద్ ఎంపీ పదవికి అనర్హుడు.

రాష్ట్రంలో ఎన్నికలకు పోలీస్ వ్యూహం సిద్ధం

● రంగంలోకి కేంద్ర, రాష్ట్ర బలగాలతో కూడిన స్పెషల్ టీమ్‌లు

● సున్నితమైన ప్రాంతాల్లో మెరుపు దళాల మోహరింపు : తాజా పరిస్థితిని సమీక్షించిన డీజీపీ





నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఇక వారంలో రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు పోలీసు బందోబస్తు వ్యూహం సిద్ధమైంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో మొత్తం 32వేల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగుతుండటంతో ఇందులో సాధారణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు.. వాటికి తగ్గ విధంగా భద్రతా ఏర్పాట్ల స్కీమ్‌ను రూపొందించారు. ఇందులో మతపరంగా సమస్యాత్మకమైనవి, రాజకీయ పాత వైరంతో కూడిన సమస్యాత్మక కేంద్రాలు, రాజకీయ పక్షాలుప్రతిష్టాత్మకంగా తీసుకునే నియోజకవర్గాలను ఈ మారు ప్రత్యేకంగా గుర్తించి కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం స్పెషల్ యాక్షన్ టీమ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రష్ టీమ్, క్విక్ యాక్షన్ టీమ్‌లను ప్రత్యేకంగా రూపొందించి రంగంలోకి దించుతున్నారు.

ఈ టీమ్‌లలో కేంద్ర సాయుధ పోలీస్ బలగాలతో పాటు రాష్ట్ర స్పెషల్ పోలీస్ బెటాలియన్, నగర ప్రత్యేక సాయుధ బలగాలతో పాటు సివిల్ పోలీసులను కలిపి ఈ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్‌కు ఒక ఎస్సైని ఇన్‌చార్జిగా నియమించారు.శాంతి భద్రతల పరంగా ముప్పు ఉన్న ప్రాంతాల్లో ఇద్దరేసి ఎస్సైలను ఈ టీమ్‌లకు ఇన్‌చార్జిలుగా నియమించి రంగంలోకి దించుతున్నారు. రాష్ట్రానికి చెందిన దాదాపు 60 వేల మంది పోలీసులు,17 వేల మంది హోంగార్డులతో పాటు ప్రస్తుతం పోలీస్ ట్రైనింగ్ కాలేజీ(పీటీసీ)లలో శిక్షణ పొందుతున్న దాదాపు 15 వేల మంది కొత్త కానిస్టేబుళ్ల, ఎస్సైలను కూడా బందోబస్తుకు వినియోగిస్తున్నారు. వీరే గాక కేంద్రం నుంచి కేటాయించబడ్డ రెండు వందల కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను(సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, ఆర్ఏఎఫ్) కూడా ఈ బందోబస్తులో వినియోగిస్తున్నారు.

మతపరంగా అత్యంత సమస్యాత్మక నియోజక వర్గంగా గుర్తించిన హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంతో పాటు మతపరంగా సమస్యలు తలెత్తుతాయని భావించే మహబూబ్‌నగర్, భువనగిరి, నిజామాబాద్, ఆదిలాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో మెరుపు దళాలను ఇప్పటి నుంచే మోహరింపజేసి వాటితో గస్తీని నిర్వహిస్తున్నారు. మొత్తమ్మీద, రాష్ట్రంలోని ఏ పోలింగ్ బూత్‌లో కూడా అవాంఛనీయ సంఘటనలతో పాటు రిగ్గింగ్ జరపటం, ఓటు వేయటానికి వస్తున్న పౌరులకు అంతరాయం కలిగించటం, వారిపై బెదిరింపులకు పాల్పడటం వంటి ఘటనలు చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ డాక్టర్ రవి గుప్తా నుంచి అన్ని జిల్లాల ఎస్పీలు, నగర పోలీస్ కమిషనర్లకు ఆదేశాలు వెళ్లాయి. లపోలింగ్ జరిగాక పోలింగ్ బూత్‌ల నుంచి ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేందుకు ప్రత్యేక మార్గాలను కూడా వెంటనే రూపొందించాలని కూడా డీజీపీ ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌లో ఒక ఎస్సై స్థాయి అధికారి, సాధారణ పోలింగ్ బూత్‌లలో ఒక కానిస్టేబుల్ ఉండేలా పోలింగ్ రోజు చర్యలు తీసుకుంటున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలతో పాటు సివిల్ పోలీసులతో మూడంచెల బందోబస్తును కూడా ఏర్పాటు చేస్తున్నారు.



రవీంద్రభారతిలో జరిగిన జాతీయ సంగీత, నృత్య ప్రదర్శనలో బాచుపల్లి శ్రీ శర్వాణి నాట్య కళాశాల చిన్నారుల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. హరిప్రియ, తుమ్మలపల్లి శిష్యులు నేహితచ శ్రీహిత, షష్మిత, విరాజిత, లహరి, శ్యామలా మీనాక్షి అచ్యుతం కేశవం పాటకు అద్భుత నాట్యం ప్రదర్శించి అబ్బురపరిచారు.

ఆస్ట్రేలియాలో భారత విద్యార్థి హత్య

● నిందితులుగా అనుమానిస్తున్న మరో ఇద్దరి కోసం గాలింపు



మెల్‌బోర్న్, చండీగఢ్ : ఆస్ట్రేలియాలో భారతీయ విద్యార్థి ఒకరు కత్తిపోట్లకు గురై మరణించాడు. ఈ హత్యతో సంబంధముందని భావిస్తున్న మరో ఇద్దరు భారతీయుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి అద్దె విషయమై స్నేహితుల మధ్య తలెత్తిన గొడవ ఈ హత్యకు దారి తీసినట్లు తెలుస్తోంది. అయితే మృతుడు నవజీత్ సంధు(22)కు ఈ గొడవకు అసలు సంబంధం లేదు. వారిని ఘర్షణ పడవద్దని వారించినందుకే ఈ దాడి జరిగిందని తెలుస్తోంది. హర్యానాలోని కర్నాల్‌కి చెందిన నవజీత్ చదువు కోసం ఏడాదిన్నర క్రితం ఆస్ట్రేలియా వచ్చాడు. ఈ ఏడాది జులైలో శెలవుల కోసం స్వదేశానికి రావాల్సి వుంది. ఈలోగానే ఇంత ఘోరం జరిగింది.

వేరే చోటకు ఇల్లు మారదామనుకున్న నవజీత్ స్నేహితుడు (మరో భారతీయ విద్యార్థి) తన సామాన్లతో కొత్త ఇంటికి తీసుకెళ్ళడానికి సాయం చేయాల్సిందిగా నవజీత్‌ను అడిగాడు. కారులో ఫ్రెండ్‌ను తీసుకెళ్ళడానికి వచ్చిన నవజీత్‌కు లోపల ఇంట్లో నుండి అరుపులు వినిపించడంతో లోపలకు వెళ్ళి అక్కడ ఘర్షణ పడుతున్న వారిని అడ్డుకోబోయాడు. వెంటనే ఛాతీలో తీవ్రంగా కత్తితో పొడవడంతో నవజీత్ చనిపోయాడని, అతడి స్నేహితుడు కూడా గాయపడ్డాడని నవజీత్ మావయ్య యశ్వీర్ తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున తమకు సమాచారం అందిందని చెప్పారు. నిందితులుగా భావిస్తున్నవారు కూడా కర్నాల్‌కి చెందినవారేనని తెలిపారు.

నవజీత్ చాలా తెలివైన విద్యార్థి అని చదువు కోసం తండ్రి ఎకరంన్నర పొలాన్ని అమ్మి మరీ ఆస్ట్రేలియా పంపించారని, ఈలోగా ఈ ఘోరం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మృతదేహాన్ని భారత్‌కు రప్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్రాన్ని కోరినట్లు యశ్వీర్ తెలిపారు.

తెల్ల టయోటా కారులో సోదరులు అభిజిత్, రాబిన్ గర్టన్ ఇరువురు పారిపోయారని, వారి కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారని యశ్వీర్ చెప్పారు.

బ్రెజిల్‌ను ముంచెత్తిన వర్షాలు, వరదలు

● 78మంది మృతి, వేలాదిమంది తరలింపు



పోర్ట్ అలెగర్: దక్షిణ బ్రెజిల్‌ను వర్షాలు, వరదలు ముంచెత్తాయి. రోజుల తరబడి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించడంతో 78మంది మరణించారు. లక్షా 15వేల మంది నిరాశ్రయులయ్యారు. పలు నగరాలు నీట మునిగాయి. వేలాదిమంది ప్రజలకు ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. రియో గ్రాండె రాష్ట్ర రాజధాని పోర్టో అలెగ్రెలో ప్రజలు ఇళ్ళ పైకప్పుల మీద ఎక్కి కూర్చున్నారు. నదుల్లాగా మారిన వీధుల్లో చిన్న చిన్న పడవలు వేసుకుని ప్రజలు వెళుతున్నారు. ఆందోళనకరంగా పరిణమించిన వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావమే ఈ విపత్తుకు కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పరిస్థితులు అనుకూలించకపో వడంతో 3వేల మందికి పైగా సైనికులను, అగ్నిమాపక సిబ్బందిని, ఇతర సహాయక కార్యకర్తలను రంగంలోకి దించారు. ప్రాథమిక అవసరాలు కూడా తీరని ఇబ్బందికర పరిస్థితుల్లో అనేకమంది చిక్కుకుపోయి, ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. మొత్తంగా 341 పట్టణాలు, గ్రామాలు వరద తాకిడికి గురయ్యాయి. తాజా పరిస్థితుల్లో 105మంది గల్లంతయ్యారని పౌర రక్షణాధికారులు తెలిపారు. యుద్ధం సంభవించి అంతా తుడిచిపెట్టుకుపోయినట్లు వుందని, యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలను చేపట్టాల్సి వుందని రియో గ్రాండ్ గవర్నర్ ఎడ్వర్డ్ లెయిట్ తెలిపారు. అధ్యక్షుడు లూలా డసిల్వా అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు.

మళ్లీ బీజేపీ గెలిస్తే ఎన్నికలుండవు : రాజేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మళ్లీ బీజేపీ గెలిస్తే దేశంలో ఇవే చివరి ఎన్నికలవుతాయని కాంగ్రెస్ ఎన్నారై నాయకులు రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌ను గెలిపించి రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను, సెక్యులరిజాన్ని కాపాడాలని ప్రజలను కోరారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ గంపా వేణుగోపాల్ మాట్లాడుతూ పదేండ్ల పాటు కేసీఆర్ రుణమాఫీ చేయకపోవడంతో విదేశాల్లో ఉన్న రైతుల సిబిల్ స్కోర్ తగ్గిందని తెలిపారు. దీంతో ఎన్నారై పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వారి సిబిల్ స్కోర్ పెంచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఎన్నారై కన్వీనర్ భీమ్ రెడ్డి గల్ఫ్ కార్మికులకు, ఎన్నారైలకు బీజేపీ ఏం చేయలేదని విమర్శించారు. కరోనా సమయంలోనూ వందే భారత్ విమానాల్లో రెట్టింపు సొమ్మును వసూలు చేసిన బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.